# శంకరాద్వైత వ్యాసమాల - ౨


రచయిత :

**త్రిపురనేని విష్ణుశంకరరావు**

**గుడివాడ. (కృష్ణాజిల్లా)**

ప్రధమ కూర్పు :  500 కాపీలు
అక్టోబరు 1990
ద్వితీయ కూర్పు : 1000 కాపీలు
జనవరి 2013

కాపీరైటు మరియు ప్రాప్తిస్థానం :
రంగా & కో., గుడివాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

**ముద్రణ: శ్రీనివాస ప్రింటర్స్, విజయవాడ - 3.  ఫోన్: 0866-2576157**

**Sankaraadvaita series (3 books) are available at http://www.sankaraadvaita.com**

# శంకరాద్వైత వ్యాసమాల - ౨

గ్రంథకర్త : త్రిపురనేని విష్ణుశంకరరావు.

## అంకితము

ప్రాత:స్మరణీయ పాదారవిందులు గురుశేఖరులు,
తాతపాదులు, అద్వైతామృతవృష్టిని ద్రావిడ కేరళాంధ్ర
దేశములందెగాక యావద్భారతమున వర్షింపజేసి, బ్రహ్మామృత
సత్యమును పండించి వేదాంత కేసరి బిరుదాంకితులైన అనంత
శ్రీ విభూషిత పరమహంస పరివ్రాజికాచార్యవర్య
**శ్రీశ్రీశ్రీ బ్రహ్మీభూత ప్రణవానందస్వాములవారికి**
భక్త్యంజలి పురస్సరముగ ఈ శంకరాద్వైత వ్యాసమాల ద్వితీయ
భాగము పునరంకితము చేసుకొనుచున్నాను.




**రచయిత:**

**త్రిపురనేని విష్ణుశంకరరావు**



వీరి ధర్మపత్ని:

త్రిపురనేని ధనలక్ష్మి



శంభుడు
మణయ్య
త్రిపురనేని గోపాలరావు
రామస్వామి
రామయ్య
చలమయ్య
వెంకటాద్రి
మాధవరావు
శేషాద్రి
గోపయ్య
భార్య తులశమ్మ
(రచయిత, మాతాపితలు)
జానకిరాముడు
కేశవరావు
నారాయణరావు
శివరామయ్య
విష్ణుశంకరరావు, భార్య ధనలక్ష్మి
(రచయిత)
గోపీచంద్
గోవర్ధనచంద్
భార్య లీలాకుమారి
కస్తూరి
భర్త శిరిపురపు అంకయ్య
వెంకట రవి
నాగేశ్వరరావు
సచ్చిదానంద్
భార్య కేథరిన్
రోహన్
ఓర్లా

## మా గురుదేవులు



బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వామివారు
శ్రీ ప్రణవాశ్రమము
గుడివాడ

**శ్రీ ప్రణవానంద యతీంద్రులు**

# గురుదేవుని దివ్య సందేశము

ఓం శ్రీ గురవేనమ:

**4-2-69** తేదీన గుడివాడకు పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ నిత్యానందగిరి స్వాములవారు (అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షులు) వచ్చి శ్రీ శ్రీ శ్రీ ప్రణవానందస్వాములవారిని సందర్శించినపుడు వారొసంగిన దివ్య సందేశము.

## బ్రాహ్మీ స్థితి

పూజ్యపాద శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వాములవారు
శ్రీ ప్రణవాశ్రమము, గుడివాడ.

ఇప్పుడు నన్ను భూతమువలె పట్టిన ఈ రోగము కేవలము బాధపడుటకేర్పడింది గాక దేహపతనమునకే సంభవించినది. ఇందు మందులు వైద్యులు వారి సహకారము వలన ఏ మాత్రమును లాభం లేదు. అంత మాత్రమున మనసునకెట్టి సంకటమును లేదు. ఇదియు నొకవిధముగా శుభమునకే వచ్చినది.

మోక్షమనగా ఆత్మస్వరూపమే. అదియే అద్వైతము. అదే బ్రహ్మము. అది సజాతీయ విజాతీయ స్వగతబేధ శూన్యము. మఱియు శ్రీ భగవద్గీత ద్వితీయాధ్యాయము చరమ శ్లోకమున వివరించినట్లు "ఏషా బ్రాహ్మీ స్థితి: పార్థ" అను వాక్యమందలి అర్థము. బ్రాహ్మీ స్థితియేగాని ప్రాణ వియోగము మాత్రము కాదు. ఈ జగత్తులో సమస్త కర్మోపాసనలు దేహదృష్టితో చేయబడుటవలన దేహము ఆత్మ కాదు గనుక లేని దానిని ఉన్నదని భావించుట మిధ్యయే. కాబట్టి యిట్టి అనాత్మ భావన మోక్షము కాదు. నిద్రపోవు దానిని పేరు పెట్టి పిలిచినచో వాడెట్లు నిద్ర నుండి లేచునో అట్లే ఆత్మ స్వరూప లక్షణమును ఉపనిషత్ లక్షణముతో పోల్చి బోధించినప్పుడు స్వస్వరూపమే

బ్రహ్మముగా అనుభవమగుచున్నది. కావున జ్ఞానము బోధ రూపమే (జ్ఞానా దేవతు కైవల్యమ్). దీనినే జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవోబ్రహ్మైవనా పర:" అని ఉద్బోధించిరి. ఇది యొకటియే ఆది శంకరుల మతము. మిగతావన్నియు అవాంతరమతములే. నాలుగువేదములలో నొకటగు సామవేదాంతర్గత "తత్త్వమసి" వాక్యమే మహావాక్యము మిగతావి అనుసరణ వాక్యములే.

కర్మ, ఉపాసన ఈ రెండును అహంకారముతో చేయబడినవి తత్ ఫలానుభవము కూడా అహంకారమునకే మఱియు ఆత్మను అహంకారముగా నిశ్చయించినపుడు బంధము తప్పదు. సహజముగా అవివేకము వలన దీనినే బుద్ధి నిశ్చయించును గదా! చాలాకాలము ఈ ప్రతిబంధము నశించుటకై శ్రవణ మనన నిది ధ్యాసలు తప్పక చేసియే తీరవలయును. అందులకై గురు గృహవాస మత్యంతావసరము" సన్న్యస్య శ్రవణం కుర్యాత్" అను శాస్త్రోక్తి ననుసరించి సన్యాసాశ్రమ మేర్పడినది. ఇది సర్వ శాస్త్ర సమ్మతము. సర్వోపనిషత్సారము కావుననే "దైవం సత్యం జగన్మిథ్య" అను విచార మెల్లవేళల జ్ఞాపకముంచు కొనవలయును. ఇదియే అభ్యాస మొనర్చు కొనుట ఉత్తమము.

ఓం తత్ సత్.

ఈ దివ్య సందేశము ప్రస్తుత ప్రణవాశ్రమాధిపతులు శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాములవారి సాన్నిధ్యముననే ప్రవర్తిల్లినది.

# అభినందన

శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావుగారు అద్వైత వేదాంతములో విశేష కృషి చేసినారని, ఆ వేదాంతములోని సూక్ష్మ విషయములు పెక్కింటిని శాస్త్రాధ్యయనంవల్ల, గురూపదేశంవల్ల గ్రహించినారని వారు రచించిన శంకరాద్వైత వ్యాసమాల రెండవ భాగములోని వ్యాస పరంపర స్పష్టం చేస్తున్నది. శ్రీ శంకరరావుగారికి అద్వైత వేదాంతంపట్ల గల భక్తి శ్రద్ధలకు, అద్వైత వేదాంతాన్ని అందరకూ వెల్లడించాలనే వారి ఆసక్తికి ఈ వ్యాసాలు ప్రత్యక్ష నిదర్శనాలుగా ఉన్నాయి. విభిన్న విషయాలమీద వెలువరించిన అభిప్రాయాలు కాబట్టి ఈ గ్రంథంలో వ్యాసాలు విడివిడిగా ఉన్నప్పటికీ 'సూత్రే మణిగణాః ఇవ' అన్నట్లుగా అద్వైత విచారధార అన్నింటికీ ఏక సూత్రంగా ఉండి ఈ గ్రంథాన్ని ఒక మణిహారంగా తీర్చిదిద్దింది. అందుకు శ్రీ శంకరరావుగారు అభినందనీయులు. వారు తమ ఈ కృషిని కొనసాగించి భవిష్యత్తులో మరికొన్ని గ్రంథాలను వెలువరించగలరని ఆశిస్తాను.

శ్రీ అరవిందుల వేదాంతంలో ఆసక్తికల నన్ను శంకరాద్వైత వ్యాసమాలపట్ల అభిప్రాయాన్ని తెలుపవలసిందిగా శ్రీ విష్ణుశంకరరావుగారు కోరటం నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. ఆశ్చర్యం ఎందుకంటే సాధారణంగా అద్వైత వేదాంతులు శ్రీ అరవింద యోగ సాధకుల అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరటం చాలా అరుదు. ఆనందం దేనికంటే శ్రీ విష్ణుశంకరరావుగారు సత్యాన్వేషకులని, ఏ సిద్ధాంతంపట్లా వారికి మొండి పట్టుదల లేదనీ, వారి ఆసక్తి విషయ నిరూపణలో నేననీ వెల్లడి అయినందుకు. అలాకాక పోతే వారు నన్ను అభిప్రాయం తెలుపమని అడిగేవారేకాదు. వేదాంత విచారణలో ప్రప్రథమంగా కావలసింది విశాలదృష్టి. సర్వసత్యమూ అవగతమైనదనీ, తెలుసుకోవలసింది ఇంకేమిలేదనీ అనుకోవటం అహంభావ స్ఫోరకం కాబట్టి

సత్యాన్వేషణకు పెద్ద అవరోధం అవుతుంది. మనం కోరేదల్లా సమస్యలకు పరిష్కారాన్నే తప్ప ఒక సిద్ధాంతాన్నిగాని, ఒక వ్యక్తినిగాని సమర్థించటంకాదు. వేదాంత విచారణ ఒక మహాప్రవాహం. ఇందులో ఎన్నో ఘట్టాలు. ఎందరో మహనీయులు తపస్సంపన్నులు, అవతారమూర్తులు, కారణ జన్ములు ఉదయించి ఎన్నెన్నో ఆధ్యాత్మిక రహస్యాలను వెలికి తీసుకొనివచ్చారు. అటువంటి వారిలో శ్రీ శంకర భగవత్పాదులు అగ్రగణ్యులు. అనితరసాధ్యమైన మేధాసంపత్తి, నిశిత దృక్పథము గల ఈ మహాపురుషుడు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు లేదా బ్రహ్మ, వీటి పరస్పర సంబంధాన్ని గురించిన తన అనుభవాన్ని అనుపమాన ప్రజ్ఞతో అపార తర్క పాండిత్యములో సిద్ధాంతరూపంగా వెల్లడించారు. అద్వైత వేదాంతం మన ఆధ్యాత్మిక విచార స్రవంతిలో ఒక మహోజ్జ్వల ఘట్టమనటంలో ఎలాంటి సందేహమూ లేదు.

అయితే శ్రీ శంకరాచార్యులవారి అద్వైతం ఆధ్యాత్మిక సాధనలో చరమ వాక్యం కాదని గుర్తించాలి. నైష్కర్మ్యం సన్యాసానికి, సన్యాసం మోక్షానికి కారణం అవుతుందనీ, ఆధ్యాత్మిక సాధనకు అంతిమ లక్ష్యం మోక్షమని, అద్వైతం ప్రబోధిస్తున్నది. 'ఏకమేవా ద్వితీయం బ్రహ్మ' అనే శృతివాక్యం నిజమేగాని దానితో పాటుగా 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్న మరొక శృత్యర్థాన్ని కూడ మననం చేయవలసి ఉంటుంది. జీవజగద్బ్రహ్మల సంబంధాన్ని అద్వైత వేదాంతం సంతృప్తికరంగా వివరించినట్లు కనిపించదు. అందుచేతనే శ్రీ రామానుజులవారు జగత్తుకు వ్యావహారిక సత్యత్వాన్ని అంగీకరించవలసి వచ్చింది. సాంఖ్యదర్శనంగాని గీతగాని జగత్తు మిధ్యగా చెప్పినట్లు కనుపించదు. జగన్మిధ్యావాదం ఎంత వరకు ఈ సంబంధాన్ని స్పష్టపరిచింది అనేది వివాదాంశం.

శ్రీ అరవిందులు ఆధ్యాత్మిక సాధనకు చరమ లక్ష్యం మోక్షం కాక దివ్యజీవనంగా నిర్ధారించారు. వారి దృష్టిలో జగత్తు యదార్థమే. దివ్యజీవనం ఈ జగత్తులోనే సంభవం కావాలనీ కాగలదనీ వారు నిరూపించారు. తమ యోగానికి శ్రీ అరవిందులు కర్మయోగాన్ని పునాదిగా భావించారు. గీతావ్యాసాలు, యోగసమన్వయం, దివ్యజీవనం మొదలైన ఉద్గ్రంధాలలో శ్రీ అరవిందులు తమ తాత్త్విక ఆధ్యాత్మిక దృక్పథాన్ని

కూలంకషంగా చర్చించారు. ప్రపంచం ఎందుకు సృష్టి అయినది ? దీనిలోకి ఆత్మ ప్రవేశించినది ఏ ప్రయోజనం కొరకు ? మొదలైన ప్రధాన ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు శ్రీ అరవిందుల వేదాంతంలోనే లభ్యమవుతాయి. అయితే శ్రీ శంకర భగవత్పాదుల అనుభవాన్ని శ్రీ అరవిందులు కాదనలేదు. పైగా ఆ అనుభవం రానిదే దివ్య జీవన లక్ష్యం నెరవేరదని కూడ ఆయన స్పష్టం చేశారు. కాని అనుభవం వేరు ఆ అనుభవానికి ఇచ్చే సిద్ధాంత రూపం వేరు. తగాదా సిద్ధాంతాల మధ్యనేగాని అనుభవాల మధ్యకాదని విజ్ఞులెరుగుదురు. అనుభవాలు పరస్పర పోషకాలు కాగా సిద్ధాంతాలు పరస్పర విరోధులు. ఏ సిద్ధాంతం గొప్పది ? ఏ వ్యక్తి గొప్పవాడు అనికాక నేను తరించేదెలా ? నాకు ఎలాంటి సాధన అవసరం ? ఏ అనుభవం అవసరం అనేదే మన విచారణకు విషయంగా ఉండాలి. ఇదే నిజమైన జిజ్ఞాస. పరమేశ్వరానుగ్రహం కలవానికి తప్ప ఇలాంటి జిజ్ఞాస కలుగదు. శ్రీ శంకరరావుగారు అలాంటి జిజ్ఞాసువులు కనుకనే తాము అద్వైత వేదాంత పండితులై కూడా శ్రీ అరవిందుల అనుయాయుడనైన నా అభిప్రాయం కోరటం జరిగింది.

శ్రీ విష్ణుశంకరరావుగారి గ్రంథం జిజ్ఞాసువులైన వారందరు తప్పక చదువవలసిన ఉత్తమ గ్రంథం. సిద్ధాంతమే గాక సాధనను కూడ వివరించే వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

వారి ఈ ఆధ్యాత్మిక వ్యవసాయం మూడు పూవులు - ఆరు కాయలుగా ప్రవర్ధమానం కావాలని మనసారా కోరుకుంటున్నాను.

**తెన్నేటి పూర్ణచంద్రరావు,**

Regional and Joint Director of
Higher Education (Retired)

Hyderabad
25-9-90

తేది 14-10-1990

పూజనీయులైన శ్రీ శంకరరావుగారి పాదపద్మములకు అనేక సాష్టాంగ దండప్రణామము లాచరించుచు స్వామి ప్రజ్ఞానంద వ్రాయునది.

పరమపూజ్య శ్రీ ఓంకార గురుదేవుల ఆశీశ్శులతో మరియు పూజ్య జ్ఞానేశ్వరీ మాతాజీ వారి శుభాకాంక్షలతో వ్రాయుచున్నాను.

తమరు వ్రాయించిన లేఖలు తేదీ. 18-9-90 దీని రెండున్నూ, తేదీ. 11-10-90 వ్రాసిన కార్డున్నూ చేరినవి. చాల సంతోషము.

మీకు మాతాజీవారి సందేశము తెలియజేయుటలో జరిగిన జాప్యమునకు నేను చాల విచారించుచున్నాను. తమరు పంపిన గ్రంథము పఠించుచున్నందునను, మధ్య యెన్నో అంతరాయములు వచ్చుటచేతను వెంటనే మాతాజీవారి సందేశమును తెలియజేయలేక పోయినాను. వారు తమ అమూల్యమైన అభిప్రాయమును క్రింది విధముగా వ్యక్తముచేసిరి.

పూజ్యపాదులు శ్రీ శంకరభగవానులు తమ శ్లోకము "సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తి:" నందు వేదాంతసారమంతయు యిమిడ్చి యీ లోకమునకు అందించియున్నారు. మీ గ్రంథము యీ శ్లోకములో చెప్పబడిన సత్సంగత్వము" అనుదానికి పునాదిగాయున్నది. దీనిని ఆధారము చేసికొని యే జిజ్ఞాసువులు ఆధ్యాత్మికాభివృద్ధి కోరుదురో వారికి అది తప్పక లభించగలదని చెప్పినారు. మీరు వ్రాసిన గ్రంథము ప్రజోపయోగము పొంది, పలువురు తరించుటకు కారణమగుగాక యని వారి ఆశీస్సులు.

ఇట్లు,

**స్వామి ప్రజ్ఞానంద,**

శ్రీశాంతి ఆశ్రమము.

## శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు తమ ఆశ్రమ భక్తులు విజయానంద ద్వారా పంపిన సందేశము.

17-10-1990

శ్రీ విష్ణుశంకరరావుగారు రచించిన "శంకరాద్వైత వ్యాసమాల-2" అను పేరుగల గ్రంథము చిన్నచిన్న ఆధ్యాత్మిక వ్యాసములతో కూడి ముముక్షువులకు అత్యంత ఉపయుక్తమై అలరారుచున్నది. పరమార్థసాధకుడు ఎట్టి సాధనలను ఆచరించవలెనో, మనస్సును ఏవిధముగ నిగ్రహించవలెనో, ప్రశాంతిని బడయుటకు ఏయే మార్గములను అవలంబించవలెనో రచయిత ఈ గ్రంథమునందు సులభమైన భాషలో చక్కగ విశదీకరించియున్నారు. భగవత్కృపచే వారు ఇంకను ఇట్టి సద్గ్రంథములను రచించి ఆధ్యాత్మిక వాఙ్మయమును బహుళముగ ప్రచార మొనర్చుదురుగాక !

ఇట్లు
**శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములు**
శ్రీ శుక బ్రహ్మాశ్రమము, కాళహస్తి.

## శ్రీ స్వామి బోధనాందపురి పంపిన అభిప్రాయము

05-10-1990

శ్రీ వివేక, విజ్ఞాన స్వరూపులైన శంకరావుగారికి, ప్రేమపూర్వక శ్రీ దేవీ స్మరణలు, క్షేమం.

మీరు శ్రీవారికి వ్రాసిన ఉత్తరం చేరినది. మంచి పనులు చేయుచున్నందుకు శ్రీవారు చాలా సంతోషించినట్లు తెలుపమనిరి. వయస్సు పెద్దదైనందున చేయి వణుకుచున్నందున ప్రత్యేకంగా వ్రాసి పంపు వోపికలేదు. మీకు శ్రీవారు అనేక ప్రేమపూర్వక శ్రీ దేవీ స్మరణలు తెలుపమనిరి.

ఇట్లు
**మాతృశ్రీ**
**యోగినీమాత.**
శ్రీ విశ్వనాథ మఠము, చింతలపూడి, ప.గో.

# శ్రీ స్వామి సహజానందగిరి వారి అభిప్రాయము

**24-09-1990**

మహాశయా!

మీరు ఇచ్చిన బ్రహ్మవిద్యా ప్రతిపాదకమైన ప్రకరణ శాస్త్రమును మొదటినుంచి చివరిదాకా శ్రద్ధాభక్తివిశ్వాసములతో చదివితిని. ఈ ప్రకరణము మధ్యమాధికారినిం గురించి వ్రాసినట్లు అర్థంచేసుకొంటిని. వాస్తవముగా మధ్యమాధికారులకు బోధింపదగిన ప్రకరణము లేదు. ఇది "ధర్మంచర; సత్యం వద" అనే వైదిక వాక్యము మీరు దీనిలో ఉ దహరించియున్నారు. యదార్థముగా ఏ మహనీయులు బ్రహ్మవిద్యాశాస్త్రమును రచించినవారు వారి గ్రంథమునందు ఔపాసన విధంగా ఏదో మొదటనో, చివరినో, పైననో, క్రిందనో ఉదహరించినారే కానీ దీని ఈ వాక్యద్వయముయొక్క అర్థమును లేక తాత్పర్యమును అనుసంధాన విధానముగా ప్రమాణ పూర్వకముగా సత్యధర్మ వాక్యములకు విపులమయిన వ్యాఖ్యానము ఎవరూ వ్రాసియుండలేదు. సత్యంవధ ధర్మంచర అనే వాక్యములకు విపులమయిన వ్యాఖ్యానము చేసియున్నారు. న్యాయంగా ఈ రెండు పదములను బాలబోధక వాక్యములను సాధారణమగు వాడుక. అందుచేత దీనియందు ఈ గ్రంథరాజమందు (ప్రేయస్సు), (శ్రేయస్సు), (అభ్యుదయ ప్రాప్తి) శ్రేయోరూపమైన కైవల్యసిద్ధిని పొందుటకు సాధనలు, అభ్యాసములు విపులముగా చర్చించిరి. చాలా సంతోషము.

ఇట్లు
**శ్రీ శ్రీ శ్రీ స్వామి సహజానందగిరి**
శుకాశ్రమము,
సత్రంపాడు (ఏలూరు)

# ఆ శ్రా వ ణ

**శ్లో॥ ముగ్ధమోహన రూపాయ మురాంతకాయ జిష్ణవే,**
**కార్యకారణభూతాయ కమలాపతయేనమః॥**

**నిత్యం శుద్ధం బుద్ధమజం దేవమనంతమవ్యయం,**
**పరం నిర్వికల్పమేకం బ్రహ్మతత్సముపాస్మహే॥**

**శ్రీ శంకరాశీర్వాద పురస్సరం శ్రీ శంకరాద్వైత వ్యాసమాలాంపై,**
**శ్రీ టీ.వి. శంకరరాయాశ్చకార, శంకరోశంకరోతు శంకరాయ॥**

శ్రీ మదోంకారోట్టంకితామాత్ర తురీయ బ్రహ్మమొక్కటియే ఉన్నదని శ్రీ శంకరాద్వైత వ్యాసమాల-2లో ప్రతిపాదింపబడినది. మృతినొందినవారికి (వానికి) జగత్తులేదు. మరణమే సహజము. జీవనమసహజము. నాసికాది నవరంధ్రములద్వారా ప్రాణపక్షి ఎగిరిపోవుట వింతకాదు. ఉండుటయే చోద్యము. తృటి కళాక్షణములలో పోవు ప్రాణవాయువిది. "నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః" మిత్తి మిమ్ము వెంటాడి వేటాడును. దివ్వెయుండగనే యిల్లు చక్కబెట్టుకొనవలెను. ఈ ధర్మము 1. ధర్మము 2. శాశ్వత ధర్మములని రెండు విధములు సామాన్య ధర్మములగు ధృతి, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, బుద్ధి, విద్య, సత్యము, అక్రోధమను యీ పదియును సాకారభక్తునికుండి తీరవలయును. భక్తియనగా (1) సాపరమ ప్రేమ రూపా అనురక్తిరీశ్వరే. (2) భగవద్విషయకాంతః కరణవృత్తివిశేషః భక్తిః॥ అని నారద భక్తి సూత్రములు పేర్కొన్నవి. ఈ భక్తిలో మానవుడు స్వర్గాదిలోకముల నొందును.

శాశ్వత ధర్మము:- సర్వేంద్రియ జయము, అమనస్కత, జ్ఞానస్వరూపస్థితి, అనగా అనృత జడ దుఃఖాత్మకమునకు ప్రతి యోగియైన సచ్చిదానంద స్వరూపము గుర్తెరింగి మౌనవ్యాఖ్యా ప్రకటితపరబ్రహ్మ తత్త్వము తానగుటయే శాశ్వత ధర్మమార్గమగును.

సత్కర్మాచరణము చేసి మానసమును పావనము చేసికొని, ఏకోశ్వరోపాసన చేసి, విక్షేపదోషమును తొలగించుకొని, స్వస్వరూపాను సంధానము చేసికొనుటయే.

సాకారమార్గమున పరిపక్వత పొందిన పిదపనే మానవుడు నిరాకార భక్తి మార్గము అనగా సద్యోముక్తిమార్గమునకు యోగ్యుడగును.

**శ్లో॥ మృతామోహమయీ మాతా జాతోజ్ఞానమయస్సుత:**
**మృతజాతా శౌచౌప్రాప్తౌ కధంసధ్యాముపాసేయం**

**శ్లో॥ హృదాకాశేచిదాదిత్యో భాసతి బాసతి సదా**
**నాస్తనేతినచోదేతి కథం సంధ్యాముపాసేయం॥**

శ్రీ టి.వి. శంకరరావుగారు తమ అనుభూత్యాచరణ ప్రచారములతో ఈ ఉ దాత్త ఉత్తమ గ్రంధమును రచించిరి. కొన్ని ఈ వ్యాసములు పెక్కు ఆధ్యాత్మిక పత్రికలలో లోగడే ప్రచురింపబడినవి.

**శ్లో॥ "విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామి సంబంధత:**
**శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా అభేదత:"**

వీరిని ఆశీర్వదిద్దామంటే ఆత్మగురువులు. శిక్షిద్దామంటే వృద్ధసిద్ధ శిష్యులు. గురువు శిష్యుడాయె. శిష్యుడు గురువాయె. గురుశిష్యులు బ్రహ్మమాయె అనునది గుర్తెరింగి, మరి యొక వ్యాసమాలను వ్రాసి ఉపనిషత్సార గాన సుధను, వేదాంత అమృతమును లోకముతో బాటు నాకు గూడ పాలుపంచి పెట్టమని ఉవ్విళ్లూరుతూ ఉంటాను. మిన్నకుంటాను.

బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావు గారు సత్యశివ సుందరాభినివేశముతో పావనమానసభావనలతో అమోఘ తీవ్ర కృషిసలిపి వేదాంత సాగరమును మధించి ఈ అమృతమును వెలికి తీసినారు. ఆధ్యాత్మిక లోకము దీనిని సావధానముగా సమీక్షచేసి ఆదరింతురని ఆశించుచున్నాను. నాస్తిక భావముయొక్క తుట్టతుదలో, కొట్టకొనలో జ్ఞానవిజ్ఞానాస్తిత్వ భావము పీఠము పెట్టుకొని కూర్చున్నది.

నీవు కలవు నిజము - నిజముగా నాన్నయు
అమ్మ కలరు నీకు - అమ్మ (వేదమాత) చెప్పె
నాన్న యీ తడంచు నాస్తికత్వ మేదరా
సుంకరార్యు సూక్తి సూనృతంబు ॥

ఈశ్వరుండు కలడు - ఈ విశ్వమందున
లేదనెడియతండు లేడె తాను
తనకు కలరు తాత (త్రాత) తండ్రి ముత్తాతలు
సుంకరార్యు సూక్తి సూనృతంబు ॥

ఆదిశంకరు నద్వైత మాత్మబోధ
కమ్ము నాద్యంతమాత్మనిగ్రహముతోడి
శ్రవణమనననిది ధ్యాసల వశమనరు
చుకొని (ఈ) శంకరాభిద నూత్న శుకమహర్షి ॥

ఉత్తమ గ్రంధము లొనరించె నుత్తముండు
ఆరురుక్షువర్గమ్మిద్ది అతులనిష్ఠ
పఠన పాఠనబోధానుభవము లొప్ప
రూఢి సచ్చిదానంద స్వరూపమగుత ॥

సచ్చిదానందరూపక సత్యమెఱిగి
అనృతజడ దు:ఖరూప దేహమ్మెఱింగి
మసలుకొనువాడె పోసుమ్ము మనుజుడిలను
పరమశాంతిని సిద్ధిని బడయగలడు ॥

ఆ తెలివి తాను, మేను నేననుటకల్ల
తెలివిలో కానబడునట్టిదే జగంబు
జ్ఞాన మజ్ఞానాంధకారముననను
తవిలె, తన్నుతాతెలియుటే తత్త్వమరయ ॥

ఇట్లు
మీ

గుడివాడ.
25-10-1990

విద్వాన్ విద్యాసద్మ, వైద్యమిత్ర, కవిమిత్ర
**సుంకర శివరామకృష్ణయ్య చౌదరి**

# O P I N I O N

**DR. Y. VENKATESWARA RAO,**
M.Sc., Ph.D.,
PRINCIPAL,
Akkineni Nageswara Rao College.

GUDIVADA.
521 301
Dt. 24-10-1990

Dear Sri Vishnu Sankara Rao garu,

I thank you for kindly sending a copy of 'Sankaraadvaita Vyaasamala-2' and I am glad to write the following few lines.

Sri. T. Vishnu Sankara Rao hails from a family of deep abiding attachment to things spiritual and religious. Though he has not had formal instruction in Sanskrit he has picked up enough proficiency in it through self study and constant participation in spiritual discourses of learned scholars and gurus, especially Sri Pranavananda Swamy, the sage of Pranavaasramam, Gudivada.

He has developed a profound liking and an ardent love for Sankaraadvaita during the course of many years of his keen study of religious philosophy and contributed articles on different aspects of this ennobling branch of Vedanta in several learned journals and gave lectures to eager gatherings, big and small, in various places in our State. His rational approach, his grasp of the subject, his interpretative skills, his ability to explain the subtle nuances of Vedic and Upanishat truths make him a much sought after speaker. What is more, he sincerely believes in living what he teaches to the best of his ability. This aspect alone is enough to endear him at once to whoever comes into contact with him.

His Sankaraadvaita Vyaasamala-2, obviously the second in a series, contains articles some of which appeared elsewhere and some written recently. I have gone through the book and am greatly profited from it. I am sure that this will be a welcome addition to the existing literature on the subject.

Because of the esoteric nature and importance of the subject matter dealt with the book would have vastly enhanced value had there been fewer printing errors.

Yours sincerely,

# శ్రీ నిర్వికల్పానందభారతి స్వాములవారి అభిప్రాయము

శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావుగారు నాకు చిరపరిచితులు. శ్రీ ప్రణవాశ్రమ శ్రోతలలో ముఖ్యులు. వారు రచియించిన శంకరాద్వైత వ్యాసమాల-2 నాకు యిచ్చి నా అభిప్రాయమును ఇమ్మని కోరినారు. నేను గ్రంథమును ఆమూలాగ్రముగ పరిశీలించి అందలి సారగ్రహణముచేసియే నా అభిప్రాయమును వ్రాయుచున్నాను.

అస్మద్గురుదేవులైన బ్ర॥ భూ॥ శ్రీ శ్రీ శ్రీ ప్రణవానంద స్వాములవారి వద్ద బహుకాలముగా వేదాంత శ్రవణముచేసి వారి అనుగ్రహాశీర్వాదములను బొంది తత్త్వరహస్య మెఱింగి పలు ప్రాంతములలో జిజ్ఞాసువులకు సులభసాధ్యముగా నెఱిగింపజేయుచు, ఇప్పుడు వేదాంతాభిలాషులకు శాశ్వతముగా ఉపయోగపడునట్లుగా నుండుటకు శంకరాద్వైత వ్యాసమాల రూపముగా గ్రంథములు రచించుటలో ఇది రెండవది. మరికొన్ని గ్రంథములను కూడ రచించి పాఠకలోకమునకందించ గలందులకు భగవత్స్వరూపులగు గురుదేవులనుగ్రహించగలరని అనిశము మది దలంచెదను.

నష్టోమోహః స్మృతిర్లబ్ధా

త్వత్ప్రసాదాన్మయా'చ్యుత / అర్జున వాక్యము.

స్మృతిర్లబ్ధా = ఆత్మతత్త్వవిషయమగు స్మృతి పొందబడినది.

నష్టః మోహః = అజ్ఞానజమయిన, సమస్య సంసారహేతువు నశించినది.

త్వత్ప్రసాదాత్ = గురుని అనుగ్రహమువలన అని మూడు విషయములు తెలుపబడినవి.

నరుని పుట్టుక **మోక్షమనే లక్ష్యాన్ని** సాధించుటకే. మోక్షమనగా **మోహక్షయము.** మోహమనగా తన అజ్ఞానమువలన తోచు అవివేకము. (అవిద్యాకృత కర్తృత్వ భోక్తృత్వాది సంసారమని అర్థము) ఇక్కడ మోహ నాశనమునకు స్మృతిలాభమునకున్నూ అసాధారణ

కారణమునే త్వత్ప్రసాదాత్ అని తెలుపబడినది. (అనుగ్రహమును కారణముగా తెలిపిరి అని) స్వయం జ్యోతియగు ప్రత్యక్ రూప ఆత్మయందు అవిద్యా "**భ్రమము**" విద్యచే తొలగుచున్నదని అర్ధము. "**విద్య**" అనగా అజ్ఞాతమైనదానిని తెలుపునది కాదనియూ అర్ధము.

ఇట్టి తత్త్వ ప్రకాశముగల యీ గ్రంథము గ్రంథకర్త యొక్క కృషిని ప్రకాశింపచేయుచు జిజ్ఞాసులోకమును కూడ మేలుకొల్పునని పాఠకులు గుర్తించగలరు అని తలంచుదును. దృఢముగా నిశ్చయించు "**తత్త్వము**" సాక్షాత్కారముకంటె వేరుకాదనియు గురుదేవులు పలుకుచుండెడివారు. గనుక అట్టి "**అనుగ్రహముననే**" బోధరూపమును మోహనివృత్తియు అగుచున్నది. భ్రమ నివృత్తియే అధిష్ఠానరూపము అనే అర్ధంగా యిచ్చట గుర్తుకు తెచ్చుకొనవలసియున్నది.

ప్రమాణములతో ఏది సిద్ధమగుచున్నదో అది సత్యమనుటను సరికాదని ప్రమాణ విచారముతో సర్వులు తెలుసుకొనవచ్చు. అనగా ప్రమాణ విచారమువలన ప్రమాణములద్వారా కలుగు జ్ఞానమును యదార్ధమనుట **సర్వసమ్మతము కాదు.** మరియు ప్రమాణ జ్ఞానమునకు స్మృతియొక్క సహాయము అవశ్యము కావలసియున్నది. గనుక ప్రమాణ జ్ఞానము యదార్ధమనుట **కష్టము.** ప్రమాణము అనగా ప్రత్యక్షాది జ్ఞానకరణము, ప్రమేయము అనగా ఎఱుగబడెడి విషయము (శబ్దాదులు). జ్ఞానమునకు ఇంద్రియములు మనస్సు సాధనముగా బయటి ప్రపంచమును మాత్రం కొంతవరకు తెలియవచ్చు. దీనిని "**అనుభవము**" అందుము. దీని ఆధారముతో మరి కొన్నిటిని ఊహించి తెలియవచ్చు. అనగా అనుభవ ఆధారముతో కలుగు స్మరణను స్మృతి అని పిలుచుదురు. ఈ స్మృతి అనుభవానుసారము యదార్ధముగానే ఉండవలయుననే నియమం లేదు. ఆయదార్ధముగాను ఉండవచ్చును. దీనిని "అనుమాన ప్రమాణ' మందుము. యోగ్యమైన ప్రమాణముతోను విషయము వుండుటను తెలియనప్పుడు అక్కడ లేదనియు నిశ్చయించుట "**అనుపలబ్ధి ప్రమాణమందురు**" ఇట్లు "**ప్రమాణ**

**<u>వ్యవహార విషయమును</u>"** భ్రాంతి అనియు మిథ్యాజ్ఞానమనియు లేక విపరీత జ్ఞానమనియు తెలియవచ్చు. **"<u>మరుభూమిని - నీరుగా తెలియుట</u>"** "ఆకాశమున నీలవర్ణము వున్నదనుట" "మందాంధకారమున - త్రాడును పామనుట", "సూర్య ప్రకాశములో మెరయుచున్న శుక్తిని వెండి అనుటయును", భ్రాంతి దృష్టిగా గుర్తించవచ్చు.

(1) ఇంద్రియములతో కలుగు **<u>ప్రత్యక్షానుభవము</u>** (2) మనస్సునందు కలుగు **<u>సుఖదు:ఖానుభవము</u>** (3) బుద్ధియందు కలుగు వేదనానుభవము యీ మూటి వ్యవహారమునే **"<u>అనుభవమను</u>"**చున్నాము.

**<u>ఈ ప్రమాతృ ప్రామాణ ప్రమేయ రూప వ్యవహారమునందు</u>**

1. వ్యపదేశము = మాటలతో చెప్పుట

2. ప్రత్యయము = మనస్సుతో వృత్తులద్వారా తెలిసికొనుట.

3. ప్రవృత్తి = కార్యమందు ప్రవర్తించుట ఈ మూటిని వ్యవహారము అందురు. ఇది **"<u>జాగ్రతయందు</u>** జరుగును" **<u>దీనిని వ్యవహారావస్థ అనవచ్చు</u>**. మరియు ప్రమాతృదృష్టియొక్క అవస్థ అనియు అనవచ్చు. అనగా

1. ఇంద్రియములతో యెరుగువానిని "ప్రమాత" అనియు

2. క్రియలు చేయువానిని "కర్త" అనియు

3. ఫలమును అనుభవించువానిని "భోక్త" అనియు పిలచెదరు. దీనినే **<u>కర్తృత్వ భోక్తృత్వ రూపసంసారమందురు</u>**. ఇంతవరకు వ్యవహారావస్థ యందు **"<u>అనుభవము</u>"** అను శబ్దమునకు ఎటువంటి అర్థముతో ఉపయోగించుచున్నాము ? అనేది తెలుసుకున్నాము.

ఐతే ఇది వ్యవహార అవస్థ అని మొత్తముగా అవస్థను తెలిసికొనుట దేని బలముతో? ఏ సాధనను మనము ఉపయోగించుచున్నాము ? ఇక్కడ మనము ఏ సాధనను ఉపయోగించము. ఇది మెలుకువ అనునది మనకు **<u>నేరుగా కనబడుచున్నది</u>**. మన

స్వరూపమే అనుభవాత్మకమగుటచే దీపపు ప్రకాశములో క్షేత్రమంతయు ప్రయత్నము నపేక్షించక తోచువిధమున వ్యవహారావస్థ అంతయు ఈ అనుభవమునకే గోచరమగుచున్నది. ఈ అనుభవమునకు లోబడని వస్తువే లేదు. ఇది **"<u>మన స్వరూపమే</u>"**. వేదాంతులు దీనినే అనుభవమని పిలచుదురు. ఇది వక్కటే ముఖ్యార్థమందు **<u>అనుభవము</u>** అనబడును. ఇక్కడ ప్రమాణ ప్రమేయ వ్యవహారమునందు **<u>ప్రమాత అని</u>** అనిపించుకున్నవారు **<u>అనుభవరూపుడే</u>** అయివున్నాడు. **"<u>నేనో, నేను కాదో</u>"** అని **<u>సంశయం కలుగదని</u>"** అర్థము.

పైన వివరించిన విధముగ జాగ్రదవస్థయందు జరుగు వ్యవహారమును, **<u>వ్యవహారావస్థ</u>** అనవచ్చుననియు, లేక **<u>ప్రమాతృదృష్టి</u>** యొక్క అవస్థ అనవచ్చుననియు, దీనినే కర్తృత్వ భోక్తృత్వ దృష్టి కల **<u>సంసారమని</u>** పిలుతురు. అనియు తెలిసికొన్నాము.

ఇది వ్యవహారావస్థ అని మొత్తముగా అవస్థను తెలుసుకొనుటకు మనము ఏ సాధనము ఉపయోగించకయే మన స్వరూపమే అనుభవాత్మక మగుటచేత ఈ **<u>అనుభవమునకే</u>** గోచరించుచున్నదనియు తెలిసికున్నాము.

అనగా ప్రమేయమును గుర్తుపట్టుటకు ప్రమాణము కావలెను. ప్రమాతను నిశ్చయించుటకు ప్రమాణము అక్కరలేదు. ఎట్లన ? "నేను ఉన్నాను" అనుకొనియే ఏదైనా ప్రమేయమును తెలిసికొనుటకు ప్రమాణమును ఉపయోగించెదము అని అర్థము.

1) ఇది ఇట్టి వస్తువు అని **<u>గుర్తించుటయు</u>**

2) ప్రమాణములను **<u>ఉపయోగించుటయు</u>**

3) వ్యవహారకాలమున **<u>ప్రమాత</u>** అనిపించుటయు

**"<u>నేను</u>"** అనుభవ రూపమై ఉండుటయే కారణము. అనగా **<u>పరమార్థమైన అనుభవమే</u>** ప్రమాత ప్రమితి అను వ్యవహారముగా గోచరించుచున్నది.

ఉదా:- గోడమీద వేసిన బొమ్మకు గోడ ఆధారమన్నట్లు అన్ని వ్యవహారములకు ఆధారము **"<u>నేను అను అనుభవమే</u>"**

* మనమందరము 1) తెలుసుకొనుట, 2) ఇచ్ఛగించుట, 3) కర్మను చేయుట, 4) ఫలమును అనుభవించుట అను వ్యవహారములను చేయుచునే యున్నాము అని గుర్తించాలి.

సర్వాధారముగానున్న ఈ అనుభవమునే తెలియకుండా వున్నాము అని అర్థము. ఈ రహస్యమును గుర్తుచేసినవారు శ్రీ భగవత్పాదులవారే. ఈ రహస్యమునే ఉపనిషత్తులు ఉపయోగించినవి అనియూ తెలియవలెను.

ఉపనిషత్తులయందు గర్భితమైయున్న యీ రహస్యమునే శ్రీ శంకర భగవత్పాదులు లోకమునకు వెల్లడించియున్నారు. ఈ ఉపనిషత్సారాంశమునే శ్రీ టి.వి. శంకరరావుగారు తమ శంకరాద్వైత వ్యాసమాలలో క్లుప్తముగా వివరించిరి.

ఓం - తత్ - సత్

ఇట్లు,

**శ్రీ నిర్వికల్పానందభారతిస్వామి,**

ప్రణవాశ్రమము, గుడివాడ.

# కృతజ్ఞతా వచనములు

నా ఈ శంకాద్వైత వ్యాసమాల-2 ఆదరపూర్వకముగా అందుకొని శ్రద్ధతో అందలి వ్యాసముల పరిశీలించి నాకు అత్యధిక ఆనందోత్సాహములను కలుగజేయుచు అభినందనలు పంపిన హైదరాబాదు నల్లగుంట వాస్తవ్యులు Retired Regional Joint Director of Higher Education మరియు నల్లకుంట అరవింద భవనములో Essays on Gita Synthesis of Yoga అను గ్రంథముల మీద ప్రతి బుధవార, ఆదివారములు ప్రతిభావంతముగ శ్రోతలకు సులభగ్రాహ్యమగునట్లు ఉపన్యసించుచు, తమ శేష జీవితమును, తమ వక్తృత్వ ప్రతిభను శ్రీ మాతారవిందులు వెలువరించిన తత్త్వరహస్యముల ప్రబోధ ప్రచారములందు వినియోగించుటకు దృఢ నిశ్చయులైన మిత్రులు శ్రీ తెన్నేటి పూర్ణచంద్రరావుగారికి, మఱియు ఏలూరునందు సత్రంపాడులో బ్రహ్మానంద గురుకులాశ్రమము స్థాపించి బహుకాలము బ్రహ్మవిద్యాప్రచారము సలిపిన బ్ర॥ భూ॥ శ్రీ శ్రీ శ్రీ జగద్గురు బ్రహ్మానందగిరి స్వాములవారివద్ద గురూపదేశము పొంది, సత్రంపాడునందు శుకాశ్రమము స్థాపించి ఏలూరు పట్టణమునందు, పరిసర గ్రామములనందును గీతా ప్రవచనములు ప్రజాకర్షనీయముగ శ్రోతల కందించుచు బహు శిష్యవర్గమును మేల్కొల్పిన శ్రీ శ్రీ శ్రీ స్వామి సహజానందగిరిగారికిని, తోటపల్లి కొండలు శాంతి ఆశ్రమాధిపతులు ఖండాంతరముల, యిచ్చట పెదవాల్తేరునందుగల శాంతి ఆశ్రమము మున్నగు ఆశ్రమములలోను నిరంతరము ప్రపంచ శాంతి ప్రచారము, అన్నదానములు సల్పుచు జిజ్ఞాసువులు, యోగాసన, ప్రాణాయామ, భక్తి జ్ఞానములద్వారా అభివృద్ధి చెందుటకు పూర్ణావకాశమునిచ్చు శ్రీ శ్రీ శ్రీ జ్ఞానేశ్వరి మాతగారికిని, శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమాధిపతులు, ఆంధ్రదేశములో బహు ప్రాంతములలో గీతా జ్ఞాన యజ్ఞములు సలుపుచు సామాన్య జనులకు సుబోధకమగురీతిలో బహు ప్రజా

హృదయములలో దైవభావ ముదయింపచేయుచున్న శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారికిని, పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి శ్రీ విశ్వనాథ మఠ స్థాపకులు వయోవృద్ధులు ప్రత్యేకముగా వ్రాసిపంపు దేహారోగ్యస్థితిలో లేనందున శ్రీవారు అనేక ప్రేమపూర్వక శ్రీదేవీ స్మరణలు తెలుపమని ఆశ్రమవాసి మాతృశ్రీ యోగినీమాత ద్వారా పంపిన శ్రీశ్రీశ్రీ బోధానందపురి స్వాములవారికిని, గుడివాడ ప్రణవాశ్రమాధిపతులు బ్రాఃభూః శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వాములవారికి నలుబది సంవత్సరములు భక్తి ప్రేమ శ్రద్ధలతో సేవచేసి, వారి అనుగ్రహాశీర్వచనములతో సన్యాస స్వీకరణముచేసి తదాది ప్రణవాశ్రమ కార్యక్రమములను బహుశ్రద్ధాభక్తులతో నిర్వర్తించుచున్నట్టియు ముప్పది సంవత్సరముల పరిచయభాగ్యము నాకు యిచ్చి ప్రతిదిన సత్సంగముచేయు అవకాశము కలిగించినట్టియు నిరంతరము ఆధీతి, ప్రవచన ప్రబోధ ప్రచారములతో అద్వైతమును కొనసాగించుచున్నట్టి శ్రీ శ్రీ శ్రీ నిర్వికల్పానందభారతీస్వాములవారికిని, గుడివాడ వాస్తవ్యులు విద్వాన్ విద్యాసద్మ వైద్యమిత్ర కవిమిత్ర బిరుదాంకితులు, నిత్య సత్సంగాభిలాషులైన శ్రీ సుంకర శివరామకృష్ణయ్య చౌదరిగారికిని, గుడివాడ A.N.R. కాలేజి ప్రిన్సిపాలు, సాహితీవేత్తలు, U.S.A. యందు కొంత పాండిత్య ప్రతిభలను సంపాదించుకొని, కళాశాల వ్యవహారములను అతిశ్రద్ధానిపుణతలతో నిర్వర్తించుచు విద్యార్థి లోకమునకు సన్మార్గదర్శకులైయున్న కులపతి శ్రీ యెర్నేని వెంకటేశ్వరరావు, M.Sc.Ph.D. గారికిని మా కృతజ్ఞతాభివందనములు అర్పించుకొనుచున్నాను.

గ్రంథప్రచురణమందు శ్రద్ధాతత్పరతగల్గి అచ్చుపని నిర్వర్తించి సకాలములో పూర్తిచేసిన శ్రీ అశోకా ఆర్టు ప్రెస్ గుడివాడ వారికి, గ్రంథము ముద్రించు సమయమున ప్రూఫులు చూచుటలో బాధ్యత వహించిన రంగా అండ్ కో ప్రొప్రైటర్ శ్రీ చక్కా పాండురంగారావుగారికి, మామిడి నరేంద్రబాబుగారికి, పుల్లేటి లక్ష్మీనరసయ్యగార్లకు నా కృతజ్ఞతలు.

మామూలు గృహస్థుడుగా ఎక్కువ విద్యా పాండిత్యములు లేకపోయినను, నాచే వ్రాయించిన అద్వయబ్రహ్మ మనదగు గురుదేవులైన శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వాముల వారికి భక్తి పూర్వక ప్రణామములు అర్పించు కుంటున్నాను. ఇందు దొర్లిన సంధి వ్యాకరణాది దోషములను మన్నించి గుణములను గ్రహించి నన్నానంద పెట్టగలరని పాఠకలోకమునకు విన్నవించుకొనుచున్నాను.

ఇట్లు,

భక్తి ప్రపత్తులతో విధేయుడు,

**త్రిపురనేని విష్ణుశంకరరావు**

# మా మాట

నేను గురుకృప, ఆశీర్వచన బలములచే శంకరాద్వైత వ్యాసమాల అను వేదాంతగ్రంథమును 1989అక్టోబరు నెలలో రచియించి సత్పురుషుల కరకమలములకు అందించియుంటిని. జీవబ్రహ్మైక్య విజ్ఞానమునే ధ్యేయముగా నుంచి వ్రాసిన ఈ వ్యాసమాలను చదివిన వారు చాల సంతసించి నన్ను ఆనంద పరుస్తూ ఇట్టి గ్రంథములను వ్రాయుటకు నాకు సమధికోత్సాహమును కల్గించుటచే, వారిచే ప్రభావితుడనైన నాకు ఈ గ్రంథమును వ్రాయవలయునని ప్రేరణ కలిగినది.

కర్మ వలన గలిగిన ఫలం వాసనారూపం ధరించి మరల కర్మకు ప్రేరేపిస్తుందని శాస్త్ర వచనము. వాసన లణగినపుడు గదా ముక్తి అని చెప్పుచున్నాము. పూర్వగ్రంథ రచనా ఫలవాసనా గదా యీ గ్రంథ రచనకు కారణం అని ఆలోచించి కొంచెము వెనుకాడితిని. కొంత తడవు విచారించగా రాగద్వేషములతో ఫలాపేక్షతో చేయు కర్మలకే వాసనలుండును గాని, ఖ్యాతి లాభరహితముగా సర్వాత్మ దృష్టితో పరమార్థమునకు చేయు కర్మలు వాసనా రహితములు గదాయని తలంచితిని.

**శ్లో॥ మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త: స్సఙ్గ వర్జిత: ।**
**నిర్వైర స్సర్వభూతేషు య: స మామేతి పాణ్డవ: ॥** **భ.గీ.అ.11.శ్లో.55**

అర్జునా! నా కర్మలను చేయుము. నన్నే పరమపురుషునిగను పరమ గమ్యముగను స్వీకరింపుము. నా భక్తుడవగుము. సంగము లేకయుండుము. అటులే సర్వభూతములందును వైరము లేకయుండుము. ఏలన అట్టి మానవుడు నన్ను చేరును. అను శ్లోకము జ్ఞప్తికి వచ్చినది.

రామభక్తుడు రాముని నిత్యస్మరణ చేయుటకై రామకోటి వ్రాసి ఎట్లు తరించుటకు ప్రయత్నించుచున్నాడో, అట్లే జీవుడు దేవుడేనని నిర్ణయించుకున్న నేను తద్భావమును

నిది ధ్యాసనము చేయుటకు, అట్టి వ్యాసరచనా వృత్తి యందుండుట సముచితమేనని నా మదికి సమాధానపడితిని. నిమ్న ప్రకృతి అనగా రజోతమోగుణ ప్రభావము నణంచి, ఉచ్ఛ ప్రకృతి అనగా సత్వప్రకృతి యందు తగు ప్రయత్నముచేసి నిలుచుటకు ఇట్టి కర్మ అవసరమనియే గుర్తించి ఈ గ్రంథ రచనా కర్మకు ప్రారంభించితిని. తత్త్వమును గ్రహించి చుయు కర్మ అది అకర్మయేయగును. అనగా వాసనారహిత దివ్యకర్మ యగును.

ఈ గ్రంథము కూడ ముప్పది వ్యాసములలో గూడి అద్వైత వ్యాసమాల-2 అను నామముతో ప్రచురించి పాఠక లోకమున కందించుచున్నాము. ఇందు కొన్ని వ్యాసములు జీవ బ్రహ్మైక్య భావనా రూపముగను, కొన్ని అందుకు సాధనా రూపములుగ ఉన్నవి. ధ్యేయము ఏకమేవా ద్వితీయం బ్రహ్మ అను శ్రుత్యర్థమును గ్రహించి తరించుటకే. ఇందలి గుణములను గ్రహించి దోషములను విస్మరింతురు గాక.

**శ్లో॥ కాయేన మనసా బుద్ధ్యా కేవలైరిన్ద్రియైరపి,**
**యోగిన: కర్మ కుర్వన్తి సఙ్గం త్యక్త్వాఽఽత్మ శుద్ధయే॥**

ఓం తత్ సత్

# ప్రాత: స్మరణీయములు

1. దర్శనం శ్రవణం జ్ఞానం యత్ర నాన్యస్య విద్యతే
అఖండైకరసం శాంతం బ్రహ్మ తత్సము పాస్మహే ॥

2. యత్ర నాస్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్య
ద్విజానాతి సభూమా ॥

3. సత్యం జ్ఞాన మనస్తం యన్నిష్కళం నిష్క్రియం పరమ్,
అద్వితీయం నిర్విశేషం బ్రహ్మ తత్సముపాస్మహే.

4. తుభ్యం మహ్యామనన్తాయ మహ్యం తుభ్యం శివాత్మనే
నమో దేవాది దేవాయ పరాయ పరామాత్మనే.

5. కృష్ణాయ వాసుదేవాయ జ్ఞానముద్రాయ యోగినే,
నాథాయ రుక్మిణీశాయ నమో వేదాంత వేదినే.

6. యం బ్రహ్మేవరుణేంన్ద్ర రుద్రమరుతస్స్తున్వన్తి దివ్యైస్త్స్యవై
ర్వేదైస్సాజ్గ పదక్రమోపనిష ధైర్గాయన్తి యం సామగా:
ధ్యానావస్థిత తద్గతేన మనసాపశ్యన్తి యం యోగినో
యస్యాస్తం నవిదుస్సురా సురగణా దేవాయ తస్మై నమ:

7. దేహాత్మ ధీవద్బ్రహ్మాత్మ ధీదార్థ్యే కృత కృత్యతా
యదాతదాయం మ్రియతాం ముక్తో ఽసౌ నాత్ర సంశయ:

8. బ్రహ్మైవాహం న సంసారీ ముక్తోఽహమితి భావయేత్.
అశక్నువాఽ భావయితుం వాక్యమే తత్ సదాభ్యసేత్.
యదభ్యాసేన తద్భావో భవేద్భ్రమర కీటవత్.
అత్రాపహాయ సన్దేహమభ్యసేత్ కృత నిశ్చయ:

9. ఏది చరాచరంబగు సృష్టికి సర్వము మూలకారణం
బేది మునీశ్వర ప్రతతికేని నగోచరంబగు దొడ్డ వె
ల్గేది లయాంతమందైన నించుక వైకృతమందకుండు
నేతాదృశ నిత్యసత్యపరతత్త్వ మహత్త్వము నాశ్రయించెదన్

10. కిం జ్యోతిస్తవ భాను మాన హని మే రాత్రౌ ప్రదీపాదికం
స్యాదేవం రవి దీపదర్శన విధౌ కిం జ్యోతిరాఖ్యాహిమే
చక్షుస్తస్య నిమీలనాది సమయే కిం ధీర్ధియో దర్శనే
కింతత్రాహమతో భవాన్ పరమకం జ్యోతిస్తదస్మి ప్రభో.

ఓం తత్ సత్

# విషయసూచిక

పేజీ నెం.


| | | |
|---|---|---|
| | శాంతి పాఠం | |
| 1. | విద్య - దాని ఘనత | 1 |
| 2. | ఆధ్యాత్మిక దినచర్య | 7 |
| 3. | జీవన్ముక్తుడు - ప్రారబ్ధము | 10 |
| 4. | దివ్య జీవనము | 14 |
| 5. | మద్భావం సో ధి గచ్ఛతి | 20 |
| 6. | అవికంపేన యోగేన | 25 |
| 7. | విదితాత్ములు | 28 |
| 8. | నతస్య ప్రాణా ఉత్క్రామంతి | 30 |
| 9. | నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహం | 33 |
| 10. | భక్తి-అహం గ్రహోపాసన | 36 |
| 11. | సద్గురు సహస్ర నామార్చన విధి | 39 |
| 12. | శ్రద్ధాభక్తి ధ్యాన యోగములు | 41 |
| 13. | భుక్తి - ముక్తి | 44 |
| 14. | సాధన మార్గము - సిద్ధ స్థితి | 47 |
| 15. | ఏకోదేవ: | 52 |

| | | |
|---|---|---|
| 16. | క్రమముక్తి - సద్యోముక్తి | 56 |
| 17. | శ్రీరామ రామ రామ తారక మంత్రము | 59 |
| 18. | భాగవతము - పరమార్థము | 61 |
| 19. | సత్యం వద - ధర్మం చర | 64 |
| 20. | అవతారములు | 68 |
| 21. | హృదయగ్రంధి భేదనము | 73 |
| 22. | అవస్థా ద్వయ త్రయ వాదము | 76 |
| 23. | నవ ద్వార, ఏకాదశ ద్వార వివరణ | 78 |
| 24. | ఆత్మార్పణము | 80 |
| 25. | పంచ దశాక్షరీ మంత్రము | 83 |
| 26. | సృష్టి | 87 |
| 27. | సద్గురూపదేశ మహిమ | 90 |
| 28. | ఔపనిషత్సూక్తి ద్వయ వివరణ | 95 |
| 29. | స్ఫురణశక్తి | 99 |
| 30. | గీతా మహావాక్యము | 101 |

# శాంతిపాఠం

**ఓం సహనావతు! సహనౌభునక్తు! సహవీర్యం**
**కరవావహై! తేజస్వి నావధీతమస్తు! మా విద్వి షావహై॥**

ఓం శాంతి: శాంతి: శాంతి:

సహ = కూడా; నౌ = మనలనిద్దరను; భునక్తు = పోషించుగాక; అవతు = (ఆ పరమాత్మ) రక్షించుగాక; సహ = కూడా; వీర్యం = మిక్కిలి ఉద్యమంతో; కరవావహై= పరిశ్రమింతము గాక; మన స్వాధ్యాయము ఏకాగ్రమూ ఫలవంతము అగుగాక! ఎన్నడునూ మనమిద్దరము పరస్పరము ద్వేషించు కొనకుందుము గాక;

ఆ పరమాత్మ మనల నిద్దరను రక్షించుగాక! ఇద్దరనూ పోషించుగాక! ఇద్దరమూ ఊర్జిత శక్తితో పరిశ్రమింతుము గాక; మన స్వాధ్యాయము ఏకాగ్రమూ ఫలవంతము అగుగాక! ఎన్నడునూ మనమిద్దరము పరస్పరము ద్వేషించు కొనకుందుము గాక!

ఓం శాంతి: శాంతి: శాంతి:

ఓం ఆప్యాయస్తు మమాంగాని వాక్ ప్రాణశ్చక్షు: శ్రోత్రమథో బలమింద్రియాణిచ సర్వాణి! సర్వం బ్రహ్మోపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మమా బ్రహ్మ నిరాకరోద నిరాకరణ మస్త్వ నిరాకరణం మేఽస్తు! తదాత్మని నిరతేయ ఉపనిషత్సు ధర్మాస్తే మయినస్తు తేమయినస్తు॥

ఓం శాంతి: శాంతి: శాంతి:

మమ = నా యొక్క; అఙ్గాని = అవయవములు; అప్యాయస్తు = బలవంతము లగుగాక; అథో = ఇంకనూ; వాక్ = వాక్కు; ప్రాణ: = ప్రాణము; చక్షు: = కన్ను;

శ్రోతమ్ = చెవి; బలమ్ = శక్తి; సర్వాణి = అన్ని; ఇంద్రియాణి = ఇంద్రియములు; చ = కూడా; ఔపనిషదం = ఉపనిషత్తులో చెప్పబడిన; బ్రహ్మ = బ్రహ్మము; సర్వం = అంతయూ; అహం = నేను; బ్రహ్మ = బ్రహ్మమును; మా నిరాకుర్యాం = నిరాకరింప కుందును గాక; బ్రహ్మ = బ్రహ్మము, మా = నన్ను, మానిరాకరోత్ = నిరాకరింపకుండు గాక; అనిరాకరణం = నిరాకరించకుండుట; యే = నా పట్ల, అస్తు = ఉండుగాక, ఉపనిషత్సు = ఉపనిషత్తులలో, యే = ఏఏ, ధర్మా = ఉత్తమ గుణములు, (సన్తి = ఉన్నవో), తే = అవి అన్నియు, తధాత్మని నిరతే - ఆ ఆత్మయందు శ్రద్ధగల, మయి = నాయందు; నస్తు = ఉండు గాక.

నా అవయవములు బలవంతయులగుగాక, నా వాక్కు ప్రాణములు కన్నులు, చెవి మరి అన్ని ఇంద్రియములు శక్తివంతములగు గాక, అంతయూ ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మమే. ఎన్నడునూ నేను బ్రహ్మమును నిరాకరింప కుందును గాక, బ్రహ్మము నన్ను నిరాకరింపకుండు గాక నా నిరాకరణము, బ్రహ్మయందు లేకుండు గాక, బ్రహ్మ నిరాకరణము కనీసము నా యందు లేకుండు గాక, ఉపనిషత్తులలో చెప్పబడిన ఉత్తమ గుణములు ఆత్మ నిరతుడనైన నా యందు నిలుచు గాక.

ఓం శాంతి: శాంతి: శాంతి:

ఓమ్

# విద్య - దాని ఘనత

1990 మార్చి నెల గీతావాణి పత్రికలో ప్రకటితమైనది.

**తే॥గీ విద్యయొసగును వినయంబు వినయమునను**
**బడయు పాత్రత, పాత్రత వలన ధనము**
**ధనము వలనను ధర్మంబు దాని వలన**
**ఐహికాముష్మీక సుఖంబులందు నరుడు**

విద్య ప్రయత్న సాధ్యము. శిశువునకు పుట్టుకతో అన్ని విషయములందు తెలియనితనము సహజమే. పెద్ద అయిన కొలది ఆయా విషయములందు విద్యను సంపాదించుకొనుచు వెళ్ళును. ఏ విషయమున విద్య నార్జించునో దానియందు తెలియని తనము అనగా అగ్రహణము, సంశయము, విపరీత గ్రహణము నశించు ననుట లోకములో తెలియ వచ్చుచున్న విషయమే గదా! లోకమున విద్య నెక్కువగా గడించిన వారికి గౌరవాధిక్యములు ఎక్కువగా నుండును. ప్రపంచములో తనకున్న ఏ వస్తువునైన ఇతరులకిచ్చినచో మనకు తరిగిపోవును. కాని మనకున్న విద్య ఇతరులకు బోధించిన కొలది మనకు అధికమగును. **"విద్వాన్ సర్వత్ర పూజ్యతే"** అన్నారు బుధులు.

విద్య అపరయనియు, పరయనియు రెండు విధములుగా నున్నది. ఈ లోక సుఖములకును, స్వర్గాది పరలోక సుఖములకును ముఖ్యసాధనముగా నున్నట్టిది అపర విద్య. అనగా సామాన్యమైన విద్య. పరతత్త్వమును బోధించునదై మోక్షమునకు ఏది ఏకైక సాధనమగుచున్నదో అది పరవిద్య. అనగా సర్వశ్రేష్టమైన విద్య **"ద్వే విద్యే వేదితవ్యే పరాచైవా పరాచ తత్ర అపరా ఋగ్వేదోయజుర్వే స్సామవేదోఽథర్వవేద: శిక్ష కల్పో వ్యాకరణం నిరుక్తం చంధో జ్యోతిషమితి. అథపరాయయా తదక్షరమధి గమ్యతే".**

లౌకిక సుఖములకు, అలౌకిక ముక్తిసుఖమునకును సాధనములగు అపర పరయను రెండు విద్యలు తెలిసికొనదగినవి. ఇందు వేద వేదాంగములు అపర విద్యయనబడును.

దానినే ఉపనిషత్తు కూడ చెప్పుచున్నది.

**శ్లో॥ తత్రపరా, ఋగ్వేదో యజుర్వేద:**
**సామవేదోఽథర్వవేద: శిక్షాకల్పో ।**
**వ్యాకరణం నిరుక్తం చందో జ్యోతిషమితి**
**అథపరా, యయా తదక్షర మధిగమ్యతే॥** **ము.ఉ.అ.1.శ్లో.5**

అనగా ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వ వేదము ఇవి వేదములు.

శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, చందస్సు, జ్యోతిషము ఇవి వేదాంగములు. ఇవి గాక మీ మాంస న్యాయశాస్త్రము పురాణము, స్మృతి అనునవి ఉపాంగములు. వీనినన్నిటిని కలిపి చతుర్దశ విద్యలని విజ్ఞులు పేర్కొనిరి.

1) ఆయుర్వేదము

2) అర్ధ వేదము

3) ధనుర్వేదము,

4) గాంధర్వ వేదము ఇవి నాలుగు ఉపవేదములు.

1. శిక్ష:- అకారము మొదలు హకారము వరకు గల యాబది అక్షరములను ఉచ్ఛరించు విధానమును బోధించుట.

2. కల్పము:- కల్పించునది గాన కల్పము. వేదములందు విధింపబడిన యాగాది క్రియలయొక్క క్రమమును బోధించునట్టి కల్ప మాత్ర గ్రంథము. ఆపస్తంబ, బోదాయన, సత్యాషాడ, కాత్యాయన సూత్రాదులు కల్ప సూత్రములు.

3. వ్యాకరణము:- పదము యొక్క సంధి, ఒకదానితోనొకటి కూర్చుట అనగా వ్యాకరించుయగును. కాన వ్యాకరణ మనబడెను. దీనికి పాణిన్యాదులు కర్తలైరి.

4. నిరుక్తము:- వ్యాకరణముచే సాధ్యముగాని వానిని నిర్వచించి (నిష్కర్షించి) చెప్పెడు శాస్త్రము. యాస్కమహాముని మొదట రచించెను; ఇయ్యది కాశ్యపముని రచించిన వేద నిఘంటువునకు భాష్యము. ఇది నిరుక్తమని చెప్పబడుచున్నది.

5. ఛందస్సు:- ఛందస్సనగా వేదములో గల మంత్రముల యొక్క అనగా గురులఘ్వాదుల యొక్క సంఖ్యను తెలియజేయునట్టి శాస్త్రము. దీనికి నందికేశ్వరులు కర్తలైరి.

6. జ్యోతిషము:- జ్యోతిస్సులను తెలుపునట్టి శాస్త్రము. దీని చేతనే అహోరాత్రాది కాలములు బోధయగును. ఈ శాస్త్రము సిద్ధాంతము, జాతకము, ముహూర్తము, ప్రశ్న అని నాలుగు విధములుగానున్నది.

1. మీమాంస:- మీమాంసయనగా విచారణ, ఇది పూర్వ మీమాంస అనియు, ఉత్తర మీమాంస అనియు, ఇరుతెరంగులు. పూర్వ మీమాంస జైమిని విరచితము. ఇది శ్రుత్యర్థమును నిర్ణయించు శాస్త్రము. వ్యాసప్రోక్త వేదాంత సూత్రములు అనగా బ్రహ్మసూత్రములు ఉత్తర మీమాంస అనబడును.

2. న్యాయశాస్త్రము:- న్యాయమనగా దృష్టాంతము. ఇది తర్కశాస్త్రము అనియు, వైశేషిక శాస్త్రమనియు చెప్పబడును. ఇందువలన తెలియనివన్నియు దృష్టాంతముతో తెలియనగును.

3. పురాణములు:- సృష్టిక్రమము, ప్రళయక్రమము, పూర్వమున్నట్టి ఉత్తమ పురుషుల వంశావళి, మన్వంతరములు, పూర్వవంశస్థుల చరిత్రములు అనునవి ఈ ఐదు లక్షణములు పురాణము లందుండును.

4. స్మృతి:- (ధర్మశాస్త్రము) ధర్మశాస్త్రమనగా స్మృతియని అర్థము, ప్రతి స్మృతియందును ఆచారకాండము, ప్రాయశ్చిత్త కాండము, వ్యవహార కాండము అను మూడు భాగములు గలవు. స్వాయంభువ మన్వాదులు పదునెనమండ్రుగురు మూల స్మృతి కర్తలు. ఇది అంతయు అపర విద్య అనబడును.

దేనిచేత అక్షరమగు ఆత్మతత్త్వము గుర్తింపబడునో అది పరవిద్య. అది ఉపనిషద్రూపమగు వేద అంతిమభాగము అని శ్రుతి చెప్పుచున్నది.

**"విద్యాహికా, బ్రహ్మగతిప్రదాయా"**

ప్రశ్న:- ఏది విద్య?

ఉత్త:- ఏది సద్గతినొసంగునో, బ్రహ్మమును జేర్చునట్టిదో అదే విద్యయని ప్రశ్నోత్తరి యందు శ్రీ ఆచార్య స్వాములున్ను నిర్వచించియున్నారు. ఆధ్యాత్మ విద్య నేనే అని గీతలో భగవంతుడు వచించియుండెను. "ఆధ్యాత్మ విద్యా విద్యానామ్"

ఐనను విద్య అక్షరమెట్లగును అను సందేహము. అవిద్యను అనగా అజ్ఞానమును నశింపజేసి, విద్య అనగా జ్ఞానముగూడ నశించునని సంప్రదాయ విదులు వచింతురు గదా?

ఇచ్చట జ్ఞానము (విద్య) నశించుననుచోట చీకటిని ప్రకాశమువలె, అవిద్యను విద్య మ్రింగివేసి తాను స్వాధిష్టానముగా నుండు బ్రహ్మయందు లయించునను అభిప్రాయము గ్రహింపవలెను. అప్పుడది ప్రత్యేక స్వరూపమును గోల్పోయి బ్రహ్మమాత్రముగానే యుండిపోవును. అప్పుడు బ్రహ్మాకారముగాదది, బ్రహ్మమే. అగ్నియందుంచబడిన కర్పూరము అగ్న్యాకారము కాదు అగ్నియే. సముద్రమునందు పడిన వడగళ్ళు సముద్రాకారాము గాదు, సముద్రమే. పై ఉపమానముల విశిష్టత గమనించవలెను. అగ్నియందుంచబడిన ఇనుప ముద్ద అగ్నియందున్నంత వరకే అగ్న్యాకారముగనుండును. అగ్ని నుండి వేఱుచేసిన పిదప, మఱల అది ఇనుపముద్దగానే యుండును. అగ్ని యందుంచబడిన కర్పూర శకలమో అగ్ని నుండి వేఱు చేయబడుట గాని, అది మఱల కర్పూరముగా నుండుటగాని సంభవించదు. అది అగ్నియేయగును. సముద్రమందుబడిన వడగళ్ళుగూడ సముద్రము నుండి వేఱుచేయబడుట గాని, అది మఱల వడగళ్ళుగా నుండుటగాని సంభవించదు. అది సముద్రమేయగును. ఇట్లే ఇచట తెలిపిన విద్య (జ్ఞానము) బ్రహ్మము నుండి వేఱు చేయబడుటగాని, మఱల

పూర్వ రూపములో నుండుటగాని సంభవింపదు. అది బ్రహ్మమేయగును. ఈ స్థితిని పురస్కరించుకొని అది బ్రహ్మాకారము గాదు. బ్రహ్మమే. "తదాకారముగా నుండుట, అదియే అగుట" అనెడి వీనిలోగల బేధమును గనబరచుట యే పై దృష్టాంతములందు గల విశిష్టత. ఈ రీతిని అది (విద్య) బ్రహ్మాకారముగాదు బ్రహ్మమే. **"బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి"**

బ్రహ్మము నెరిగినవాడు బ్రహ్మవేత్తగాడు. బ్రహ్మమేయని శ్రుతి చెప్పును.

ఇట్టి బ్రహ్మ విద్యను శ్రేష్ఠమైన ఈ మానవ జన్మమునందే గడించవలెను. శ్రేష్ఠమైనదిగా భావించబడునది దేవజన్మ. దానికంటెను శ్రేష్ఠమైనది మానవ జన్మ. ఎట్లన శ్రేష్ఠమైనవియు, శ్రేష్ఠతరమైనవియు, శ్రేష్ఠతమమైనవియునగు సకల పదవులను సంపాదించునది మానవ జన్మ ద్వారానే. ప్రభుత్వమును, సార్వభౌమత్వమును, ఇంద్రత్వమును, ప్రజాపతిత్వమును బ్రహ్మత్వమును, పరబ్రహ్మమును గూడ సంపాదించునది మానవ జన్మ ద్వారానే. కావుననే దేవతలు మానవ జన్మమును గోరుచుందురు. అచట విషయ సుఖములలో మునిగి తేలుట తప్ప బ్రహ్మ విచారణాదులు లేనందున దేవతలు బ్రహ్మభావన జెందవీలులేకుండును. కాన ఈ మానవ జన్మలో అపర విద్యను సంపాదించి అంత:కరణ మాలిన్యమును తొలగించుకొని అనగా రజోతమో గుణములను దమింపజేసికొని శుద్ధసత్వాంత:కరణమున నిల్చి పరవిద్య నభ్యసించి జీవబ్రహ్మైక్య విజ్ఞాన నిష్ఠయందుందుము గాక.

**చదువని వాడజ్ఞుండగు**
**చదివిన సద సద్వి వేకచతురత గల్గున్**
**చదువగవలెను జనులు**
**చదివించెదనార్యులొద్ద చదువుము తండ్రి!**

ఓం తత్ సత్.

# ఆధ్యాత్మిక దినచర్య

ప్రస్తుత ప్రపంచములో నాగరికులమని చెప్పుకొను మానవులలో ఎక్కువమంది అశాంతి జీవితమునే గడుపుచున్నారు. కారణం రోజంతయు ధన సంపాదనకై వారి వారి వృత్తి వ్యాపారములలో నిమగ్నులై అనారోగ్యమునకు పాత్రులగుచున్నారు. మఱి సర్వ శక్తిమంతుడైన భగవంతునియందు, వేద శాస్త్రములందు నమ్మికలేని వారై మానవ పరమార్ధమును బోధించు శాస్త్ర పండితుల, అనుభవగ్నుల ఉపదేశములను పెడచెవిని పెట్టుచున్నారు. ధన సంపాదనే పరమార్ధముగానెంచి, మనోవాక్కాయ కర్మలందు పరస్పర విరుద్ధముగ వ్యవహరించుచున్నారు.

పురుషార్థములలో చివరిదగు మోక్షము వైపుకు ప్రయాణము జరుపవలసిన మానవుడు దారితప్పి దానికి వ్యతిరేకమైన ఇహలోక భోగములకు పయనించుచున్నాడు. తిరిగి రాలేనంత దుస్థితికి దిగ జారిపోయినాడు. విజ్ఞులు చెప్పు మాటలు తెలిసికొనలేక విపరీతార్ధము తీయు అధోగతికి వచ్చియున్నాడు.

భగవంతుడు తనను తాను తెలుపుకొనుటకే మానవ జన్మ ఉద్దేశించబడినది అని ప్రశ్నోపనిషత్తు చెప్పుచున్నది. అట్టి ఉత్తమమైన ప్రయత్నమును మాని, దారితప్పిన నేటి మానవునికి, తిరిగి తన స్వరూప విజ్ఞాన సముపార్జనము చేయు మార్గమునకు త్రిప్పవలెను. మానవుడు అనగా మ = అజ్ఞానము, న = లేని వైపునకు, వ = వర్తించుట. కాని మానవుడు పశుపతియగుటకు బదులు పాశవికస్థితికి దిగజారుచున్నాడు. అట్లు తప్పు దారిన అవలంబించిన మానవుని క్రమ క్రమముగా మార్చవలెనేగాని ఒక్కసారిగా మార్చుట అసంభవము. ఏలన మానవుని మానసిక శారీరిక స్థితులన్నియు క్రమమును తప్పియున్నవి. క్రమస్థితికి మరల్చుటకు శ్రుతి, స్మృతులు కొన్ని మార్గములను సూచించినవి. వానిని శ్రద్ధతో అనుసరించి క్రమముగా మానవ ధ్యేయము వైపుకు పయనించగలరని ఆశించెదము.

1. ఉదయము అనగా బ్రహ్మముహూర్తమున గం.4-30 లకు నిద్ర నుండి మేల్కాంచుట, మేల్కాంచిన వెంటనే తన ఇష్ట దైవమును గురించి తనలో ప్రార్థనచేయుచు ఆ దినజీవితము శుభముగా జరుగుటకు తలంచవలెను.

2. పిదప కాలకృత్యములు తీర్చుకొని ఒక అరగంట లేక గంట కాలము యోగాసనములు, ప్రాణాయామము, లేక ఇతర విధ వ్యాయాయములు చేయవలయును. ఇట్లు చేయుటలో తెలిసిన ఆచార్యుల సలహాలను పొందుట మంచిది.

3. స్నానము చేయుట, పూజ, జపము, భక్తి, ధ్యానము మున్నగునవి ఒక గంట కాలము చేయవలయును.

4. తరువాత తగిన ఆరోగ్యకరమైన ఉపాహారమును గైకొనవలయును.

5. జీవనోపాధికి వారు వారు చేయు వృత్తి వ్యాపారాములయందు నిమగ్నులు కావలెను. ఇట్లు చేయుటలో మనోవాక్కాయ కర్మలు బేధించు కొనకుండ చూచుకొనవలెను. తాను బాధపడకుండ, ఇతరులకు బాధ లేకుండ సంఘములో క్రియ లాచరించవలెను. తన నైతిక నియమములకు భిన్నము లేకుండ చూచుకొనుచుండవలెను.

6. ముఖ్యాహారమును తీసికొనునపుడు ప్రముఖముగ ఆకుకూరలు. పప్పులు, బియ్యము లేక గోధుమ, పెరుగు, పండ్లు మొదలగు భగవద్గీత చెప్పిన సాత్వికాహారమును, వారి వారి వయస్సును బట్టి, అవసరమును బట్టి సాత్వికమగు ఆహారమును తీసుకొనుట మంచిది.

7. సాయంకాలము కొంచెము వ్యాయామము, స్నానము అనంతరము సత్సంగము చేయవలయును. వీలైనంతవరకు ఆధ్యాత్మిక గ్రంథ పఠనము. చర్చలు చేయవలయును.

8. గృహకృత్య నిర్వహణము అనగా ఇంటిలో కావలసిన నిత్యావసర పదార్థముల సేకరణ, బిడ్డల చదువు సంధ్యలను గురించి విచారించుట చూచుకొనవలెను.

సాంఘిక సేవకై కూడ కొంతకాలము వినియోగించు ఆలోచనలో నుండవలెను. వీలుగానిచో వారమునకు ఒకరోజు నియమించుకొనవచ్చును.

9. రాత్రి భోజనము తేలికగ తీసుకొనుట మంచిది. పప్పులు, పెరుగు వర్జించుట సముచితము. వయస్సును బట్టి రాత్రి భోజనము మాని పండ్లు తీసుకొనుట మంచిది. దినమున జరుగు మూడు భోజనములు సాత్వికములగను, అతి వేడివి, అతి చల్లనివిగా కాకను యుండుట అవసరము.

10. రాత్రికి నిద్రపోవు సమయము అనగా 8 గం॥ నుండి 10 గం॥లలోపున భగవంతుని గురించి ప్రార్థన చేయుట అవసరము. అట్లు చేసి నిద్రించిన వారికి స్వప్నములు లేక సుఖ నిద్ర పొందగలరు. ఆ దిన కార్యములను సమీక్ష చేసుకొని తప్పులు తిరిగి చేయకుండునట్లు నిశ్చయము చేసుకొనవలెను.

ఇట్లు దిన కార్యక్రమమును శ్రద్ధగా ఆచరించుచు శరీరమునకు ఆరోగ్యమును, మనస్సునకు నిశ్చలతను, బుద్ధికి భగవత్తత్వ విచారణా శక్తిని కలిగించుకొని శ్రవణాసక్తులై సద్గురువుల వద్ద ఉపనిషర్థమును సంశయ, విపర్యయ రహితముగా శ్రవణము చేసి జీవ బ్రహ్మైక్య స్థితిని పొందుదురు గాక.

ఓం తత్ సత్.

# జీవన్ముక్తుడు - ప్రారబ్ధము

**"జ్ఞానమేకం బ్రహ్మైకం ముక్తిరేకా"**

బ్రహ్మమొక్కటే గనుక జ్ఞానమనునది ఒక్కటే. అందువలన ముక్తియు నొక్కటే అని శ్రుతి వచించినది.

ఈ ముక్తి జీవన్ముక్తి, విదేహముక్తి అని ద్వివిధములుగా చెప్పెదరు. చతుర్విధ జీవన్ముక్తులను గురించి మాచే రచించబడిన "శంకరాద్వైత వ్యాసమాల" యందు జీవన్ముక్తులు అను 16వ వ్యాసములో 86వ పేజిలో చూడగలరు. జీవించి దేహముండగానే దేహభావన లేనివాడు విదేహముక్తుడు. ఇతడే చతుర్విధ జీవన్ముక్తులలో చివరివాడైన బ్రహ్మ విద్వరిష్ఠుడు.

జీవించి యుండగనే జీవభావమును విడుచుట అనగా శరీర మనో బుద్ధేంద్రియాదులకు విలక్షణుడై జాగ్ర స్వప్న సుషుప్త్యాది అవస్థలను ప్రకాశింపజేయు ఏకాత్మ ప్రత్యయ స్వరూపుడనని సంశయా సంభవ విపర్యయ భావములు లేక తన అనుభవమునందు దృఢ నిశ్చయముగలవాడు జీవన్ముక్తుడు. అనగా జనన మరణ రూప వికారవంతమైన దేహాది సంఘాతము నేనను భావనను విడిచి వీటికి ప్రకాశ స్వరూపుడగు ఆత్మభావనయందు నిల్చియుండుట. ఇట్టి జీవభావన నుండి విముక్తుడైన వానిని "సముక్తస్స సుఖీలోకే" అనగా లోకమున ఎల్లరిలోను సుఖవంతుడు. మఱియు "కర్మణానో పలిప్యతే" అను వాక్యము సంచిత, అగామి ప్రారబ్ద రూపమగు త్రివిధ కర్మలచేతను అతడు స్పృశింపబడడని తెలుపుచున్నది.

**"సంచితాగామి కర్మాణి దహ్యన్తే జ్ఞానవహ్నినా**
**ప్రారబ్దాను భవాన్మోక్ష: ఇతి వేందాంత డిండిమ:"** **వే.డి...26**

జీవన్ముక్తుని సంచితాగామి కర్మజాలము జ్ఞానాగ్నివలన భస్మీపటలము అగుచున్నది. ప్రారబ్ధము అనుభవించిన పిదప ముక్తి కలుగుచున్నది అని వేదాంత డిండిమము.

అజ్ఞానులవలె అతడును అనుభవించవలసినదే. **"అవశ్యమనుభోక్తవ్యమ్"** అని శాస్త్రము కూడ చెప్పుచున్నది. నిరంతరము అసంగాత్మయందుండు వారికి పుణ్య కర్మలవల్ల ఔన్నత్యము గాని పాపకర్మల వల్ల పతనముగాని లభింపదు. జీవన్ముక్తుని పుణ్యము అతనిని భూషించిన వానికి చెందునని, అతని పాపము అతనిని దూషించి వానికి ప్రాప్తించునని శాస్త్రము చెప్పుచున్నది. జ్ఞాన ప్రభావమిట్టిదని స్తుతించబడెను. దూరముగా నుండి ప్రేక్షకుడు జన సమూహమును జూచునట్లు, తత్త్వవేత్త దేహమును తనకంటె దూరముగా (అన్యముగా) జూచును. అని ఆర్యులు చెప్పెదరు. బాగుగా పండిన చింతకాయ చూచువారికి ఏకముగానే కన్పించినను దానిపై బెరడు (గుల్ల) వేఱు. ఆ గుల్ల యందేయుండినను దానిని అంటకుండా వుండు చింతపండు వేఱు. అట్టి చింతపండు నంటుకొనకయే దానిలో నుండు చింత విత్తనము వేఱు. ఇట్లే తత్త్వవేత్తయొక్క స్థూలదేహము వేరు. అతని సూక్ష్మదేహము వేరు. అతడు వేరు - ఇట్లతడు దేహము, దేహ సంబంధమైన వాటికన్నింటికిని వేఱుగానుండును. అందరివలె ~~ఈ~~ తత్త్వవేత్త కూడ జనన మరణాదులు పొందుట, సుఖదు:ఖములనుభవించుచుండుట ప్రత్యక్షముగానే కనబడుచుండ లేదనుటెట్లు.

**"అవశ్యమను భోక్తవ్యమ్, ప్రారబ్ధం భోగతోనన్యేత్"** అని శాస్త్రము గూడ చెప్పుచున్నది గదా. అనిన తత్త్వవేత్త జనన మరణములు గాని, సుఖదు:ఖములను గాని, పొందుటయే లేదు. శరీర ధర్మములైన వానికన్నిటికిని జీవన్ముక్తుడు చాలా దూరముగనే యున్నాడు. అతడా వికారములు పొందుట చూచువారి దృష్టి యందే. శరీర దృష్టి గలవాడు శరీర వికారములను చూచుచుండును. అధిష్ఠాన దృష్టిగల జీవన్ముక్తుడు శరీర వికారములకు సాక్షిగా నిర్వికారముగా స్వరూపస్థితి యందుండును. నాటకమునందు హరిశ్చంద్ర పాత్రను ధరించినవాడు ప్రేక్షకుల దృష్టిలో నానా కష్టములకు లోనై నానా విధ దు:ఖముల ననుభవించు వాడుగా కనబడినను, తనలో తాను ఎట్టి చింతయు, ఎట్టి దు:ఖము, ఎట్టి కష్ట నష్టము లేక నిశ్చింతగా నుండుచున్నాడో, అట్లే తత్త్వవేత్తయు లోక దృష్టిలో జనన మరణములు, సుఖదు:ఖాదులు కలవాడుగా కనబడినను, స్వదృష్టిలో ఇవి యేవియు

లేక వీనికతీతుడై. అజుడు గాను, సుఖిగాను, నిశ్చింతుడుగాను, అమృతుడుగాను ఉండుచున్నాడు. ఎంతచెప్పినను ఇట్టి స్థితియొకటి యున్నదని, అజ్ఞులు విశ్వసింపరు. అంగీకరింపరు గూడ. తమ అనుభవమునకు వచ్చినదియే సరియైనదనియు, ఇకనేదియు సరికాదని వారి హఠము. దీనిచే స్వానుభూతిగల జీవన్ముక్తులకు కలిగిన నష్టమేమియు లేదు. పై జెప్పిన శాస్త్రవాక్యములు లోకదృష్టి ననుసరించి చెప్పినట్టివి గాని స్వదృష్టిని బట్టిగాదు. **"ప్రారబ్ధమసత:"** అను మొదలగు శ్రుతి వాక్యములు మాత్రము స్వదృష్టినిబట్టి చెప్పినవి. గీతా మహాత్మ్యము **"లభతే ముక్తి ముత్తమామ్"** అని చెప్పినది. లోక వ్యవహారమును బట్టి ఋణ విముక్తి, బంధ విముక్తి, పాప విముక్తి, శాప విముక్తి, కర్మ విముక్తి, రోగ విముక్తి, దు:ఖ విముక్తి ఇత్యాది ముక్తులు గలవు. అందువలన వీటికంటె విలక్షణముగా శ్రుతియందు చెప్పబడిన ముక్తిని ప్రదర్శించుటకై **"లభతే ముక్తి ముత్తమామ్"** అనుటకు హేతువైనది. వ్యవహారమందే గాక శాస్త్రమునందును కొన్ని ముక్తులు తెలుపబడియున్నవి. అవి సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సారిష్టి అనునవి. ఇందు ఇష్ట దేవతయొక్క లోకమును జేరుట అనునది సాలోక్యముక్తి అనబడును. ఇష్టదేవత దగ్గరనే యుండుట సామీప్య ముక్తియనబడును. తనకు ఇష్ట దేవతాస్వరూపము ప్రాప్తించుట సారూప్యముక్తి అనబడును. ఇష్ట దేవతవలెనే తానును స్వతంత్రించి సర్వైశ్వర్యములను అనుభవించుట సారిష్టి అనబడును. ఈ చతుర్విధ ముక్తులు వారివారి అర్హతల ననుసరించి సాకారోపాసకులకు లభించుచున్నవి. సాయుజ్యమను మఱియొక్క ముక్తి గలదు దీనికి పైన మఱియొక ముక్తిలేదు. ఇది **"బ్రహ్మ విదాప్నోతిపరమ్"** అని శ్రుతి చెప్పిన నిరాకారోపాసకులకు అవ్యక్తాసక్తచిత్తులగు బ్రహ్మ విదులకు సంప్రాప్తించుచున్నది. సాయుజ్యము అనగా జీవుడు బ్రహ్మములో ఐక్యము జెందుట. ఐక్యమనగా జీవుని బ్రహ్మమును కలిపి ఏకముచేయుట గాదు. ఉదాహరణకు ఒక పొడవైన త్రాడు చిక్కుపడి మధ్యలో ముడి ఏర్పడి చూపరులకు రెండు త్రాళ్ళు ముడి వేసినట్లగుపడును. కాని శ్రమచేసి ఆ ముడి విప్పిచూడగా అది రెండు గాదు ఒకటియే. అట్లే జీవుడొకడు బ్రహ్మమొకడు అని అజ్ఞానముచే స్థిరభావము

నొందిన మానవునకు, శాస్త్రాచార్యోపా యానుభవములచే వేఱనెడి అజ్ఞాన ముడివిప్పగా జీవబ్రహ్మము లనునవి నామమాత్రములు, తత్త్వమొక్కటియే యని గ్రహించగలడు. దీనినే చిత్‌జడగ్రంధి యందురు. ఘటోపాధి నశించగా ఘటాకాశ మహాకాశముతో ఐక్యమగునట్లు, ఆ విద్యారూపమగు ఉపాధిభావము అస్తమింపగా జీవుడు నిరుపాధికుడై అఖండ బ్రహ్మ భావము నొందుటయని అర్ధము. **"బ్రహ్మైక్యం తత్"** అని శ్రుతియు ఇట్లే వచించినది.

ఓం తత్ సత్.

# ది వ్య జీ వ న ము

**సర్వాజీవే సర్వసంస్థే బృహంతే**
**అస్మిన్ హంసోబ్రామ్యతే బ్రహ్మచక్రే**
**పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా**
**జుష్టప్తతస్తేనా మృతత్త్వమేతి** **శ్వే.ఉ.అ.1.శ్లో.6**

తా॥ బ్రహ్మము యొక్క ఈ అనంత చక్రములో ప్రతిది జీవిస్తూ, స్థితియై వుండే ఈ అనంత బ్రహ్మచక్రంలో యాత్రికుడైన జీవాత్మ గిరగిరా తిప్పబడుచున్నది. ఇంతవరకు భిన్నమని భావింప బడుచున్న జీవాత్మ కూడ, ఆ చోదక శక్తియే బ్రహ్మమే అని తెలిసికొని ఆ బ్రహ్మముచే పరమసత్తచే అనుగ్రహించబడి అమరత్వాని పొందుచున్నది.

హంస అనే పదం ఇక్కడ యాత్రికుడని వ్యాఖ్యానించ బడింది. అచేతనమైన తమస్సు నుండి సత్వానికి లేదా జడ పదార్థముల అచేతన నుండి సమాధి యొక్క అతీంద్రియ చేతనకు జరిగే పురోగ మనమే యాత్రతో పోల్చబడినది. జీవాత్మ స్వేచ్ఛకు పరితపిస్తున్నాడని ధ్వని. **"భ్రామయంతే"** అనే పదం గిరగిర తిప్పబడుతూ వుంటాడు. అనగా పునర్జన్మ సిద్ధాంతం సూచించబడినది. అజ్ఞానియైన మానవునికి తానూ, తన ప్రపంచమూ మాత్రమే తెలుసు.

అతనికి భగవంతుడనే మూడవ సత్త లేనేలేదు. అయితే బుద్ధిమంతుడు త్వరలోనే యీ విశ్వానికి వెనుక ఏదో తెలియని శక్తి వుండి నడిపిస్తూ వున్నదని కనుగొంటాడు. కనుక సాధనలో మొదటి భాగం తాను తన ప్రపంచము రెండూ ఆధారపడి వున్న ఆ శక్తి యొక్క ఉనికిని గుర్తించడం ప్రారంభములో ఈ గుర్తింపు బౌద్ధికమే. మానవ చరిత్రలో గాని, మానవ జీవితంలోగాని భగవంతుడు అనే భావం త్వరగానే ప్రవేశిస్తుంది.

విచారణ శక్తి పక్వమైన పిదప ఈ భగవత్తత్త్వాన్ని గూర్చిన అసలు అన్వేషణ ప్రారంభము అవుతుంది.

ఈ ఆధ్యాత్మిక సాధన భగవంతుని ప్రపంచము నుండీ, జీవుని నుండి వేరుచేయడంతో ప్రారంభమవుతుంది. ఈ భగవంతుని లక్షణాలు జీవుని లక్షణాలకు, ప్రపంచపు లక్షణాలకు ఎంతో భిన్నమైనవి. ఆ తరువాత ఈ జీవుడు ఈ ప్రపంచాన్ని మన శాస్త్రాదార్యోప దేశములతో పరిశీలిస్తూ ఉండగా జీవ ఈశ్వర జగత్తుల పరస్పర సంబంధాలను గురించి వివిధ తాత్త్విక సంప్రదాయాలు ఏర్పడుతాయి. ఒక్కొక్క సంప్రదాయ విచారణ, సాధన పురోగమనములో ఒక్కొక్క స్థాయిని సూచిస్తుంది. చరమ స్థాయియైన సమాధిలో మనకు పరిచయమైయున్న జీవుడు ప్రపంచము సంపూర్ణంగా అదృశ్యమై భగవంతుడు మాత్రమే మిగులుతాడు క్రమంగా జీవునికి, భగవంతుని మౌలిక లక్షణాలన్ని చేకూరి, ప్రపంచపు లక్షణాలన్ని వదలిపోతాయి. ఈ జీవుని పరిణామ క్రమంలో రెండు రీతులు ఇమిడి ఉన్నాయి. మొదట మనకు పరిచితమైయున్న జీవునికి, భగవంతునికి ఉన్న బేధము తెలిసికోవాలి. తరువాత నిజానికి జీవునికి, భగవంతునికీ ఉన్న అభేధాన్ని ఐక్యతను గుర్తించాలి. ఈ రెండూ ఒక పరిణామక్రమంలోని అంశాలే గనుక వాటికి నిజంగా విరోధం లేదు. అద్వైత సిద్ధాంతం ప్రకారం భగవదనుగ్రహం అంటే జీవబ్రహ్మైక్యాన్ని సాక్షాత్కరించు కోవడమే. ద్వైతులు ఇది భగవత్కృపా సిద్ధాంతాన్ని సూచిస్తున్నదని చెపుతారు.

ఈ రెండు సిద్ధాంతాలకు పెద్ద విరోధమేమి లేదు. ఐక్యాన్ని సాక్షాత్కరించు కోవడానికి భగవత్కృప కావలసిందే. అసలు కష్టమంతా కృపాసిద్ధాంతాన్ని కర్మ సిద్ధాంతంతో పురుష ప్రయత్న సిద్ధాంతంతో సమన్వయించటంలోనే. ఇచ్చట కూడ పురుష ప్రయత్నం యావచ్ఛక్తితో చేశాకనే భగవత్కృప లభించుతుందని అర్థం చేసుకుంటే ఏ కష్టము యుండదు.

సంపూర్ణముగా స్వస్వామియునగు నొక సత్తు తాను అంతర్లీనమై యుండు ప్రాపంచిక సత్తను తన వశమునందు వుంచుకొని, తనను రూపము నందు

రూపించుకొనును. మఱియు వ్యక్తియందు ప్రకటించుకొనును. దివ్య జీవనమున కారోహించుటయే మానవుని యాత్ర. అదియే అతని సర్వశ్రేష్ఠ కర్మ. అదియే దేవదేవునికి ఆమోద యోగ్యమగు పరమయజ్ఞము. అది మాత్రమే ప్రపంచమునందు మానవుని వాస్తవ కార్యము, అతని జీవనమునకు ఏకమాత్ర ఔచిత్యము. అది లేనిదే అతడు ఇతర క్షణ జీవియగుటకు ప్రాయుడే.

దృశ్య ప్రపంచము యొక్క విరోధముల మధ్య నుండి ఆవిర్భవించ వలసిన ఈ వస్తు సత్యము ఒక అనంత ఆనందము మఱియు - స్వచేతన - సత్తు - సచ్చిదానందము అని ప్రకటింపబడి యున్నది. ప్రపంచ గతమగునది తననెఱింగి తానగును. అటులే తానై తననెఱుంగును. ఇట్లు లోపల తనను తాను పొంది, తన రూపములను, గుణములను సైతము సచ్చిదానందము మన: ప్రాణ శరీరముల వెనుక స్వతంత్రముగ తన నిజరూపమున సదా ఉండనే యున్నది.

నేతి నేతి యను నిషేదాత్మక ప్రక్రియ ననుసరించి, సమస్త దృశ్యముల యొక్క ఆకారముల, ఆవరణముల నిరాకరణముద్వారా గాని, ఇతి ఇతి యను భావాత్మక ప్రక్రియ ననుసరించి వీని నామ రూపములను నిత్య సత్యమునకు కుదించివేయుట ద్వారా గాని, ఎపుడు ఆ దృశ్య పదార్థముల స్వరూపము నెరింగెదమో అపుడిక సచ్చిదానందము యొక్క ఏకమాత్ర వాస్తవిక అనుభవమే మిగిలియుండును.

మానవునకు మూలము విశ్వము. విశ్వమునకు ద్వారము మానవుడు. ఇదియే ఉభయుల యొక్క యదార్ధ సంబంధము. ఇట్లు ఒకరికొకరు జీవించుచు ఉభయులు దివ్య జీవనమునకు బయనింతురు. ద్వంద్వములెట్లు వచ్చెను. ఇది అంతయు బ్రహ్మమే. మఱియు ఆ బ్రహ్మ స్వరూపము సచ్చిదానందము. జీవనమొక బహుత్వ ఖేలనము. బహుత్వము లేనిదే జీవనమే లేదు గదా? అహం చేతన దివ్య ఏకతలోనికి రూపాంతరము చెందినపుడు, వెనుకటివలె తెలియకగాక బాగుగ తెలిసియే అతడు భగవంతునికి ప్రతిరూపముగా వ్యవహరించును. ఇచ్చట ద్వంద్వములు పరస్పర నిషేదకములు గాక

పరస్పర పూరకములగును. జీవుడెపుడు తన మానసిక తాదాత్మ్యమును ఈ స్వయమభివ్యక్త తాదాత్మ్యములోనికి కుద్ధరించుకొనునో, అపుడతని బుద్ధియు స్వయం ప్రకాశ అంత: స్ఫూర్తిలోనికి రూపాంతర మొందును. ఇదియే ఆత్మజ్ఞానమునకు వేదాంతమార్గము. మన సత్తాచేతనలు ఆత్మయొక్క దేశకాలబద్ధ క్రియాకలాపము లందు గాక ఆత్మయొక్క యధార్ధ నిశ్చలతయందు మాత్రమే ఆత్మానందమును ఆస్వాదించగలవు. మూలము నుండి రూపమును వేరుగ చూచు అజ్ఞాన దృష్టికి రూపము మిధ్యగాని, విజ్ఞాన దృష్టికి రూపము బ్రహ్మమే. బ్రహ్మను ప్రకటించు సాధనమే. వివేకము, విరక్తి, సుగుణ సంపత్తి, మోక్షాసక్తి యివి తీవ్రముగానున్నచో తరించుటకు ఒక్క జన్మయే చాలును. అటుల లేనిచో యీ మందభాగ్యులకు ఇంకొకటి, అది తప్పిన మఱియొకటి. ఇట్లు పెక్కు జన్మలు ముక్తి కలుగువరకు కావలసియుండును. **"అనేక జన్మ సంసిద్ధ: తతోయాం తిపరాంగతియ్"** అని గదా భగవంతుడు వచించెను. కావున మోక్ష సాధనమైన యీ మానవ జన్మ పున: లభించవలెననుటకు ఉపాయముగా **"అధ్యాయ శ్లోక పాదం వా"** అను ఉపాయము సూచించబడుచున్నది. జన్మకు కారణము కామము, కర్మ (కర్తృత్వ బుద్ధియుక్త కర్మ). దానికి మూలము అజ్ఞానముండియున్నది గదా అని అనుట సరికాదు. ఇది సర్వసాధారణమైన విషయము. ఐనను అధికారిక పురుషులయందు యిది వర్తించదు. ఎట్లన అవిద్య (అజ్ఞానము) - కామ - కర్మ యివి లేకయు భగవంతుడు యుగయుగము నందున అవతరించుచున్నాడు. ఇట్లే అధికారిక పురుషులున్ను అవిద్య కామ కర్మలు లేకయే మరల మరల స్వేచ్ఛగా జన్మించుచున్నారు. **"యావధికార మవస్థితి రాధికార కారణమ్"** అనుచోట బ్రహ్మసూత్రములలో యీ విషయము బాగుగా నిర్ధారణ చేయబడియున్నది చూడుము.

అట్లయిన బ్రహ్మవేత్తలందరు మరల జన్మింతురని తలంపగూడదు. **"తస్యతావదేవ చిరమ్"** అను శ్రుతి ప్రకారము దేహము పడిపోయిన వెంటనే విదేహ కైవల్యము పొందెదరు. అఖండ బ్రహ్మ భావనను చెందుచున్నారు. ఇకనెవరు బ్రహ్మ విదులలో ఉత్తములో, లోక సంగ్రహము చేయు సంస్కారములు గలవారుందురో అట్టివారు మాత్రమే

అఖండాత్మానుభూతి నుండి జాఱకయే భగవంతుని వలె జన్మింతురు. అట్టివారి జన్మ లోకము యొక్క అదృష్టమని చెప్పవలెను.

**శ్లో॥ "పరోపకృతి కైవల్యేతో లయిత్వా జనార్ధన:**
**గుర్వీము ప్రకృతిం. మత్వాప్యవతారాన్ దశాగ్రహీత్॥"**

కైవల్యము (నిజధామ నివాసం) - పరోపకారం అను ఈ రెంటిని తూచి పరోపకారమునే గొప్పదానినిగా తెలిసికొని శ్రీ విష్ణుభగవానుడు దశావతారముల దాల్చెను (పది జన్మలెత్తెను). కాన పరోపకార పారీణులగు మహాత్ములు కొందఱు విదేహ కైవల్య లోలువులు గాక లోక సంగ్రహము సేయు తలంపుతో మఱల మఱల జన్మించుచున్నారు. వారినే శాస్త్రము అధికారిక పురుషులని నిర్వచించినది. అట్టి వారి జీవనమే దివ్య జీవనము. పునర్జన్మ రాహిత్యమునకు నిష్క్రియ బ్రహ్మములో లయము బొందవలసిన అగత్యమును లేదు. పురుషోత్తమునిలో సాయుజ్యము నందినవాడు జన్మించియు అజుడు గనే యుండును. దీనినే

**శ్లో॥ "అజోఽపి స న్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్।**
**ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా**

**భ.గీ.అ.4.శ్లో.6.**

అనగా ఆత్మయందునే జన్మరహితుడనయ్యును, వ్యయము లేని వాడనయ్యును, సర్వభూతముల శాసించు ఈశ్వరుడు నయ్యును, నా స్వీయ ప్రకృతి నధీనము నందుంచుకొని స్వీయ మాయచేత జన్మింతును.

అజుడుగ నుండుచునే ఎట్లు వాస్తవముగ లేనేలేదని కొట్టివేయునది పరిష్కారమెట్లు అగును? కాన అవిద్య, కామ, కర్మల బాఱి నుండి తప్పించుకొనక జన్మించు వాని జన్మ బంధహేతువు. వానిని శాస్త్రాచార్య ఉపదేశోపాయాలతో వివేచించి స్వానుభవములో నిల్చి పురుషోత్తమ ప్రాప్తి పొంది, లోకకళ్యాణమునకై, స్వేచ్ఛగా జన్మించుట దివ్యజన్మ. ఇది బంధహేతువు గాదు. అట్టివారి జీవనమే దివ్య జీవనము.

**శ్లో॥ సక్తాఃకర్మణ్య విద్వాంసో యథాకుర్వంతి భారత ।**
**కుర్యా ద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షు ర్లోక సంగ్రహం॥** **భ.గీ.అ.3.శ్లో.25**

అనగా అవిద్వాంసు లెట్లు కర్మయందు సక్తులై - తగుల్కొని - కర్మ నాచరింతురో, విద్వాంసుడు అసక్తుడై సరిగా అటులే జగత్కళ్యాణము కొఱకు కర్మ నాచరింపవలెను.

ఓం తత్ సత్.

# మద్భావం సోఽ భిగచ్ఛతి

## (భగవద్భావము)

**శ్లో॥ అంత కాలే చ మామేవ స్మరమ్ముక్త్వా కలేబరం ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నా స్త్యత్ర సంశయః ॥ భ.గీ. అ.8.శ్లో.5**

అర్థము:- అంత కాలమునందు సైతము నన్నే స్మరించుచు, ఎవరు దేహమును విడిచి వెళ్ళునో, అతడు నా భావమును పొందుటకు సందియము లేదు.

ప్రతి మనుజుడు ఏదోయొక భావన చేయుచునేయుండును. భిన్న వ్యక్తులు, భిన్న కాలములలో భిన్న దేశములలో వాని ననుసరించి భావనలు చేయుచుండుట సహజము. ఇవి అన్నియు ప్రాపంచిక వ్యవహార భావనలు. అనగా ఇంద్రియ గోచరమగు దృశ్యజగత్తుయొక్క గాని, మనోగోచరమగు వాసనా ప్రపంచమును గురించిగాని సంకల్పించి ఆలోచనా రూప భావనలలో నుందురు. దృశ్యం షడ్భావ వికారవంతము గనుక దానిని గురించిన మన భావనలు కూడ వికార వంతములే అనగా మార్పు చెందుచూ నుండును. మానవుడు పుణ్యరూప లేక పాప రూప భావనలతో తాదాత్మ్యము బొంది, వాటినే నిరంతరము స్మరించుచు, అంత్యకాలమున సహితము వానినే స్మరించుచు ప్రాణము విడిచి, ఆయాలోకములకు పోయి తిరిగి జన్మింతురని శాస్త్ర వాక్యము.

అయోగ్య జీవితమును గడిపిన వానికి మరణ సమయమున విలేపనము (Unction) పూసి, ఇక నీకు యోగ్య మరణమని చెప్పుదురు కొందరు. **"తీర్థేశ్వపచ గృహేవా"** తీర్థమున మరణించిన సద్గతి గల్గును - చండాలుని యింట మరణించిన దుర్గతి గల్గును అని, కాశీలో మరణించుట చేత సద్గతి లభించునని చెప్పెదరు కొందరు. పుణ్య క్షేత్రమే యైనను బ్రాహ్మీ స్థితి లేనందుననే విస్మృతి జెంది మరణ కాలమున

లేడినే స్మరించి జడభరతుడు లేడిగా జన్మించెను. ఇవి అన్నియు సామాన్య అభిప్రాయములు. అనగా ఆత్మజ్ఞానము లేనివారి మాటలు. దృష్టి సృష్టి వాదముతో గాక సృష్టి దృష్టి వాదముతో చూచిన, భగవద్గీత అనుస్మరణము, సర్వాత్మ సమర్పణము, ఈ రెండును భగవద్భావన నీయగవలనుచున్నది. ప్రకృతి సంభూతమగు ప్రపంచము అంతయు భగవంతుడను సనాతన సాగరమందు ఉద్భవించు ఒక తరంగమనియు, ఉన్న సమస్తము ఒకే సత్తయనియు చూచుట జ్ఞానము. ఇట్లు చూచి, ఆరాధనా భావనముతో ఆ భగవంతుని వైపునకు సర్వాత్మనా తిరుగుట భక్తి. జ్ఞాన పూర్వకమగు నీ పరిపూర్ణ భక్తి మనలను మర్త్య ప్రకృతి నుండి అమరసత్తలోనికి లేవనెత్తును. అపుడు ప్రపంచ కల్లోలము మధ్య సైతము మనము విముక్తులమై, ప్రభువులమై నివసింతుము. ఇదియే మద్భావమును, భగవద్భావమును బొందుటయని అర్థము. ఆధ్యాత్మము, అధిభూతము మున్నగు వానియందు బేధ భావము లేకుండ **"బ్రహ్మైవాహమ్"** అని తన యొక్క బ్రహ్మత్వమునే ఏక వృత్తితో బ్రహ్మముగ భావించుచు **"అహం మమ"** అనునట్టి వ్యామోహములకు తావీయక కళేబరమును విడిచి, నా భావమును అనగా మద్భావము, బ్రహ్మభావనను పొందుచున్నాడు. పరబ్రహ్మమునే ధ్యానించుచు దేహ త్యాగము చేసిన బ్రహ్మవిదునకు బ్రహ్మత్వమనునది అప్రత్యక్షము. గావున కలదా? లేదా? అను నీ విషయమున నీవుగాని తదితరుడైన వైదికుడు గాని ఎన్నడును సంశయింపదగదు **"బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి"** అను శ్రుతియు యీ అర్థమునే చెప్పుచున్నది. కనుక బ్రహ్మవిదులైన యతులు నిరంతరము బ్రహ్మాను సంధానము చేయుచు (బ్రహ్మాను సంధానము మాచే రచించబడిన "శంకరాద్వైత వ్యాసమాల"లో ప్రతిదిన స్మరణీయములు అను భాగములో చూడనగును పేజీ 155) అంతకాలము నందును, తనను బ్రహ్మముగనే భావించుచు, బ్రహ్మమే అగుచున్నాడని అర్థము. బ్రహ్మవిదుడు అంత్యకాలమున గూడ బ్రహ్మ రూపుడుగనే యుండవలెను. అనగా దృక్ రూపుడుగనే యుండవలెను గాని దృశ్యరూపుడుగ నుండరాదు.

మద్భావ మనగా నా భావము. అనగా పురుషోత్తమ భావము. పురుషోత్తముని సత్తాస్థితి. అనగా అతడు మానవ భావన వీడి పురుషోత్తమ భావన బొందును. ఇది యొక విధముగా పురుషోత్తముడగుటయే.

ఇచ్చట అంతరాత్మ తన ప్రకృతియొక్క ఒక చరమ పరివర్తనము ద్వారా పురుషోత్తముని ప్రకృతితో యుక్తమగుచున్నది. పరిణామక్రమమున అంతరాత్మ అపర ప్రకృతియందు ఆయా భావములను **"త్వంత్వంభావం"** పొంది క్రమముగా **"స్వభావమును"** తెలిసికొని పొంది, చివరకు తన పరిణామము యొక్క పరాకాష్ఠగా **"భగవద్భావము"** పొందుట, అంతరాత్మకు చరమ పరమ సంభూతి. మానవ భావమనిన మానవ ప్రకృతితో గూడిన సత్తా స్థితి. భావమన్నపుడు ప్రకృతి ప్రసక్తి యుండి తీరవలెను. బ్రహ్మభావన అనినపుడు బ్రహ్మ ప్రకృతితో గూడినపుడే బ్రహ్మ భావన ప్రసక్తి యుండవలెను. (భ॥ గీ॥ 15-16) లోకమున క్షరుడనియు, అక్షరుడనియు ఇరువురు పురుషులు గలరు. అందు సర్వభూతములే క్షరుడు, మఱియు కూటస్తుడే అక్షరుడు. పంచ భూతాత్మకమైన దేహాది ఉపాధి సంఘాతమంతయు క్షరుడు. దేహాదికము క్షరమగును గాని క్షరుడెట్లగును? అనగా క్షర పురుషుడెట్లగును. కనుక క్షర పురుషుడన దేహాదికము గాదు. దేహాదికములో, దేహాదికముతో బాటు మారుచున్నట్లగుపడుచు, దేహాదికమును ధరించియుండు పురుషుడు. దీనినే భ॥ గీ॥ 13-28 సర్వభూతముల యందును సమముగానుండి వాని శరీరములు నశించునపుడు నశించనట్టి ఈశ్వరు నెవరుచూచునో, వాడే యదార్థమును చూచినవాడు అని చెప్పుచున్నది. మఱియు అక్షరుడు = కూటస్తుడు అనగా అచలుడు, ఆత్మ పురుషుడు. క్షరాక్షరులిద్దరు సృష్టి ప్రకియకు అవశ్యము. క్షరక్రియకు ఆధారుడగుచు అక్షరుడు అచలమగు ఆత్మయే కావలెను. ఈ పరమ పురుషుడును తన కాలాతీత స్థానమున అక్షరుడే. అక్షరాత్మ నిర్విశేషుడు. ఈ సనాతన సద్వస్తువు అంతరాత్మ సత్తకు ఆధారమగు పరమోన్నత పదము.

సత్త ఒక భ్రాంతి కాదు. ఒక పదార్థముగాన సత్తకు ఒక సూక్ష్మరూపము ఉండనే యుండును. ఆ రూపము అణువుకంటె అణువు గనుక మనశ్చేతనకు చింత్యము గాదు (అచింత్య రూపము). క్షర సత్త క్షర పురుషుడు, అక్షర సత్త, అక్షర పురుషుడు, ఉత్తమ సత్త, ఉత్తమ పురుషుడు (15-17 గీత) ఇట్లు ప్రతి సత్తకు సత్తావంతుడగు ఒక పురుషుడుండవలెను. పైకి పోయినకొలది సత్తకును, పురుషునకును అధికాధిక అభేదము అనుభూతమగును. లోని భావమును (సత్తను) లోని పురుషుడునుచున్నాడు. **"బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి"** అనగా బ్రహ్మమును తెలిసికొని, బ్రహ్మభావన చేయువాడు బ్రహ్మమే. మనకు తెలియవలసినది **"సత్తా రూప భావమునకు"** సత్ పురుషునకు భేదము లేదు. సత్ సామాన్య రూపము. సత్తా విశేష రూపము. సామాన్య విశేష రూపములుగా బృహదారణ్యకోపనిషత్తు బహుళముగా వివరించును.

**"అంతకాలేచ మామేవ"** అనుట చేత అంత్యకాలమందును బ్రహ్మాను సంధానము చేయుట విధియైయున్నది. **"సదాతద్భావ భావిత:"** అనుటచేత అంతకు పూర్వముగూడ నిరంతరము బ్రహ్మాను సంధానము విధియైయున్నది. **"తస్మాత్సర్వేషు"** అనియు **"అభ్యాసయోగయుక్తేన"** అనియు చెప్పిన యీ అర్థము బ్రహ్మవిదులకును, సగుణోపాసకులకును సమానముగానే వర్తించునని ఎఱుంగవలెను. ఎఱిగి ప్రయత్న పూర్వకముగా అనుష్ఠించవలెను. మఱియు భ॥ గీ॥ 14-19. **"గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సో ధిగచ్ఛతి"** అని యున్నది. అనగా గుణములకు పరమునందున్న దానిని నెవ్వరెరుంగునో అట్టి ద్రష్టయగు జ్ఞాని నా భావమును పొందును. ఈ గుణకర్మలకు పరుడును వానికి ఈశ్వరుడును అయిన భగవంతుని తెలియవలెను. తెలిసి కర్మలకు అధీశ్వరుడైన అతని చేతులయందు మన కర్మల నుంచవలెను. మనమపుడు ఈశ్వరుని ఇచ్ఛకు ఒక నిష్కామ, సమచిత్త ఉపకరణముగా నుందుము. మనకు కర్మ సంగముండదు. భగవదిచ్ఛ మన ద్వారా సాగిపోవుచుండును. కర్మను సన్యసించుట గాక, భక్తి జ్ఞానములతో గూడిన కర్మవలన మానవుడు భగవద్భావమునందును. అనగా భగవంతుని స్థితితోను, గతితోను వేరు మాటలలో భగవంతుని సత్తతోను, ప్రకృతితోను

ఏకమగును.  ఇట్లే దివ్యకర్మ మానవుని కర్మ సమస్యను పరిష్కరించుటయేగాక భగవద్భావ రూపమగు అతని పరిపూర్ణతను సైతము సాధించును.  దీనినే

**శ్లో॥  ఏషా బ్రాహ్మీ స్థితి: పార్ధనైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాస్యా మంతకాలేఽపి బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి.**  **భ.గీ.అ.2.శ్లో.72**

భావము:  ఇదిగో, యిది, అర్జునా, బ్రహ్మీస్థితి - బ్రహ్మయందు సుస్థిర స్థితి.  దీనిని బొందిన వాడెన్నటికిని తిరిగి మోహమును పొందడు.  కనుక అంతకాలము నందు సైతము దానియందు నిలిచి, అతడు బ్రహ్మ నిర్వాణమును బడయును.  అనగా ఏకము అనంతము, నైర్వ్యక్తికమునగు బ్రహ్మ మహా సత్తయందు వేరుచేయు స్వభావము గల అహంకార వ్యక్తిత్వము యొక్క నిర్వాణము.

యీ శ్లోకము మదీయ గురుసత్తములగు శ్రీ ప్రణవానంద స్వాములవారికి అతిప్రీతికరమగుటచే తమ మహాప్రస్థాన సమయమున ఇచ్చిన దివ్య సందేశములో యీ శ్లోకమునే ఉదహరించిరి.

ఓం తత్ సత్.

# అవికంపేన యోగేన

**శ్లో॥ ఏతాం విభూతిం యోగంచ మమ యోవేత్తి తత్త్వత:**
**సోఽవికంపేన యోగేన యుజ్యతే నా త్ర సంశయ:** భ.గీ.అ.10.శ్లో.7

అవి కంపము:- నిశ్చలము, స్థిరము.

యీ అవికంప శబ్దము గీతలో అచ్చటచ్చట చూడగలము. యోగమనగా ఐశ్వర్య యోగము (గీ 9-5) ఈ యోగశక్తి చేత - విశ్వాతీతుడగు ఈశ్వరుడు విశ్వమునందు సమస్త వస్తువుల కంటెను అధికుడయ్యు, వానితో సంయోగము నందుండును. వానిలో ఏకముగా నుండును. వానిలో నివశించుచునే, వాని నన్నింటిని తన స్వీయ ప్రకృతి యొక్క పరిణామ భావములుగా తనలో ధరించియుండును. యీ నిర్వచనమువలన ఈశ్వరునికి మనకు మధ్య అజ్ఞానము తప్ప మఱే అడ్డుగోడ లేదని తెలియును. ఈశ్వరుడు ఒక రాజుగా ఎక్కడో ఉండి మనలను పాలించుటలేదు. మనలోనేయుండి మనలను నడుపుచున్నాడు.

**శ్లో॥ ఈశ్వర: సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥** భ.గీ.అ.18.శ్లో.61

అనగా సర్వభూతముల హృదయములందును అసీనుడైయున్న ఈశ్వరుడు తన మాయచేత శరీర యంత్రముల నారోహించి యుండి, సర్వభూతములను గిరగిరా త్రిప్పుచుండునని చెప్పుచున్నది.

ఈశ్వరుని వలెనే ఈశ్వర జ్ఞానమును మనకు దూరముగా నుండదు. ఈశ్వరుని దూరముగానున్న ఒక వస్తువుగా గాక మన ఆత్మగానే మనముగానే తెలిసికొనవలెను. ఇదే ఆయనను తెలిసికొను విధానము. ఈశ్వర జ్ఞానము తన స్వభావము చేతనే

ఈశ్వరయోగము లోనికి పెరుగును. ఇట్లు సమగ్ర జ్ఞానముచేత ఫలించిన యోగము **"అవికంపము".**

నిర్విశేషమైన పరబ్రహ్మము యొక్క మాయచే కలుగు విభూతిని (వి=వివిధ రూపములతో, భూతి: ఉండు, ట=విభూతి యనబడును) ఐశ్వర్యయోగమందురు. అనగా సృష్టి స్థితిలయ ప్రవేశ నియమన, నిగ్రహాను గ్రహాది సామర్థ్యము. శాస్త్రాచార్యోపదేశముల వల్ల గలిగిన వివేకము ద్వారా కనిపెట్టువానికి ఇది జగత్తుగాదు, మరేమన, పరమాత్మ యొక్క స్వరూపముగనే కన్పించును. కార్యమైన దంతయు కారణ మాత్రమే యనెడి న్యాయమునుబట్టి అంతయు పరమాత్మ స్వరూపమే యని తెలిసికొనగలరు. లక్ష్యమునందు సూక్ష్మబుద్ధితోను, యుక్తితోను లక్షణము నన్వేషించు వారలకును, లక్ష్య లక్షణ సంబంధముల నాలోచించు వారలకును ఈశ్వరానుగ్రహము వలన బ్రహ్మ తత్త్వము తెలియనగును. అట్టి దృష్టి లేనివారికి ఈశ్వరానుగ్రహము కలుగుటగాని, బ్రహ్మతత్త్వము తెలియుటగాని జరుగదు. ఈ విభూతి అంతయు నిర్విశేష నిర్వికార పరబ్రహ్మము నందు మాయచేతనే కలుగునని, యదార్థ స్థితిని దర్శించుటచేత సద్గురు కృపకు పాత్రుడై ఆత్మ విజ్ఞానము కలవాడై తెలిసికొనుచున్నాడో అట్టి బ్రహ్మవేత్త **"అవికంపితుడు",** బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానము చేత వికల్పములనుండి విడువబడి, సమ్యగ్దర్మన రూపమునందుండి, అవికంపితుడగును. అహమ్, మమ, ఇదమ్, అను వికల్పములను జెందడు. **"మయ్యేవ సకలం జాతం మయిసర్వం ప్రతిష్ఠితమ్".** ఇత్యాది శ్రుతి ప్రసిద్ధమైన బ్రహ్మాత్మైకత్వ విజ్ఞాన నిష్ఠయందుండును. బ్రహ్మమే నేను, నేనే బ్రహ్మను, అని అవికంపితుడై అనుసంధానము చేయుచుండును. దీనిని బట్టి శతవిధముల శ్రవణము, బోధకూడ చేసినవారే అయినను, నిరంతర నిష్ఠగల యతులనే ఈశ్వరుడనుగ్రహించుచున్నాడు.

ఆత్మ తత్త్వము నెరింగి యతులు నిరంతర బ్రహ్మనిష్ఠయందుండ నగునని సూచితమైనది. ఈశ్వరుని మనము మన ఆత్మగా ఆధ్యాత్మిక చేతనచేత తెలిసికొందుము. భౌతిక చేతనకు భగవంతుడు ఒక అస్పష్ట భావనగా తోచును. భౌతిక చేతన ద్రవ్యము నెంత స్పష్టముగా ఎంత ప్రత్యక్షముగా జూచునో ఆధ్యాత్మిక

చేతన భగవంతుని అంతస్పష్టముగాను అంతకంటె ఎక్కువ స్పష్టముగాను, అంత ప్రత్యక్షముగాను, అంతకంటె ఎక్కువ ప్రత్యక్షముగాను జూచును. అది భగవంతుని జూచును, అనుభవించును, చింతించును, మఱియు స్పృశించును. ఆధ్యాత్మిక చేతనకు ప్రపంచం అంతయు ఆత్మగానే కన్పించును. ద్రవ్యముగగాని, ప్రాణముగగాని చివరకు మనస్సుగ గాని కాదు. మఱియు ఎట్లన ద్రవ్యమును ఆకృతిగా ధరించిన భగవంతుని గను, ప్రాణము శక్తి రూపముననున్న భగవంతునిగను మనస్సు భావరూపముగనున్న భగవంతునిగాను చూచును. ఎట్లు వర్తించినను భక్తుడు భగవంతుని యందే వర్తించును.

**శ్లో॥ సర్వభూత స్థితం యో మాం భజత్యేకత్వ మాస్థిత:।**
**సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే॥** **భ.గీ.అ.6.శ్లో.31**

భావము: నాతో ఏకత్వము నవలంభించి, సర్వభూతములయందునన్ను ప్రేమించు యోగి - అతడే ప్రకారమున నివసించుచున్నను, కర్మ చేయుచున్నను, నాయందే నివసించును, కర్మచేయును.

ప్రేమధర్మమే ఈశ్వరయోగికి యిపుడు పరమధర్మము. శ్రీ సత్యసాయి బాబాగారు కూడ యీ ప్రేమతత్త్వమును అనుదినము ప్రబోధ ప్రచారములలో పెట్టుచున్నారు. ఆయనగారి గోష్ఠికూడ ఎల్లపుడు దీనితోనే సాగును. స్వస్వరూపసాక్షాత్కార సిద్ధిని గురించిన ఆసక్తియే ప్రేమ. అట్టివారికి పరమాత్మ **"సర్వమిదమహంచ బ్రహ్మైవ"** అను సమ్యగ్ దృష్టి రూపజ్ఞానము నొసంగును.

భౌతిక మనస్సుకు భగవంతుడు **"నేతి నేతి"** అనగా ఇది కాదు ఇది కాదు అని కన్పించును. పోతే పై చెప్పిన సాధకుని మనస్సునకు **"ఇతి ఇతి"** గా అనగా ఇది భగవంతుడే ఇది భగవంతుడే అని కన్పించును. ఈ స్థితియే అవికంపయోగము అనబడును. ఆరూఢ స్థితిలో నున్న మహా సిద్ధులకే యిది సిద్ధించును అనుట నిర్వివాదాంశము.

ఓం తత్ సత్.

# వి ది తా త్మ లు

**శ్లో॥ కామక్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్,**
**అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే విదితాత్మనామ్.** **భ.గీ.అ.5.శ్లో.26**

భావము:- కామక్రోధముల నుండి విముక్తులై, ఆత్మ వశిత్వమును సాధించిన యతివర్యులకు బ్రహ్మ నిర్వాణము నలువైపుల వారిని చుట్టి విలసిల్లును. వారి కాత్మజ్ఞానము కలదు గాన, వారు దానియందు నివశించుచునే వున్నారు.

కామక్రోధముల నుండి వేరైనవారును, శాంతులును, సర్వమునకు నిజరూపమగు ప్రత్యగభిన్న బ్రహ్మమునందే మనస్సును నియమ పూర్వకముగా స్థాపించినవారును, నిరంతరము బ్రహ్మమునందుండు వారును అనగా ఆత్మ తత్త్వము నెరింగినవారగు బ్రహ్మవేత్తలకే జీవించి యున్నపుడు, దేహ పతనానంతరము బ్రహ్మానందానుభవము సిద్ధించుచున్నది. ఇట్టి సమ్యజ్ఞానము గలవారే విదితాత్ములు. ప్రత్యగాత్మయగు తనను పరబ్రహ్మముగనే గుర్తించి, పరబ్రహ్మమును తనకభిన్నునిగా గుర్తించి, శాంతిని బడయుచున్నారు. విదితాత్ములను నిర్వాణము నలువైపుల చుట్టుకొనియుండును. ప్రపంచ చేతనను తనలో ఇముడ్చుకొనును. విదితాత్ములు బ్రహ్మశాంతియందు నివశించుచునేయున్నారు.

బ్రహ్మ నిర్వాణము యొక్క పదార్థమే ఆత్మజ్ఞానము. పుష్పమును సౌరభము చుట్టియుండునట్లు ఆత్మజ్ఞానిని నిర్వాణము చుట్టియుండును. నిర్వాణము నిమిత్తము సమాధిలో కూరుకొని పోనవసరము లేదు. లేక ప్రపంచము నుండి ఉపసంహరించు కోవలసిన అవసరము లేదు. ఏ బ్రహ్మయందు ఋషులు తమ అహంకార నిర్వాణమును బొందుచున్నారో, ఆ బ్రహ్మ అతీతముగనే గాక, అన్నిటియందును వ్యాపించి, విస్తరించి యుండును.

**శ్లో॥ అవినాశితు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।**
**వినాశ మవ్యయ స్యాస్య న కశ్చిత్ కర్తు మర్హతి ॥** **భ.గీ.అ.2.శ్లో.17**

భావము:- దేనిచేత నిదియంతయు విస్తరింపజేయబడి యున్నదో, అర్జునా అది అవినాశి ఆత్మయని తెలియుము. అవ్యయమగునట్టి ఆత్మకు నెవ్వరును వినాశమును గల్పింపజాలరు అని చెప్పుచున్నది. బ్రహ్మ నిర్వాణము బొందిన ఋషులు సర్వభూతము లందును బ్రహ్మను, ఈశ్వరుని దర్శింతురు. సర్వ భూతములకు హితమునాచరింతురు. ఇట్లు సర్వభూత హితాచరణమును, ఆత్మజ్ఞానమువలె నిర్వాణ హేతువు మాత్రమే గాక నిర్వాణ పదార్థమే. అనగా సారమే యగును. కనుక నిర్వాణము క్రియా దూరము గాదు. ప్రత్యుత క్రియాధారము, క్రియా సహితము, క్రియా గతము, క్రియాత్మకము. మానవసేవయే మాధవ సేవయని మహాత్మాగాంధిగారు తమ జీవితమంతయు లోకహితమునకు ఉపయోగించిరి. అనగా దేహము లన్నింటియందును, జ్ఞానరూపముగనున్న ఏకరూప భగవంతుని దర్శించి వారి హితమును గోరి వ్యవహరించువారే విదితాత్ములు.

ఓం తత్ సత్.

# న త స్య ప్రా ణా ఉ త్క్రా మ ం తి

**"నతస్యప్రాణా ఉత్క్రామంతి, బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి॥ బృ.ఉ.**

అనువాదము:-అతని ప్రాణములు ఉత్క్రమించవు. అతడు తన జ్ఞానము వలన ఇపుడు బ్రహ్మముగనే ఉన్నాడు. కాన బ్రహ్మములో లీనమగును.

**శ్లో॥ ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్।**
**య: ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిం. భ.గీ.అ.8శ్లో.13**

అనగా బుద్ధిని ఓంకార - ఉచ్చారణయందు ఏకాగ్రపరచి, ఆ బుద్ధియొక్క భావనాశక్తిని నన్ను అనుస్మరించుట యందేకాగ్రపరచి యీ యోగ ప్రక్రియ నవలంబించి ఎవరు దేహమును విడిచి పయనింతురో వారు పరమగతిని బొందుదురు.

ఇది క్రమముక్తి లేక కాలాంతర ముక్తి అని కొందఱందురు. మఱికొందరు ఆత్మ నిర్వ్యక్తికము. అంతరాత్మ ఆత్మలోనికి పయనించును అపుడు అదియు నిర్వ్యక్తికమగును. ఇచ్చట రెండు ప్రత్యామ్నాయములు గలవు. రెండు పర్యవసాయములకు అవకాశముగలదు.

1. నేతినేతి సాధన ద్వారా ఆత్మలోనికి వెళ్ళిన సాధకుడు, ఆ నిర్విశేషమగు ఆత్మలో లీనము కాగోరిన అట్లు చేయవచ్చును. అనగా అతనికి ఉత్రమణముండదు. మఱియొకటి కర్మ భక్తి జ్ఞాన రూపమగు సమగ్ర సాధనచే ఆత్మలోనికి వెళ్ళినవాడు అక్కడ తన అహంకార వ్యక్తిత్వమును మాత్రమే లీనమొనరించు కొనును. పిమ్మట నిరహంకారుడై ఆత్మకుపైన భగవంతుని ఆరాధించి, సర్వమునకు మూలమగు ఆ భగవంతునియందు, తన సనాతన ఆధ్యాత్మిక వ్యక్తిత్వమును తిరిగి పొందును. పై ఏకమాత్ర భగవంతుని యొక్క అజము, అమరమునగు ఒక సనాతన శక్తియే ప్రతిజీవుడు. ఇట్లు సనాతనుడు గావుననే మోక్షమునందు జీవలయము చెప్పలేదు.

**శ్లో॥ మమైవాంశో జీవలోకే జీవభూత: సనాతన:।**
**మన: పష్ఠా నీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥** **భ.గీ.అ.15.శ్లో.7**

భావము:- జీవలోకమునందు జీవుడైనవాడు నా సనాతనాంశమే కాని, వేఱు కాదు. అతడు శరీరమున తమ తమ స్థానములందుండు పంచేంద్రియములను మఱియు సామాన్యేంద్రియమగు మనస్సును తనతో తీసికొనిపోవును. అనగా అభివ్యక్తియందు అతడు నా అంశము. అతడు నా ఆంశికాభివ్యక్తి. అయినను అతడు నా అంశము గనుక, స్వరూపతం అనగా తన ఆధ్యాత్మిక సత్యతయందు, అతడు నేనే. అతడు నా కంటె ఇతరుడుగాడు. నా నుండి వేరుబడియు లేడు. ఏకమగు ఆత్మ లేక అక్షరము నేనైనట్లే అనేకమగు క్షరము లేక జీవుడు నేనే, దీనినే భ॥గీ॥ 15-17 చెప్పుచున్నది. జీవుడు సంసిద్ధియందు నాయందు నివసించునని, భ॥గీ॥ 12-8. చెప్పుచున్నది. పురుషోత్తముని యొక్క ఈ సనాతనాంశమే అంతరాత్మ వెనుకనున్న పరమగుహ్యము. ఈ బహుత్వము లేనపుడు జీవునికి అంతరాత్మయుండదు, జీవునియందు దివ్యాంశము ఏమియు నుండదు. ఈ అంతరాత్మ ఇప్పటి తన అభివ్యక్తి రూపముకన్న నెంతో అధికతరము. అంతరాత్మ మానవతకు మాత్రమే బద్ధమైయుండదు.

అంశమనగా ఒక ముక్కయనిగాదు. ప్రతిదానికి ఒక శాశ్వతమైన స్వభావము నిలిచియుండును గదా! ఈ స్వభావము (స్వ = పరమాత్మ యొక్క, భావము = శక్తి) లు ఎన్ని కన్పించుచున్నవో అవన్నియు ఒకే పరమాత్మ యొక్క అనేకానేక శక్తి విశేషములు. అనగా ఒకే పరమాత్మ తన అనేకానేక సనాతన శక్తులకే అనేకానేక జీవులయ్యెను. దీనినే, భ.గీ.అ.7.శ్లో.5 చెప్పుచున్నది. ఈ అర్థమున అభివ్యక్తి ఒక మార్పు గదా! మఱియు మార్పు నాశ లక్షణము గదా యనిన అదియును గాదు. పరమాత్మ మారుచుండు క్షర పురుషుడు అగుచునే, అదే సమయమున తదీతుడగు పురుషోత్తముడు గూడను. అందుచేత మార్పునందు అతడు ఇమిడిపోడు. కాన మాఱుచున్నను తాను తానుగనే యుండును. ఇట్లు అభివ్యక్తిచేత అతనికి నాశప్రసంగమే లేదు. ఈశ్వరుడే జీవరూపమున విషయానుభవము కొఱకు ఇంద్రియములతోబాటు దేహమును ధరించుచున్నాడు.

వాయువు పుష్పము నుండి గంధమును గొనిపోవునట్లు జీవుడు నూతన శరీరమును ధరించునపుడు, పురాణ శరీరమును విడిచి వెళ్ళునపుడును ఇంద్రియములను తనతోబాటు తీసికొనిపోవును. బ్రహ్మముగ నుండియే పరిణామక్రమమున, అంతరాత్మగా, ఆత్మగా, పురుషోత్తముడు (పరమాత్మ)గా భావరూపమున గోచరించును.

భావత్వము రెండు విధములుగ నుండవచ్చును, 1) త్రికాలాభాద్య (నిత్య) భావము, 2) క్రియాకారిత్య రూపా నిత్యభావము. ఆత్మయు, బ్రహ్మమును మొదటి జాతి భావ పదార్ధములు. మృత్తు, సువర్ణము ఇత్యాదులు రెండవ జాతి భావపదార్ధములు. ఇక్కడ అవిద్య తత్కార్యములైన విజ్ఞానమయ జీవభావాదులు రెండవ జాతికములు వీనికి అనాదిత్వమున్నను నాశత్వ సంభవమున్నదని సిద్ధాంతము.

ఘటమునందు = మృత్తు సద్రూపము, ఘటము సత్తా రూపము అట్లే భగవంతుడు సద్రూపము. భావము సత్తా రూపము. భావము దృశ్యము. భావయిత దృక్ కనుక భావరూప దృశ్యము పరిణమించును. దృగ్రూప భగవంతుడు నిర్వికారుడగుచు భావరూప దృశ్యము నందు పరిణమించినట్లు అగును. కాన వివర్తము, పరిణామము సమనియతములు.

ఓం తత్ సత్.

# నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం

**శ్లో॥ అనన్యాశ్చింతయంతో మాం యే జనా: పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥ భ.గీ.అ.9.శ్లో22**

భావము:- ఏ జనులు అనన్యులై, అనగా నాతో అబేధమునందుండి, నన్ను గుఱించి చింతింతురో, మఱియు అనుక్షణము నాతో యోగము నందు వుందురో, మఱియు సర్వభూతముల యందు నన్ను ప్రేమింతురో, అదిగో, వారి యోగక్షేమములను నేను వహింతును.

అనన్యమనగా ఇతర విషయములపై మనస్సును పోనీయకుండుటయని కొందఱు, భగవంతునితో ఏకాత్మకులని కొందఱు, భగవంతునితో అభిన్నులని మఱి కొందరు చెప్పుదురు. కేవల ఏకత్వమేయైనచో ఉపాసనయే యుండదు. అది భగవంతునిలో బేధాబేధము. కాననే గీత ఏకమనకుండ అనన్యము అనుచున్నది.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనా: పర్యుపాసతే।**

పరి = అంతటను, అన్నింటియందును, ఉపాసతే = భగవంతుని ప్రేమింతురు.

తన భగవద్దర్శనము భక్తుని జీవనము నుండి వేఱుచేయదు. పూర్ణ జీవనము యొక్క ఏ అంశమును అతడు పోగొట్టుకొనడు. భగవంతుడు అతనికి సర్వశుభముల సహజ ప్రదాతయగును. మఱియు బాహ్య యోగక్షేమమును వహించును. భగవంతుడు భక్తునకు బుద్ధియోగమునిచ్చి జ్ఞాన దీపముచేత లోని అంధకారమును రూపుమాపును. దీనినే

**శ్లో॥ తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతి పూర్వకం।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే॥భ.గీ.అ.10.శ్లో.10**

ఈ శ్లోకము ద్వారా చెప్పుచున్నది. గాయత్రీమంత్రములోని **"ధీయో యోన: ప్రచోదయాత్"** అనునది కూడ దీనినే బలపరచుచున్నది.

ఇట్టి అనన్య చింతనా రూపభావనకే, అనన్య భక్తియని పరా భక్తియని పేరు. సామాన్యమైన భక్తి జ్ఞానానికి పూర్వ భూమిక. జ్ఞానమంటే పరమార్థాన్ని గూర్చి చేసే విచారణ. అది భక్తి శ్రద్ధలుంటే గాని ఏర్పడదు. ఏర్పడిన తర్వాత, ఆ జ్ఞానమపరోక్షమైన అనుభూతినివ్వాలి. ఇది ఆ కలిగిన జ్ఞానంలో నిష్ఠ ఏర్పడితేగాని రాదు. ఈ జ్ఞాననిష్ఠనే అనన్య భక్తియని వ్యవహరిస్తారు. ఇది కేవల జ్ఞానంకంటె శ్రేష్ఠమైనది. ఆత్మ చైతన్యం తప్ప మఱిదేనికి ప్రవేశం లేదీ భూమికలో. చూచేది, చూడబడేది, చూపు అంతా ఆత్మే. పర్యుపాసతే యను మాటకిదే అర్థము. పరిత: - ఉప - ఆసనా - అంటే అంతటా తన స్వరూపాన్నే చూస్తూ దాన్నే పట్టుకొని కూర్చోవడం. అలా ప్రతిక్షణం ఆత్మ చింతనతో కాలం గడిపితే సాధకునకు పనులు ఎలా జరుగుతాయని ప్రశ్న.

అవి జరగడానికి ఈశ్వరుడే యున్నాడు. ఈశ్వర ప్రకృతే గదా ఇదంతా. కార్యకారణములు దీనిలోనే గదా! దానికధ్యక్షుడైన ఈశ్వరుడే ప్రేరణ కలిగిస్తాడు.

అది మన ప్రారబ్ధాన్ని బట్టి ఎక్కడో లోకములో ఎవరికో బుద్ధి పుట్టించి ఏదో యొక ఉపకారము మనకు చేయిస్తుంది. ఇక మనకు భయమేమున్నది. ఊరకున్న జరుగవలసినది జరుగుతుంది. భగవాన్ రమణ మహర్షి గారు కూడ ఇదే అభిప్రాయమును తెలుపుచుండెడి వారు. మన దగ్గరకది దొర్లుకుంటూ వస్తుంది. ఇదే యోగం. పోతే వచ్చినది మన ప్రారబ్ధాన్ని బట్టి ఎక్కడికి పోదు. ఎంతకాలముండాలో అంతకాలముండి తీరుతుంది. ఇదే క్షేమం. ఇది లోక విషయంగా చెప్పే మాట. దీనిని ఈశ్వర ప్రేరణ యందుము. సాధన విషయంలో ఈశ్వరుడే స్వయంగా అనుగ్రహిస్తాడు. సాధనకు ప్రబలమైన ప్రతిబంధకాలను తొలగిస్తూ ఫలించేలాగు చూస్తాడు. రజోతమో గుణ సంపర్కము వల్ల ఏర్పడిన మనోదౌర్బల్యాన్ని నిరంతర బ్రహ్మ చింతనలోనున్న సాధకునికి ఈశ్వరానుగ్రహంవల్ల తొలగిపోతుంది. తాను ఈశ్వరుడయ్యేవరకు

ఈశ్వరుడుండనే యుంటాడు. లేదా తానే ఈశ్వరుడననే ఏ భావం ఉందో అదే ఈశ్వరుడనుకోవచ్చు. ఆ భావనే మనలను అనుగ్రహిస్తుందని చెప్పినా చెప్పవచ్చును. ఇట్లు అనన్య చింతనా నిష్ఠాపరులగు జనులు భగవంతునిలోనికి పెరుగుదురు. కాగా భగవంతుడు గూడా తన అనంత సత్త యొక్క సమస్త ప్రకాశము, శక్తి మఱియు ఆనందములతో వెలువడి అతనిపై ప్రవహించును. ఇట్టితఱి భూలోక స్వర్గలోక[1] సుఖమంతయు, అతని మహా సంపత్తి యొక్క ఒక స్వల్ప ఛాయా మాత్రమే యగును.

ఓం తత్ సత్.

# భక్తి - అహంగ్రహోపాసన

**శ్లో॥ స్వాత్మ తత్వాను సంధానం భక్తిరిత్య పరేజగు:** **వివేక చూడామణి శ్లో.32**

**"భక్తి"** యనగా ఆత్మ తత్వమును అనుసంధించుట యని చెప్పుదురు.

స్వాత్మ తత్వం:- జీవుడే పరమాత్మ యగునని భావించి ఉపాసించుట అహంగ్రహోపాసన యందురు. నిజముగా జీవునకు పరమాత్మకు బేధమున్నప్పటికి బేధము లేనట్లుగా జీవుడు పాసించుట, స్వాత్మ తత్వాను సంధాన మన ప్రత్యగాత్మ పరమాత్మగ మార్పు చెందునని భావించుట. **"సోఽహం సోఽహం"** ఇట్లు జపించుట, భావించుట **"భక్తి"**యని కొందరందురు. ఇందు బేధ బుద్ధి ముందిడు కొన్న భ్రాంతి రూపమైన యీ పద్ధతికి ముఖ్య భక్తిత్వములేదని సూచితము.

శాస్త్రములో మూడుపాసనలు ప్రసిద్ధము.

1) అంగావ బౌధోపాసన:- యజ్ఞాంగములలో కలశమును, దర్భకూర్చను, స్రుక్ స్రువాదులను గ్రహించి "బ్రహ్మేణ మావా హయామి" అను మంత్రముతో అంగములను బ్రహ్మముగ భావించుట.

2) ప్రతీకోపాసన:- సాలగ్రామాదులను, ధనుర్బాణాదులను బ్రహ్మముగా భావించుట.

3) అహంగ్రహోపాసనము:- జీవుని ఆత్మగా భావించుట. **"దేహో దేవాలయ: ప్రోక్తోజీవో దేవస్స నాతన: త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్"** అటులనే గీతలో **"బ్రహ్మేర్పణం, బ్రహ్మహవిర్, బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం, బ్రహ్మైవతేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా"** ఈ ఉపాసనమంతయు కర్మాంగమై ద్వైత తత్వముగా నడచును. అహం గ్రహోపాసనకు ప్రతిదినము సూర్యోదయము మొదలు అనగా గం.6.00 మొదలు గం.6.40 నిమిషముల వరకు ఆధారకమల మధ్యమున ప్రతిష్ఠించుకొనిన గణపతియందు మనస్సు నిలిపి, ఇడా పింగళానాడుల యందు ఉచ్ఛ్వాస నిశ్వాస రూపమున సంచరించెడు హంసతో **"సోఽహం"**

అను మంత్రమును గూర్చి 600 హంసలు గణపతికి నర్పించవలెను. ఉదయము గం.6.40 మొదలు మధ్యాహ్నము గం. 1.20 వరకు గల గం. 6.40 నిమిషముల కాలము స్వాధిష్ఠాన కమలమున ప్రతిష్ఠించుకొనిన బ్రహ్మదేవుని యందు మనస్సు నిలిపి ఉచ్ఛ్వాస రూపముగ సంచరించెడు హంసతో **"సోఽహం"** అను మంత్రమును గూర్చి 6000 హంసలను బ్రహ్మదేవుని కర్పించవలెను. మధ్యాహ్నము గం.1.20 నుండి రాత్రి గం. 8.00 వరకు మణిపూరక కమల మధ్యమున ప్రతిష్ఠించుకొనిన విష్ణుదేవుని యందు మనస్సు నిలిపి, ఉచ్ఛ్వాస, నిశ్శ్వాస రూపముగ సంచరించెడు హంసతో **"సోఽహం"** అను మంత్రమును గూర్చి 6000 హంసలను విష్ణుదేవున కర్పించవలెను. రాత్రి గం.8.00 నుండి గం.2.40 వరకు అనాహత కమల మధ్యమున ప్రతిష్ఠించుకొని రుద్రదేవుని యందు మనస్సు నిలిపి, ఉచ్ఛ్వాస నిశ్శ్వాస రూపముగ సంచరించెడు హంసతో **"సోఽహం"** అను మంత్రమును గూర్చి 6000 హంసలను రుద్రదేవున కర్పించవలెను. రాత్రి గం.2.40 నుండి గం.3.46.40 సెకండ్ల వరకు గల కాలమును విశుద్ధ కమలమున ప్రతిష్ఠించుకొనిన జీవునియందు మనస్సు నిలిపి ఉచ్ఛ్వాస, నిశ్శ్వాస రూపముగ సంచరించెడు హంసతో "సో6హం" అను మంత్రమును గూర్చి 1000 హంసలను పరమేశ్వరుని కర్పింపవలెను. రాత్రి గం.4.53-20 నుండి ఉదయము గం.6.00 వరకు గల కాలము సహస్రార కమలమున ప్రతిష్ఠించుకొనిన సద్గురు మూర్తి పాదపద్మముల యందు మనస్సు నిలిపి ఉచ్ఛ్వాస నిశ్శ్వాస రూపమున సంచరించెడు హంసతో **"సోఽహం"** అను మంత్రమును గూర్చి 1000 హంసలను సద్గురుమూర్తి కర్పింపవలెను.

ఇందు కల్పనాక్రియ ముఖ్యముగాన అద్వైతులు దీనిని ముఖ్యభక్తి (పరాభక్తి)గా పరిగణించరు. బహిరంగమైన సాలిగ్రామ పూజకన్న మానసిక పూజ **"శివోహం"** అని పూజించుట మేలు. దేవ దేవతా పూజ కన్న అహం గ్రహోపాసనకు **"సోఽహం"** అనెడు ఉపాసన మేలు. కాని ఇది ఆత్మ సాక్షాత్కారమునకు సాక్షత్ సాధనముగాదు. భ్రాంతి అజ్ఞాన, అవిద్యాత్మక ద్వైతములు శ్రవణాదులచే నశింపగా ఏ నిత్యానంద స్థితి మిగిలియుండునో అదియే నా స్వరూపమగునని స్వస్వరూపాను సంధానము చేయవలెను. దానినే పరాభక్తి యందురు.

**శ్లో॥ మోక్షకారణ సామగ్ర్యాం, భక్తిరేవ గరీయసి,**
**స్వ స్వరూపాను సంధానం భక్తి రిత్యభి దీయతే॥** **వి.చూ.శ్లో.31**

తా॥ భక్తియే మోక్షకారణ సామగ్రిలో మిక్కిలి గొప్పది. వివేక - వైరాగ్య - శమాది షట్కము - ముముక్షతా - గురూప సదనము - శుశ్రూషా - శ్రవణ మనననిది ధ్యాసనములు. ఇవి మోక్షము పొందుటకు సామగ్రి అనగా సాధన సమూహము. ఇందులో **"భక్తి"** యనునది నిది ధ్యాసనము యొక్క పర్యాయ పదము. భక్తి (నిధి ధ్యాసనము) మోక్షమునకు సాక్షాత్కారము గాన గరీయసీ అని పూజ్య పాదోపదేశము.

ఓం తత్ సత్.

# సద్గురు సహస్ర నామార్చన విధి

సద్గురు పుత్రుడు ప్రతిదినము నిద్ర నుండి లేవగనే సహస్రార కమల మధ్యము నందు ప్రతిష్ఠించుకొనిన సద్గురుమూర్తిని ధరించి వారికి సహస్రనామార్చన మొనర్చిన పిదపనే యితర కార్యము లాచరించవలెను.

సూర్యోదయమునకు పూర్వము బ్రాహ్మీ ముహూర్తము రాత్రి గం.4.30 లకు నిద్ర నుండి మేల్కాంచి కాలకృత్యములు దీర్చుకొని విజన ప్రదేశమున ఉత్తర దిక్కు ముఖముగా సిద్ధాసనంబు గాని, పద్మాసనంబునగాని, కూర్చుండి, పెదవులను బంధించి, క్రింది పండ్లు పైపండ్లకు దగులకుండ, జిహ్వేంద్రియమునణచి, ఇడా పింగళులయందు సంచరించెడు హంసను మరల్చి, ఉపజిహ్వా మార్గమున సుషుమ్నానాడి యందు ప్రవేశపెట్టి యూర్ధ్వముగ నడిపించుచు, దానితో ప్రణవాక్షరము ననుసంధానము చేయుట అంతరతారక మనబడును. సూర్యోదయమునకు పూర్వము గం.4.53.20 సెకండ్ల మొదలు గం.6.00 ల వరకు 1 గం. 6 ని॥ 40 సెకండ్ల కాలము హంస సుషుమ్నా మార్గమున సంచారము చేయుచు, వేయి పర్యాయములు సహస్రార కమలమునందున్న సద్గురుమూర్తి పాద పద్మములను అంటి తిరుగునట్లు చేయవలయును. ఇట్లు సద్గురు పాదపద్మములనంటి తిరుగునట్టి హంసతో ప్రణవాక్షరమును గూర్చవలయును. అట్లు ప్రణవాక్షరముతో గూడిన హంస ప్రతిదినము సద్గురుమూర్తి పాదపద్మములనంటి తిరుగుటయే సహస్రనామార్చనమనబడును. ఇట్లు సహస్ర నామార్చనము చేయు కాలమున సద్గురుమూర్తి సహస్రారకమల మధ్యమున నోంకార సింహాసనముపై కూర్చుండియుండునట్లు భావించుచు, నూర్ధ్వ దృక్కులవాడై సద్గురు పాదపద్మముల లక్షించుచుండవలయును.

హంస పంచాక్షర మంత్రమునగల **"ఓం"** అను బీజము సహస్రారకమల మధ్యమున ఉన్న సద్గురుమూర్తియొక్క సింహాసనమునకు వాచకమగును. అందలి **"హ్రీం"** అను

బీజము ఇచ్ఛాశక్తికి వాచకమగును. **"హం, సం"** అను రెండు బీజములు క్రియాశక్తికి వాచకములగును. ఇందు హ్రీంకార వాచ్యమగు ఇచ్ఛాశక్తి యెడమ నేత్రమునందును, శ్రీంకార వాచ్యమగు జ్ఞానశక్తి కుడి నేత్రమునందును నుండినట్లు భావించవలెను. ఇహపరలోకముల యందుగల భోగముల యందుగాని, భోగసాధనములయందుగాని జ్ఞానేచ్ఛలను కలుగనీయక రెండు నేత్రములయందలి చూపును అంతర్ముఖ మొనర్చి సహస్రారకమల మధ్యము నందోంకార పీఠము నధిష్ఠించియుండిన సద్గురుమూర్తి పాదపద్మములయందు నిలుపవలయును. అటుపిమ్మట **"హం, సం"** అను బీజములకు వాచ్యమైన క్రియాశక్తి రూపమగు హంసతో ప్రణవాక్షరమను పుష్పమును గూర్చి బ్రహ్మ ముహూర్తమున సద్గురుమూర్తి పాదపద్మములకు సహస్రనామార్చనము చేయవలయును. సుషుమ్నా మార్గమున సంచరించెడి ప్రతి హంసతోను ప్రణవాక్షర పుష్పమును గూర్చి ప్రతిదినము అర్పించుచున్నచో, సద్గురుమూర్తి యనుగ్రహము వలన ఒకానొక సమయము నందు, సుషుమ్నాంతరమున సంచరించు హంస సహస్రారకమల కర్ణికయందు నిశ్చలమై నిలిచియుండును. హంస నిలిచి యుండినచో మనోదృక్కులు గూడ నిలిచిపోవును. ఇట్లు పవన మనోదృక్కులు చలనరహితములై నిలిచియుండుటయే నిర్వికల్పక సమాధియనియు, అంతరాంతర తారకమనియు చెప్పబడును. ఇడా పింగళనాడుల యందు సంచరించెడు హంసతో **"సోఽహం"** అను మంత్రము ననుసంధానము చేయుట సహజ తారకమనబడును. సుషుమ్నానాడి యందు సంచరించెడు హంసతో ప్రణవాక్షరమును గూర్చుట అంతర తారకమనబడును. ఈ విధముగ సద్గురుమూర్తి వలన గురు మంత్రమును, అష్టాక్షరీ మంత్రముల క్రమమును, వాని యర్థమును, వాని వివరమును, వాని భాష్యమును, భాష్యార్థమును, హంస పంచాక్షరి మంత్రమును, దాని వివరమును సహజ అంతర, అంతరాంతర తారకముల విధానమును, సద్గురు సహస్ర నామార్చన పద్ధతియును చక్కగా నెరుంగవలయును.

ఓం తత్ సత్.

# శ్ర ద్ధా భ క్తి ధ్యా న యో గ ము లు

**శ్లో॥ శ్రద్ధాభక్తి ధ్యాన యోగాన్ ముముక్షో:**
**ముక్తేర్హేతూ స్వక్తి సాక్షాచ్ఛ్రు తేర్గీ: ।**
**యోవా ఏ తేష్వేవ తిష్ట త్యముష్య**
**మోక్షోஉ విద్యా కల్పితా ద్దేహ బంధాత్ ॥** **వి.చూ.శ్లో.48**

భావము:- ముముక్షువునకు సాక్షాత్తుగా ముక్తి హేతువులను శ్రద్ధ, భక్తి, ధ్యాన, యోగములనగా, కైవల్యోపనిషత్తునందు వేదవాక్కు చెప్పుచున్నది. ఎవ్వడైతే, ఈ నాల్గింటి యందు ఉండునో వానికి అవిద్యా కల్పిత సంసార - జన్మ మృత్యు బంధము నుండి మోక్షము సిద్ధించును. అశ్వలాయనుడు చతుర్ముఖ బ్రహ్మను, తనకు బ్రహ్మ విద్యను ఉపదేసింపుమని కోరగా **"తస్మై సహోవాచ పితామహ: శ్రద్ధా భక్తి ధ్యానయోగాదవైహి"** అని చెప్పెను. ఆ శ్రుతి వాక్యానుసారము ఈ శ్లోకములో శ్రద్ధ, భక్తి, ధ్యాన, యోగములు నాలుగు ముక్తికి సాక్షాత్ (ముఖ్య) అనగా అసాధారణ సాధనములని చెప్పబడినవి.

శ్రద్ధ:- శ్రద్ధ అనగా గురు వేదాంత వాక్యములు సత్యములని యధార్ధములు అని విశ్వాసము. లోకములో ప్రతి కార్యమునకు సాధారణ కారణములు, అసాధారణ కారణములుండును. ఉదా:- ఒకడొక గ్రామము నుండి మరియొక గ్రామమునకు సైకిల్‌బండిపై వెళ్ళెను. ఇక్కడ **"వెళ్ళుట"** అనుటకు పగలు, రోడ్డు, మంచిగాలి, వెలుతురు ఇవన్నియు సాధారణ కారణములు. ఇక సైకిలు దానిని త్రొక్కుచు వేగముగా వెళ్ళుట అనునవి అసాధారణ కారణములు. ఇది సాక్షాత్ కార్యమునకు పూర్వము సన్నిహితముగా నుండును. కాన **"ముఖ్యకారణ"** మని మనము చెప్పుకొనవచ్చును.

బ్రహ్మవిద్యకు **"శ్రద్ధ"** అసాధారణ కారణము. లేక ముఖ్యకారణము అని భావము. **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"** అని భగవద్గీత చెప్పుచున్నది. ఏది శాస్త్రము యొక్క గురువాక్యము యొక్క సత్యతను బుద్ధి యందు నిలువబెట్టుచున్నదో అది శ్రద్ధ అని సత్పురుషులచే చెప్పబడు చున్నది. బ్రహ్మము ఒక్కటి యనునదే సత్యము. అదియే త్రికాలముల అందు సత్యము. మిగిలిన దంతయు **"మిథ్య"** అని గురువు చేత, వేదాంతముల చేత బోధింపబడినదని చెప్పగా విశ్వసించును. ఇది ఈ విధముగనే యున్నది. అను దృఢ విశ్వాసమే శ్రద్ధయగును.

భక్తి:- భక్తియనగా తన స్వరూపమును సంధించుట. నిది ధ్యాసనము. అవిద్యాత్మక ద్వైతములు శ్రవణాదులచే నశింపగా, ఏ నిత్యానంద స్థితి మిగిలియుండునో అదియే నా స్వరూపమని అనుసంధానము చేయుటయే భక్తి.

ధ్యానము:- తన జ్ఞానమును ఒకదాని యందే సూక్ష్మీకరణము చేయుట ధ్యానము. బుద్ధిని శుద్ధ బ్రహ్మము నందు నిల్పుటను సమాధానము అందురు.

యోగము:-యోగమనగా చిత్తవృత్తిని నిరోధించుట ఇక్కడ చెప్పిన శ్రద్ధాదులలో శ్రద్ధ తక్కిన మూడింటికిని హేతువగును. భక్తి ధ్యానయోగముల మధ్య మొదటిది తరువాత దానికి హేతువగును. భక్తి ధ్యానమునకు హేతువు. ధ్యానము యోగమునకు హేతువు. పై విధముగా శ్రద్ధ, భక్తి, ధ్యానములచే చిత్తవృత్తులన్ని నిరోధించబడగా, అప్పుడు శ్రుతి వాక్యములను అనుసరించును. స్వస్వరూపమును అనుసంధించుట వలన నిది ధ్యాసనము సంభవమగుటచేత **"యోగము"** సాక్షాత్సాధనమగుచున్నది.

యోగమన (1) స్వరూపాను సంధానమనియు, (2) మనన నిది ధ్యాసన మనియు, (3) సంబంధ మనియు మూడర్థములు గలవు. కైవల్యోపనిషత్తులో శ్రద్ధా భక్తి ధ్యాన యోగ మనుట చేత ఇక్కడ యోగము ఆత్మ సాక్షాత్కారమునకు అసాధారణ కారణమని

చెప్పబడినది.  ముముక్షువునకు శ్రద్ధ, భక్తి, ధ్యాన, యోగములు ముక్తి హేతువులని ఉ పనిషత్తు తెలుపుచున్నది.  శ్రద్ధాభక్తి ధ్యాన యోగములు గల వానికి అవిద్యాకృత కల్పితములు, అజ్ఞాన మూలకములునగు దేహబంధ అనగా అహంకారాది బంధముల నుండి మోక్షము, అనగా వృత్తిని వర్తించును.  పై చెప్పిన నాలుగు సాధనములకు భిన్నముగా మఱియొక విధమగు నిష్ఠాత్వము నుండి గూడ నివారించుచున్నది.

ఓం తత్ సత్.

# భుక్తి - ముక్తి

భుక్తి అనగా బ్రతుకుటకు కావలసిన వానిని వివిధ రీతుల సంపాదించుకొని హాయిగా సంఘములో కీర్తి ప్రతిష్ఠలతో ఏ లోపము లేకుండ జీవించుట. వాక్కుల సౌలభ్యసరళి, వాక్కుల అనర్గళ ప్రవాహము, శాస్త్రముల వ్యాఖ్యానము, కుశలత్వము మొదలగునవి విద్వాంసుల వైదుష్యమై యున్నది. ఇందు ప్రవీణుడే యైనను, ఆత్మైక్య జ్ఞానము లేనిచో, వీణ, తబల, హార్మోనియమ్ మొదలైనవి వాయించి ప్రజలకు మనోరంజన కలిగించిన వంటిదేయగును.

**శ్లో॥ ఆత్మజ్ఞానం వినామూఢో వృథా బ్రహ్మని మోదతే।**
**ప్రతిబింబిత శాఖాగ్ర ఫలా స్వాదన మోదవత్ ॥**

భావము:- జలమున ప్రతిబింబించిన చెట్టు కొమ్మయందలి పండును తిన జూచిన వానికి ప్రమోదము చేకూరని విధమున, ఆత్మజ్ఞానము లేని మూఢులకు బ్రహ్మానంద ప్రాప్తి కలుగదు. తేలికయైన పదములతో కూర్చెడు వాక్కును వాగ్వైఖరీయందురు. ఇట్టిది నేటిగేయకవులలో, వార్తాపత్రిక సంచికాదులలో, సినిమా ప్రసంగములలో మిక్కిలిగా కాననగును. ప్రజా సామాన్యమునకు తాత్కాలిక మనోరంజనమే అచ్చటి ఆశయము. అడ్డులేని ప్రవాహముగా వచ్చెడి వాక్కును శబ్ద ఝరీ అని యందురు. ఇందులో కొంచెము చాతుర్యము - శ్లేష - వ్యంగ్యముకూడ నుండును. ఇట్టి ఝరీ, ఆసుకవులలో, భట్రాజులలో, బుఱ్ఱ కథలలో మిక్కిలిగా కాననుగును. వాక్కులలో చతురత, సమయస్ఫూర్తి, శ్లేష ఇత్యాదుల ప్రకటనయే ముఖ్యాశయము. శాస్త్రమును వ్యాఖ్యానించుటయందు నేర్పు, కుశలత్వవిజ్ఞానము శాస్త్ర వ్యాఖ్యాన కౌశలమందురు. శ్లోకములో పదముల విసంధిగా - విరామములతో చెప్పుట పదచ్ఛేదము. పదముల కుండు నానార్ధములను సందర్భానుసారముగా

చెప్పుట పదార్థోక్తి. సమాన పదములను తగిన సుబంతములతో వాక్యరూపములుగ చెప్పుట విగ్రహము అనబడును. వాక్యములకు ఆకాంక్షతో అర్థానుకూలముగా చెప్పు వాక్య యోజనో, ఉక్తార్థములకు రాతగిన ఆక్షేపనలను చెప్పుట, ఇట్టి లక్షణములతో నడచునది వ్యాఖ్యానము. శాస్త్రములను పంక్తిపై ఉపన్యసించు పండితుల శాస్త్రార్థ కథనమందు కుశలత్వము, ఇట్టి వైదుష్యము గూడ (పాండిత్యము గూడ) ప్రతిష్ఠా - కీర్తి-సంపాదనాదుల ద్వారా భుక్తి కొఱకే సమర్ధమగును. ముక్తికి కాదు. అయితే ముక్తికి ఏది సమర్థమన్నచో (కారణమేదియన్నచో) ఆత్మైక జ్ఞాన బోధ మాత్రమే. సాక్షాత్ కారణమని భావము. **"అథాతో బ్రహ్మజిజ్ఞాసా"** యను బ్రహ్మ సూత్రములలోని శబ్దమున కొకానొక సంస్కృత పండితుడు నూట యెనిమిది అర్థములను జెప్పినాడట. రామాయణ సీతాకళ్యాణములోని **"ఇయం సీతా మమసుతా"** అను పాదములోని **"ఇయం"** అనుదానికి యేబది యెనిమిది అర్థములు చెప్పినాడట ఒక పౌరాణికుడు. ఇది యెల్ల శాస్త్ర వ్యాఖ్యాన కౌశలము.

శాస్త్ర శ్రవణానంతరమున చక్కగా లోపలికి ప్రవేశించి యున్న ఆనందరూప పాండిత్య కౌశలమునకు, తాత్కాలిక నయనేంద్రియ, శ్రవణేంద్రియ సుఖమునిచ్చు వీణా కుశలత్వమునకు కొంచెము బేధమున్నది. కాని ఆత్మ తత్త్వ సాక్షాత్కారము ఆ పండితునకు లేనిచో అతని యొక్క వ్యాఖ్యాన జన్యమైన కుశలత్వము వైణిక కౌశల్యమునకు వచ్చెడి ప్రజారంజక ఫలమువలె, ముక్తి సాధనమునకు యోగ్యమైనది గాదు.

పరబ్రహ్మ తత్త్వము సుతరాం తెలియని మూర్ఖునకు, శాస్త్ర వాక్యాది పాండిత్యము ఫలమునే మాత్రము యీయజాలదు. జన్మాంతర బోధచే సహజముగా (శుక - వామదేవ-ప్రహ్లాదుల వలె) పరబ్రహ్మ తత్త్వము తెలిసియున్న వారికి, యీ జన్మలో శాస్త్రాధ్యయనము నిష్ప్రయోజనమే. అనగా అనవసరమే.

కాలత్రయముచే బాధింపబడని, స్వయముగా ప్రకాశ ఆనంద రూపమైనదగు మాత్రమున అది **"పర"** శ్రేష్ఠము.  అనృత జడదు:ఖ రూపమైన దేహము మొదలగు మాయాశక్తి, రూపకార్య కారణమైన జగత్తునకు పోల్చగా సత్, చిత్, ఆనంద రూపమగుటచే **"పర"** అను శబ్దము అర్థవంతము.  సర్వమునకు ఆధారముగనున్న నిర్గుణమైన బ్రహ్మమును సాక్షాత్కరించు కొనుటయే ముక్తి.  అట్లు గాక వాక్య విచారణ, ప్రస్థాన త్రయము నధ్యయనము చేయుట ఇది అంతయు శాస్త్ర విచారణ, మఱియు ఫలము గలుగునంత వరకు ఫల నూన్యత్వముగానే యుండునని భావము.

ఓం తత్ సత్.

# సాధన మార్గము - సిద్ధస్థితి

**శ్లో॥ విశుద్ధ సత్వస్య గుణా: ప్రసాద:**
**స్వాత్మానుభూతి: పరమా ప్రశాంతి: ।**
**తృప్తి: ప్రహర్ష: పరమాత్మ నిష్ఠా**
**యయా సదానంద రసం సమృచ్ఛతి ॥** **వివేక చూడామణి.శ్లో.119**

భావము:- రజస్సు తమస్సులచే మిశ్రితముగాని సత్వము కార్యరూపము ధరించునపుడు మనస్సు అనుభవించు నిర్మలత్వమే ప్రసాదము. అందువలననే ఇక అంతకంటె గొప్పది లేనట్టిదగు చక్కని శాంతి ప్రాప్తించును. సాధనాతీతమై స్వయముగా ఎల్లకాలమున స్ఫురించుచున్న ఆనందమే ప్రహర్షమనబడును. తన్ను ధన్యునిగా తలంచుకొని ఆనందించుట దేనిచేత సదానందరసమును బొందు చున్నాడో అదియే పరమాత్మ నిష్ఠ. పరమానంద ప్రాప్తి చేత, మనస్సు బయటకు వచ్చుటకు ఇచ్ఛగింపక లీనమై నిర్వికల్ప సమాధి ననుభవించును. ఇది సిద్ధస్థితి.

గుణత్రయమై **"మాయ" "అవిద్య"** ఇత్యాది శబ్దములచే, చెప్పబడి, తాను వ్యక్తముగాక కార్యముల చేతనే యెఱుగదగినదై స్థూల సూక్ష్మాది సర్వకార్యములకు హేతువగుచున్నది.

ఈ అవ్యక్తము మూడు గుణములచే చెప్పబడినదై ఆత్మకు శరీరమై యున్నది. దీని ప్రత్యేకావస్థ సుషుప్తి. కార్యములగు కామక్రోధములు రజస్సని, అజ్ఞానము, ఆలస్యములు తమస్సని, అమానిత్వాదులు సత్వమని తెలియదగినవి. సర్వేంద్రియ వృత్తులు, బుద్ధి వృత్తులు గల జాగ్రదవస్థయు, కేవల బుద్ధి వృత్తులున్న స్వప్నావస్థయు త్రోసివేయగా మిగిలియున్న ఇంద్రియ బుద్ధివృత్తులు లేని ప్రత్యేకమైయున్న సుషుప్తియే

కారణ శరీరమునకు అసాధారణమైన అవస్థ. స్థూలదేహము, ఇంద్రియములు పంచప్రాణములును, మనస్సు బుద్ధి, చిత్తము, అహంకారాదులనెడు సమస్త వికారములును, శబ్ద, స్పర్శాది విషయములును, సుఖదుఖాదులను, సమస్త ప్రపంచము అవ్యక్తము వఱకు గల ఇది అంతయు **"అనాత్మ"** మాయ (మూల ప్రకృతి), దాని కార్యమైన సర్వము మహత్తు మొదలు స్థూలదేహ పర్యంతము అనాత్మ తత్త్వము. అసత్తు. ఈ మాయ బ్రహ్మము యొక్క శక్తి. ఈ వ్యావహారిక మాయాశక్తిని నొప్పుకొనని పక్షమున, నిర్గుణమైన బ్రహమునకు జగత్తును సృష్టించు యోగ్యతయుండదు.

ఈ మాయ సత్వరజత్తమో గుణాత్మకము. లోభము, పని, కార్యము ఉపక్రమించుట, విశ్రాంతి లేకుండుట, ఇచ్ఛ ఇవి రజస్సు ప్రకోపించునపుడు పుట్టుచున్నవి. కాన సర్వపురుష ప్రవృత్తికి మూలమైన రజస్సు బంధహేతువు. చేసినది గ్రహింపలేనితనము, అలసిపోవుట, సోమరితనము, కార్యకరణము నందు మొద్దుతనము, మాంద్యము, నిద్రకర్తుత్వ శక్తియున్నను చేయకుండుట, ఒకదానిని మఱియొక దానినిగా గ్రహించుట తమోగుణ లక్షణములు. భ.గీ.అ.14.శ్లో.17 గుణములను గురించి ఇట్లు చెప్పుచున్నది.

**శ్లో॥ సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।**
**ప్రమాదమోహౌ తమసో భవతో ఽ జ్ఞానమేవ చ ॥ భ.గీ.అ.14.శ్లో.17**

సత్త్వము వలన జ్ఞానముద్భవించును. శరీరము యొక్క సర్వేంద్రియ ద్వారములందు ఆయా ఇంద్రియ జ్ఞానరూప ప్రకాశము (బుద్ధివృత్తి) పుట్టుచున్నదో అప్పుడు సత్త్వము వర్ధిల్లినదని తెలియవలెను.

**శ్లో॥ సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే ।**
**జ్ఞానం యదాతదా విద్యాద్ వివృద్ధం సత్త్వ మిత్యుత ॥ భ.గీ.అ.14.శ్లో.11**

రజస్త మస్సులు రెండు ఉన్నప్పటికి వానిచేత ఓటమి పొందనట్టి సత్త్వము యొక్క ధర్మములనే భ.గీ. 13వ అధ్యాయములో 8 నుండి 12 వరకు గల ఐదు శ్లోకములలో చెప్పుచున్నది.

ఇవి అమానిత్వాది తత్త్వజ్ఞానార్థ దర్శనాంతము గల ఇరువది ధర్మములు.

1. అమానిత్వము:- ఉన్నట్టి, లేనట్టి గుణములచేత తనను తాను మనస్సులో పొగడు కొనకుండుట.

2. అదంభిత్వము:- ఖ్యాతి కొఱకు, లాభము కొఱకు, లేక పూజింపబుడట కొఱకు తన ధర్మగుణములను ప్రకటించుకొనకుండుట.

3. అహింస:- మనోవాక్కాయములచే పరులను పీడించకుండుట.

4. క్షాంతి:- పరులచే అవమానింపబడినను వారిని గురించి చిత్త వికారము లేకుండుట.

5. ఆర్జవము:- మనస్సు, వాక్కు, శరీర చేష్టలు ఒకే రూపమందుండుట. అనగా తిన్నని నడవడిక.

6. ఆచార్యోపాసనము:- దండవత్ సాష్టాంగ నమస్కారము, మర్యాదగా నడుగుట, సేవాదులు, ఆచార్యునకు అనుకూలముగా వర్తించుట.

7. శౌచము:- బాహ్యమలములను మృత్తిక. జలముల చేతను, ఆంతరములములగు రాగ క్రోధాదులను స్నేహము, ఆర్జవాది వాసనల చేతను, విషయములన్నియు దోష భూ యిష్టములని మాటిమాటికి చూచుటచేతను కడుగుట. అనగా క్షాలనము చేయుట బహిరంత శ్శుచిత్వము.

8. స్థైయిర్యము:- ముక్తి సాధనకు, విఘ్నములు కలిగినను ఆ కార్యమున సాధన వదలక తిరిగి తిరిగి మరల ప్రయత్నము చేయుట.

9. ఆత్మవినిగ్రహము:- తన దేహ, ఇంద్రియ, ప్రాణ, అంత: కరణాదుల యొక్క మోక్షసాధన ప్రతికూల స్వభావమును నిగ్రహించుట. వానికి మోక్షానుకూల స్వభావముల నిలకడ చేయుట.

10. వైరాగ్యము:- ఇంద్రియార్థములైన శబ్ద స్పర్శాదుల దృష్ట అదృష్ట ఫలములందు రంజన బుద్ధి లేకుండుట.

11. అనహంకారము:- నేనే శ్రేష్ఠతముడనను గర్వము లేకుండుట. అనాత్మ రూపమగు దేహాది ఆధిక్యతలు ప్రదర్శించుకొనుట అహంకారము. నేను సాక్షి చైతన్యమును,

ప్రత్యగాత్మ స్వరూపుడనని, దేహ ధర్మములు నాకు దృశ్యములని, వాటి యందు తాదాత్మ్యము లేకుండుట, అహంకారము లేకుండుట. దానినే అనహంకారము అందురు.

12. జన్మాదులందు దోషాను దర్శనము:- మాతృ గర్భమున వసించుట, యోని ద్వారా బయటికి వచ్చుట, బుద్ధి, బలము, తేజస్సులను నాశము చేయు జరయు ముసలితనము), వ్యాధులు, జ్వరాదులు దు:ఖములని అడుగడుగున చింతించుట.

13. అసక్తి:- సతీపుత్రాదులందు ప్రీతి వదలుట.

14. అసభిష్వంగము:- పుత్రదారాదులకు సుఖములు, దు:ఖములు వచ్చినపుడు, నేనే సుఖిని, నేనే దు:ఖిని అనెడి తాదాత్మ్య భావము లేకుండుట.

15. సమచిత్తత్వము:- ఇష్టములు, అనిష్టములు ప్రాప్తించగా, నిత్యము సంతోష శోకములు లేకుండుట.

16. అనన్య భక్తి:- భిన్నతలేని యోగ సమాధిలో నేను భగవంతుడైన వాసుదేవుడను అను నిశ్చయముతో తన ఆత్మరూపమైన శ్రీకృష్ణుని యందు చలింపని దృఢ జ్ఞాన రూప, ప్రేమరూప చిత్తవృత్తి.

17. వివిక్తదేశ సేవిత్వము:- శుద్ధమైన చిత్తమునకు శాంత మొసంగు దేశమందు వసించుట.

18. జన సంసర్గారతి:- విషయలోలురగు జనులయొక్క సభాదులందు ప్రీతి లేకుండుట.

19. ఆధ్యాత్మ జ్ఞాననిత్యత్త్వము:- ఆత్మను ముఖ్యముచేసి, ప్రవృత్తమైన ఆత్మానాత్మ వివేక జ్ఞానము ఆధ్యాత్మిక జ్ఞానము, దీనియందే నిలుకడ. **“తత్త్వమసి”** మహావాక్యములోని **“త్వం”** పదార్థశోధనము నందే ముఖ్యాసక్తి గలిగి వాక్యార్థ బోధయందు నిలుచుట.

20. తత్త్వ జ్ఞానార్థ దర్శనము:- తత్త్వజ్ఞానార్థము - మోక్షము - దాని ఆలోచనము. మోక్షము నాలోచించిన గదా, మోక్ష సాధన జ్ఞానమునందు ప్రవృత్తి కలుగును. ఇట్లు అమానిత్వాది ఇరువది గుణములను నిత్యము సాధనయందు ఉంచుకొని

సిద్ధస్థితిని పొందవచ్చునని భగవద్గీత, ఉపనిషత్తులు, సంసిద్ధి పొందిన మహాపురుషులచే చెప్పబడుచున్నది. కాన బ్రహ్మ విద్యాజిజ్ఞాసగల మానవులు పై సాధనల ననుష్ఠించి సంసిద్ధిని పొందుదురు గాక.

8వ శ్లోకమునందు ప్రథమ సోపానమగు నైతికనిష్ఠను జెప్పి, 9, 10 శ్లోకములందు అంతకంటెను ఉదాత్తము స్వేచ్ఛాయుతము అగు అసక్తిని సమతను చెప్పెను. మిగిలిన 11, 12 శ్లోకాలలో అసంగ సమతల ఫలితము లోనికి దిరుగుటను చెప్పినారు. సృష్టియొక్క లోని విశాల తత్త్వములు మఱియు భగవంతుని వైపునకు మనస్సు తిరుగుటకు క్రమ మార్గము సూచించడమైనది.

ఓం తత్ సత్.

# ఏకో దేవ:

**శ్లో॥ ఏకోదేవ: సర్వభూతేషు గూఢ:**
**సర్వవ్యాపీ సర్వభూ తాంతరాత్మా।**
**కర్మాధ్యక్ష: సర్వభూతాధి వాస:**
**సాక్షీ చేతాకేవలో నిర్గుణశ్చ ॥** **శ్వే.ఉ.అ.6శ్లో.11**

భావము:- ఒక్కడే అయిన భగవంతుడు అన్ని జీవులలోనూ దాగి వున్నాడు. అతడు సర్వవ్యాపి, అన్ని ప్రాణులకు అంతర్యామి. అన్నికర్మలనూ ఆయన పర్యవేక్షిస్తాడు. అన్ని జీవులు ఆయనయందే నివసిస్తాయి. ఆయనయే సాక్షి. ప్రకృతి గుణ రహితుడైన శుద్ధ చైతన్యము.

ప్రమాతృ, ప్రమాణ, ప్రేమయములకు ప్రకాశకమైన బ్రహ్మ, మే ప్రమాణము చేతను తెలియబడకపోయినను, అజ్ఞాన కృతావరణ నివృత్తి కొఱకు శబ్ద ప్రమాణ మంగీకరించబడుచున్నది. బ్రహ్మము నందు కల్పింపబడిన లక్షణములు తటస్థ లక్షణమనియు, స్వరూప లక్షణమనియు రెండు విధములు, లక్షణముల యందతివ్యాప్తి దోషము గాని, అసంభవ దోషముగాని యున్నచో ఆ లక్షణము వలన లక్ష్యము తెలియబడదు. దోషరహితములగు లక్షణములచేతనే లక్ష్యము తెలియబడును.

పై ఉపనిషన్మంత్రమునకు భావము - జగత్తునకు బ్రహ్మయందు ఏర్పడిన ఈశ్వరానేకత్వమును "ఏక:" అని శ్రుతి నిరసించినది. **"ఏకేవహి రుద్రో నద్వితీయాయ తస్థు:"** అను మఱియొక శ్రుతినిబట్టియు ఇది స్పష్టమగుచున్నది. బ్రహ్మము, ఈశ్వరుడు, జీవుడు ముగ్గురు చైతన్య స్వరూపులే. ఈశ్వరత్వము, జీవత్వము ప్రకృతికి లోనైనదియూ, ఆభాసమాత్రమూ అని సూచితమైనది.

పిదప అనేకముగా కన్పించు ప్రకృతికి గూడ, ఏకత్వము కారణత్వము గలదను దానిని నిరసించుటకు **"దేవ:"** అను పదము ప్రయోగించబడినది. దేనిపైనను ఆధారపడక త్రికాలములందును అఖండ చిద్రూపముతో స్వయముగనే ప్రకాశించువాడు గావున దేవుడనబడును. ప్రకృతి జడముగావున దేవుడు కాజాలడు. ఇందుచే ఇది స్వత:కారణము కానేరదు.

ఏకత్వము, దేవత్వము సూర్యునకుండుట చేత దానికి వచ్చు ఈశ్వరత్వమును **"సర్వభూతేషు"** అని నిరసించినది. పరుడగు ఆత్మ సర్వభూతముల యందును చిదేకరసరూపముతో నున్నాడని అర్థము. సూర్యునకు ఏకత్వము, దేవత్వము ఉన్నను చిద్రూపమున భూతములయందు ఉండుట అనునది లేనందున ఈశ్వరత్వము లేకపోయినది. సర్వభూతేషు అను పదము చేత సూర్యునకు ఉన్న లక్షణముల కన్న విలక్షణుడని తెలియపరచుచున్నది.

సర్వభూతముల యందును సదా ఏక రూపమున చిత్ప్రకాశ స్వరూపముతో ఉన్నవాడు కాగా వానికి సర్వ వేద్యత్వము, అనగా దృశ్యభావము వచ్చినది. దీనిని నిరసించుటకు **"గూఢ:"** అను ప్రయోగము జరిగినది. సర్వభూతములయందున ప్రకాశరూపమున నున్నను, మేఘములచేత సూర్యుని వలెనే, అవిద్యచేతను, అవిద్యా కార్యములచేతను అనగా దృశ్యముల చేతను పరమాత్మ కప్పివేయబడి, అందరికిని వేద్యుడుగాక ఉన్నాడని తెలుపుటకు గూఢ: పదము వాడబడినది.

పరమాత్మ భూతములందు గూఢముగానున్నచో, బుద్ధి మున్నగువానికి వచ్చు పరిచ్ఛిన్నత్వము వచ్చును గాన, వానికన్న విలక్షణముగానున్నాడని తెలుపుటకు **"సర్వవ్యాపీ"** అను పదము ప్రయోగింపబడినది. బంగారు ఆభరణములను, లోపల వెలుపల సువర్ణమే వ్యాపించి యుండునట్లు జగత్తును లోపల వెలుపల అంతటను తన సత్తచేతనే వ్యాపించినది గాన, బ్రహ్మము సర్వవ్యాపి అనబడును. లోపల వెలుపల నిండి యున్నందున బ్రహ్మమునకు పరిచ్ఛిన్నత్వము లేదని భావము.

గూఢముగా సర్వమును వ్యాపించి యుండు స్థితి ఆకాశమునకు కూడ అన్వయించును, ఆ దోష నివారణార్థము **"సర్వభూతాంతరాత్మా"** అను పదప్రయోగము జరిగినది. సర్వభూతములు లోపల - బుద్ధిగుహ యందు, ఆత్మరూపముతో బ్రహ్మము ఉన్నదని భావము. ఆకాశమునకు సర్వవ్యాపకత్వమున్నను జడమగుటచేత సర్వభూతములకు ఆత్మయగునట్టి స్థితి లేనందువలన దానికి బ్రహ్మత్వము సిద్ధించదు.

బ్రహ్మము సర్వభూతములకు ఆత్మకాగా వచ్చు కర్తృత్వమును, కర్మఫల భోక్తృత్వమును, సంసారిత్వమును నిరసించుటకు **"కర్మాధ్యక్ష:"** అను పదప్రయోగము జరిగినది. ఉపాధి నధిష్ఠించి, దాని ధర్మముల ఈక్షతే - చూచువాడు గాన అధ్యక్ష: అనబడును. భూతములకును, వాని కర్మలకును, వాని ఫలభోగములకును ఆత్మ సాక్షి మాత్రమే యగును. నిష్క్రియము, నిరవయవము నగుటచేత, తానే కర్మను చేయదు. ఏ ఫలమును అనుభవింపదు, అని అర్థము.

బ్రహ్మము సర్వభూతాంతరాత్మ కాగా సర్వభూతములను ఆశ్రయించి యుండుటయు, వానికి అధీనమైయుండుటయు తటస్థించగా దానిని **"సర్వభూతాధి వాస:"** అని నిరసించినది. దీనియందే సమస్తము వసతి - ఉన్నది గాన వాస: అనబడును. అధికతమము (సర్వోత్కృష్టము)ను, వాసమునయి యున్నది గాన **"అధివాస:"** అనబడును. అద్దమునందు నగరమువలె, తనయందు కల్పితములైన భూతములకు పరమాత్మ అధివాస: - అధిష్ఠానమే యగును గాని తాను మాత్రము దాని యందుండడని యర్థము. ఈ యాత్మ కర్మలకు జ్ఞాతమాత్రమే కాదు. మఱేమన, భూతములకును, వాని అవస్థలకును ద్రష్టగానున్న సంగతిని "సాక్షి" అను శబ్దము ద్వారా తెలుపుచున్నది. బుద్ధికిని, దాని వికారములకును, అన్నిటికిని సాక్షియని అర్థము. సాక్షాత్ - ప్రత్యక్షముగా, యీక్షతే - చూచునది, గాన సాక్షియగును.

ఈక్షణ క్రియాకర్తృత్వమేర్పడగా **"చేతా:"** అని చెప్పుచున్నది. ఆత్మచేత యితయు, అవి క్రియము కావున అంతయును తాను నిర్వికారముగ నుండియే చూచుచున్నాడని యర్థము. నిర్వికారమనుటకు హేతువును శ్రుతి చెప్పుచున్నది. **"కేవల:"** అని, కేవల:

అనగా నిరవయవమని అర్థము. నిరవయవము గావుననే నిర్వికారమగును. తాను నిర్వికారముగ నుండియే సమస్తమును జూచుచున్నదని యర్థము.

**"శబ్ద గుణకమాకాశమ్"** అని నిరవయమగు ఆకాశమునకును ఎట్లు గుణము కలదో ఇట్లే, బ్రహ్మము నిరవయమయ్యును, సత్త్యము, చిత్త్యము మున్నగు గుణములు గలదే యనెడి ప్రసక్తిరాగా **"నిర్గుణః"** అని దానిని పరిహరించినది. నిష్కలమ్మని బ్రహ్మముయొక్క నిరవయవత్త్వమును శ్రుతి చెప్పుట చేత, బ్రహ్మము గుణయుక్తమనుట పొసగదు. కాన సత్త్యము, చిత్త్యము మున్నగునవి దాని స్వరూపమేగాని గుణములు మాత్రము కాదని యర్థము.

పరబ్రహ్మము ఎట్టి విశేషణములున్ను లేనిదని తెలిసికొనక, తానే అట్టి ఆనందైకరసమగు పరమాత్మనని వివేచించక, దానియందు మాంస ఆస్థి పిండమగు దేహమును, దాని ధర్మములగు కర్తృత్వ, భోక్తత్వాదులు ఆరోపించి జనన మరణరూప సంసారమున బడియున్నారు. వివేచించి ముక్తినొందెదము గాక.

ఓం తత్ సత్.

# క్రమ ముక్తి - సద్యో ముక్తి

**శ్లో॥ యద్ జ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యసి పాండవ ।**
**యేన భూతాన్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథో మయి ॥** **భ.గీ.అ.4.శ్లో.35**

భావము:- ఓ అర్జునా ఏ జ్ఞానము నెఱింగిన తిరగి ఇట్లు మోహమునకు వశుడవుగావో, ఏ జ్ఞానము చేత సర్వభూతములను, ఆత్మ యందు, తర్వాత నా యందును చూచెదవో, అట్టి సమగ్ర జ్ఞానమును ఆ తత్త్వదర్శులు నీకు ఉపదేశించెదరు.

ఆత్మన్యథోమయి:- ఆత్మ=ఆత్మయందు, అథో = తర్వాత, మయి = పరమేశ్వరునియందు సర్వభూతములను చూచెదవు. ఆత్మ ఏకము, అక్షరము, సర్వగతము, స్వయం సిద్ధమునగు మూల సత్త లేక మనోమయ సత్త మఱుగున నుండి అహంకారము నుండి విడివడి, మన చేతన లోనికి ప్రవేశించినపుడు, అది విస్తరించును. అపుడన్ని భూతములను ఈ ఏకసత్త లోపల భావములుగా మనము చూడగలము.

కాని ఈ ఆత్మ లేక అక్షర బ్రహ్మము గూడ తర్వాత మన మూల భూత అంత:శ్చేతనకు ఒక పరమ పురుషుడగు భగవంతుని యొక్క స్వీయ ప్రకటనముగా గన్పించును. ఆత్మయందు మన సత్త మాత్రమే గన్పించును గాని, ఈ పరమపురుషుని యందు మన సత్త, వ్యక్తిత్వము, జీవనము అన్నియు గన్పించును. క్షరాక్షరములు రెండును ఇతని అభివ్యక్తములే. అంతరాత్మ లేక క్షేత్రజ్ఞుడు పురుషోత్తమునితో ఏకాత్మకుడే ఐనను, అభివ్యక్తియందు క్షేత్రజ్ఞుడు పురుషోత్తముని యొక్క ఒక సనాతనాంశము. కనుక సంసిద్ధియందు సైతము అంతరాత్మ పురుషోత్తమునితో ఏకత ననుభవించుచునే, అతని యందు నివశించును. అనగా వ్యష్టిరూప జీవుడు (అంతరాత్మ) తన పరిచ్ఛిన్నత్వమును వీడి, అక్షర పురుషుని యందు (ఆత్మ) సిద్ధిపొంది, ఆ తరువాత “మయి” అనగా

పురుషోత్తమునియందు స్థితి గలిగిన **"అహమే వేదగం సర్వమ్"** - ఈ సమస్తము నేనే అని చూడగలడు.

**శ్లో॥ ఆదావన్తేచ యన్నాస్తివర్తమా నెపి తత్తథా ।**
**తథై: సదృశా: సన్తో వితథా ఇవలక్షితా: ॥ మా.కా.వై.6.మూ.**

భావము:- ఏది ఆద్యంతములందు లేదో, అయ్యది మధ్యకాలమున నున్నను, అవిద్య మానమే యగుచు పైకి మాత్రమున్న దానివలె కాన్పించుచు ఉన్నది. అనగా భ్రాంతి మాత్రములు. అవి వికారములు. వికారములు నిత్యములు కావు.

భ.గీ.అ.2.శ్లో.28 కూడ ఇట్లే చెప్పుచున్నది. అవ్యక్తావస్థనుండి చరాచర భూతములన్నియు, ఆవిర్భవించి, వ్యక్తావస్థయందు ఇంచుక తడవుండి, తిరిగి అవ్యక్తావస్థలోనికే పోవును. ఆ విషయమున శోకమెందుకు అని శ్రుతిస్మృతులు తెలుపుచున్నవి.

నామరూప గుణములు లేనందున వ్యక్తము గానిదగుటచే **"మాయ"** అవ్యక్త మనబడును. **"మనోవృత్తి మయాద్వైతం అద్వైతం పరమార్థత:"** ఈ ద్వైతము కేవలము భావనారూపమే. యథార్థమును శోధించిన ఇది అంతయు అద్వితీయ బ్రహ్మమే అని తోచును.

**శ్లో॥ ఏకమేవ సదానేక కారణం**
**కారణాంతర నిరాస్య కారణం ।**
**కార్యకారణ విలక్షణం స్వయం**
**బ్రహ్మ తత్వమసి భావమాత్మని ॥ వి.చూ.శ్లో. 260.**

భావము:- సర్వమునకు బ్రహ్మమే ఏకైక కారణమని చెప్పబడినప్పటికిని, కార్యకారణమైన విశ్వమెల్ల నిరూపిత మిథ్యయగుటచేత, కారణము కూడ మిథ్యకావలెను. కాన నిజముగా కారణత్వముండుటయే సంభవింపదని భావించవలెను.

స్వతస్సిద్ధమైన బ్రహ్మము నీవు. అనగా ఆ బ్రహ్మమును నేను అని బుద్ధి యందు ధ్యానించవలెనని యున్నది.

భగవద్గీత రెండవ అధ్యాయములో చెప్పిన ఆత్మానాత్మ వివేక జ్ఞానము ద్వారా, ఆ బ్రహ్మమే నేనని ధ్యానించవలెను. నాల్గవ అధ్యాయము ముప్పది ఐదవ శ్లోకమున, సర్వభూతములను ఆత్మ (అక్షరుని) యందు, తర్వాత పరమేశ్వరుని యందు చూడవలెనని యున్నది.

ఇది పరస్పరము వ్యతిరేకముగా కన్పించినను, శాస్త్రాచార్యోపదేశములతో శుద్ధమైన బుద్ధిగలవాడై వివేకదృష్టితో ఇప్పుడే ఇక్కడే బ్రహ్మతత్త్వమును తెలిసినవాడై, **"అహం బ్రహ్మాస్మి"** అని నిర్ధారితుడగును. దీనినే సద్యోముక్తి యందురు.

కార్యకారణ దృష్టితో సాధన చేయు సాధకునకు వ్యష్టిదృష్టి (పరిచ్ఛిన్న) నుండి సమష్టి (అక్షర)ని పొందునట్లు చేసి కార్యకారణములు అనగా క్షరాక్షరములు రెండు పురుషోత్తమునకభిన్నములని గ్రహించి కృతకృత్యుడగును. ఇది క్రమముక్తి. మొదటిది ఉత్తమాధికారికి, రెండవది మధ్యమాధికారికి యని గ్రహించినచో వ్యతిరేకత లేదని గ్రహించవచ్చును.

ఓం తత్ సత్.

# "శ్రీరామ రామ రామ" తారక మంత్రము

1990 మే & జూన్ శాంతి పత్రికలో ప్రకటించడమైనది.

పార్వతీదేవియును పరమేశ్వరుడును మొదలగునట్టి సకలయోగులును జీవాత్మయే పరమాత్మయను అబేధ జ్ఞానముతో బ్రహ్మమునందు ఆనందము నందుదురు. కాబట్టి **"రమంతే యోగిన: చిదానందే పరమాత్మని అస్మిన్ ఇతిరామ:"** వ్యుత్పత్తి ప్రకారము రాముడను నామము వచ్చెను. బ్రహ్మవేత్తలు శరీరమును, ఇంద్రియములను, ప్రాణములను, మనస్సును, బుద్ధిని తమ జ్ఞానముచేత బ్రహ్మముకాదని నిషేధించుచూ రాగా చైతన్యము మిగులును. శరీరేంద్రియాదులు అసత్యమని స్పష్టమగును. ఆ చైతన్యమే బ్రహ్మము ఆ బ్రహ్మమే రామ శబ్ద వాచ్యము. నిషేధావధీ రూప చైతన్యమగు నాకు **"నేనే బ్రహ్మము"** అనునట్టి జ్ఞానము కలదు. ఆ బ్రహ్మ జ్ఞానమునకు **"శ్రీ"** అను నామము గలదు. సదాయాబ్రహ్మజ్ఞానము గల చైతన్యమగుటం చేసి శ్రీరామనామము సిద్ధించెను.

నేను సదా చిత్తవృత్తికి సాక్షినై వెలుంగుచుండు కూటస్థుడను. ఆ యీ స్వరూపమును తెల్పునవియే సమస్తోపనిషత్తులు. ఆ యుపనిషత్తులచేత నెఱుంగదగిన పరబ్రహ్మము అనియే రెండవ రామశబ్దార్థ తాత్పర్యము.

కూటస్థ చైతన్యమగు నేనే పరబ్రహ్మ చైతన్యమని యెఱుంగుటకు క్షరాక్షర శబ్దముల చేత చెప్పబడునట్టి సకల భూతముల కంటెను, కూటస్థుని కంటెను విలక్షణమైన **'అసి'** పదార్థమే మూడవ రామశబ్దార్ధమని తాత్పర్యము.

అత్యంత ప్రేమతో **"శ్రీరామ రామ రామ"** అను ఈ తారక మంత్రము నర్థమెఱిగి ధ్యానించు వారల నేమరకయుండి బ్రహ్మ విద్యాస్వరూపిణియగు సీతాదేవి వారలకు యోగసిద్ధిని గలుగజేయును. మంత్రార్థము నెఱింగి శ్రీరాముని ధ్యానించు వారలకు

ఏవిఘ్నములు లేకుండునట్లు బ్రహ్మవిద్య వెన్నంటి వుండి అమనస్కయోగమును సిద్ధింపజేయును. జీవ బ్రహ్మైక్య మీ ప్రకారము సిద్ధించునని గమనించి కృతార్థులము కాగలము.

**శ్లో॥ శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యమ్ రామనామ వరాననే**

దీనిని పార్వతీదేవికి పరమేశ్వరుడుపదేశించెను.

ఓం తత్ సత్.

# భా గ వ త ము - ప ర మా ర్థ ము

**శ్లో॥ "శుచీనాం శ్రీమ తాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే" ॥ భ.గీ.అ.6.శ్లో.41**

**"అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్" ॥ భ.గీ.అ.6.శ్లో.42**

భావము:- యోగభ్రష్టుడు తిరిగి శుచిమంతులు, శ్రీమంతులు అగు వారి కుటుంబమున జన్మింతురు.

బహుశః ధీమంతులగు యోగుల కులమున జన్మింతురు.

గృహస్థులలోను కొందఱకు మాత్రము ఈశ్వరానుగ్రహమును బడసిన పరిశుద్ధాత్ములకు జ్ఞానము, జ్ఞాన యోగులగునట్టి స్థితియు కలదని అంగీకరింపవలెను. అట్లుగానిచో వశిష్టుడు, అగస్త్యుడు మున్నగువారు, జనకుడు అశ్వపతి మున్నగు ప్రాచీనులున్నూ, ఆధునికులైన వాచస్పతి, ఖండనకారుడు మున్నగువారు ఆత్మవేత్తలు కారు అనెడి ప్రసక్తి వచ్చును.

**"క్రమాత్తస్యాపి జాయతే"** క్రమముగా వారికిని లభించును. క్రమాత్ అనగా ఆశ్రమ క్రమమును బట్టి, అథవా జన్మ క్రమమును బట్టి లేక చిత్త పరిపాకమును బట్టి ఇతరాశ్రమస్థులకైనను జ్ఞానము కలుగుననియు యర్థము. భగవంతుని యందు మనస్సును లగ్నము చేసిన గృహస్థుడైనను శాంతిని బొందుచున్నాడు.

ఈ విషయమునే భాగవతము నందుకూడ చూడగలము. ప్రహ్లాదుడు, కుచేలుడు- ఇరువురు జ్ఞానయోగులే, నిర్గుణోపాసకులే. కేవల జ్ఞాన నిష్ఠాపరులే. ప్రహ్లాదుడు రాక్షసవంశములో బుట్టెను. కుచేలుడు బ్రాహ్మణ వంశములో జన్మించెను.

భ.గీ.అ.6.శ్లో.41. **"శుచీనాం శ్రీమతాం గేహే"** అన్నట్లు ప్రహ్లాదుడు ఆగర్భ శ్రీమంతుని ఇంట్లో జన్మించెను.

భ.గీ.అ.6.శ్లో.42. **"అథవా యోగినామేవ కులే భవతి"** అన్న రీతిగా కుచేలుడు మహాయోగి కులములో జన్మించెను. ప్రహ్లాదుడు బ్రహ్మచర్యంలోనే జ్ఞాని అయితే,

కుచేలుడు గృహస్థుడై ఉండి కూడా మహాజ్ఞాని. ఇది చాలా కష్టమైన పని. పూట గడవని నిష్ఠ దరిద్రుడు. ఇలాంటి కఠోర దారిద్ర్యమును అనుభవిస్తూ దానినేమాత్రము పట్టించుకొనకుండా నిరంతరము పరచింతనాయుక్తుడై బ్రతుకు సాగించుట గమనించవలసిన విషయము. జ్ఞానమున్నంత మాత్రము చాలదు. జ్ఞానానికి వైరాగ్యముకూడా తోడుగా నుండవలెను. జ్ఞానం అభ్యాసానికి దారి తీస్తే, వైరాగ్యం విషయ ప్రపంచానికి మనలను దూరం చేయగలదు. దానికెంత దూరమైతే దీనికంత చేరువలోనికి పయనింతుము. ఇట్లు పూర్తి స్థితి పొందుటయే జ్ఞానం. ఇదియే జ్ఞాన నిష్ఠగా మారి ముక్తి సుఖాన్ని ప్రసాదిస్తుంది. **"అభ్యాసేనతు కౌంతేయా - వైరాగ్యేణ చ గృహ్యతే"** అని భగవానుడు కూడ ప్రభోదించియున్నారు. **"జ్ఞాన వైరాగ్యాభ్యామ్ తన్ని రోధ:"** అని యోగశాస్త్రాలు కూడ ఘోషిస్తున్నాయి.

ఇందులో జ్ఞానమనే దానికి ఉదాహరణ ప్రహ్లాదుని చరిత్ర. వైరాగ్యమనే దానికి కుచేలుని చరిత్ర.

ప్రహ్లాద అనగా అఖండమైన నిర్వృత్తి. అది జ్ఞానానికి చిహ్నము. అట్లే కుచేల అంటే జీర్ణ వస్త్రధారి అని శబ్దార్ధము. దరిద్రమంటే ఏమి లేకపోవుట అనగా ప్రాపంచిక భోగములకు దూరం కావటం. ఇది వైరాగ్యమునకు చిహ్నము. కుచేలోపాఖ్యానము వైరాగ్యానికి ప్రతీకగా చెప్పిన కథ. అతనికి శ్రీదాముడను పేరు కూడ కలదు. శ్రీ అనగా లక్ష్మి, దామ మనగా పూలమాల. లక్ష్మిని మెడలో ధరించిన వాడనగా ధనవంతుడని గదా యర్థము అనగా భౌతికముగ దరిద్రుడు, ఆధ్యాత్మికముగ సర్వసంపన్నుడైన మహాత్ముడని అర్థము.

**"వాసు దేవస్సర్వమితి"** అని ద్వంద్వాత్మకమైన సృష్టినంతా పరమాత్మ రూపంగా దర్శించి, దాన్ని నిత్యజీవితంలో అనుభవానికి తెచ్చుకున్న బ్రహ్మవేత్తకు మాత్రమే ఇది సాధ్యము. బ్రహ్మవేత్తకు చేయవలసినది, చూడవలసినది ఏమి లేదు. వాస్తవమునకు, ఆ కేవల చైతన్యమే లీలా ప్రదర్శనమైన విభూతిరూప శ్రీకృష్ణమూర్తి. అది అవ్యక్తమైతే

ఇది వ్యక్తం. అది అచలమైతే, ఇది నిత్య ప్రచలితం. అది సర్వవ్యాపకమైతే ఇది ఏకదేశ వివర్తి. **"తస్మిన్ దృష్టే పరావరే"** అన్నట్లు యోగియైనవాడదీ ఇదీ రెండూ దర్శించి, ఇవి రెండూ తన స్వరూపమే గదా అని అనుసంధించు కోవాలి. ఇది బ్రహ్మవేత్తల జీవితంలో అతి నిగూఢంగా జరిగే ఒక ప్రౌఢమైన వ్యవహారం అలా సాగినపుడే, వారి బ్రహ్మానుభవానికి పరిపూర్ణత.

ప్రస్తానత్రయములోని భగవద్గీత చెప్పిన **"శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభి జాయతే" (6-41), "అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్" (6-42)** విషయమునే భాగవతములో ప్రహ్లాదోపాఖ్యానముగాను, కుచేలోపాఖ్యానముగాను, ఉదాహరణ రూపంగా నిర్ణయింపబడినది. భాగవత కథలలో సూక్ష్మముగా గర్భితమైన బ్రహ్మ జ్ఞానమును విజ్ఞులు గమనించి తరింతురు గాక.

ఓం తత్ సత్.

# సత్యం వద - ధర్మం చర

మానవులు తెలుసికొని ఆచరించవలసిన నాలుగు మార్గములను మన ప్రాచీనులు ఏర్పరచియున్నారు. అవే ధర్మార్థ కామ మోక్షములు. ఇందులో మధ్యనున్న అర్థ కామములు రెండూ మనకు జన్మ సిద్ధములే. వాని కొఱకు ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు. పశుపక్ష్యాదులకు మనకు సమానమే. వానిని పాటించినంత మాత్రాన, మనము మానవుల మనిపించుకోము.

ధర్మమనేది అర్థకామములను నియమించి మానవుని అనర్థము నుండి కాపాడుతుంది. ధర్మము ప్రవృత్తి ధర్మము, నివృత్తిధర్మము అని రెండు విధములు. ప్రవృత్తి ధర్మమనగా సత్కర్మాచరణ మాచరించి ఉత్తమ జన్మాదికమైన అభ్యుదయ ఫలాన్ని పొందుట. నివృత్తి ధర్మమనగా సర్వ ధర్మోపరమ లక్షణమైన ఈశ్వర జ్ఞానమువల్ల నిశ్శ్రేయ స్వరూపమైన మోక్షమను ఫలాన్ని ప్రసాదించుకొనుటకు సామర్థ్యము కలిగించుట. కాని జనన మరణాద్య నర్థముల నుండి రక్షించలేదు. ఐనను అభ్యుదయాన్ని ప్రసాదిస్తుంది. అందుచేత దానిని కూడ మించిన పరమ ధర్మమేదో దాన్ని ఆశ్రయించాలి మానవుడు అదే మోక్షమనే నాల్గవది. అది చరమమైన పురుషార్థము. దానినే భాగవత ధర్మమని అందురు. **"ధర్మం చర"** అను వేదాను శాసనమును ఆచరిస్తేనే అది ధర్మం. ఉచ్చారణ మాత్రంలో ఫలితమివ్వదు. దానికంటె పరమమైన **"సత్యం వద"** అనునది మాత్రము ఫలమునిచ్చునా? అసలే ఇవ్వదు. ఫలితమనగా సుఖశాంతులు. సర్వమునకు ఆధారమై ప్రకాశమై స్వప్రకాశకమై మన అందరి స్వరూపమైయున్నదే సత్య తత్త్వము. అదియే నేనని, సర్వమని భావన చేయుటయే సత్యం వద అను ధర్మమును పాటించుట. సృష్టిలోదంతా దాని విభూతియేననే వైరాగ్యభావన వలన సుఖశాంతులు చేకూరును.

మొదటిదైన **"ధర్మం చర"** ధర్మమునందు చరించుచు అర్థ కామములను తగురీతిలో తగినంతగా అనుభవించుచు ఉన్నచో, చివరి ధర్మమయిన **"సత్యం వద"**

అను సత్యవస్తు భావనయందు నిల్వగలము, అట్టి మనుగడ సాగించినవాడే భాగవతోత్తముడు. అలాంటి భాగవతోత్తముల కాలమే కృతయుగం. నిరంతరం సర్వాత్మభావ రూపమయిన సత్యాన్నే దర్శిస్తున్న మానవులు వారు కాన దానికి సత్యయుగమని పేరు. అది తప్ప వారికి జీవితంలో చేయవలసినది కూడ ఏమిలేదు. అంతా దానిలోనే కలిసి వస్తుంది వారికి. అందు చేతనే దానికి కృతమని పేరు వచ్చినది. కృతమనగా ఏది చేయవలెనో అది వారిచేత చేయబడినది. నిత్యము సత్య దర్శనం చేత సంపూర్ణ సుఖశాంతులు మానవుడు అనుభవించే కాలమే కృతయుగం.

పోతే సత్య తపోదానాదయ లనే నాలుగు ధర్మపాదాలలో సత్యమనే దానికి ముప్పు సంభవిస్తే అది త్రేతాయుగం. కృతయుగంలో సత్యము అప్రయత్నంగా దర్శనమిస్తే, ఈ త్రేతాయుగంలో, ఆ సత్యం ప్రయత్న సాధ్యమగును. ఆ ప్రయత్నమే తపస్సు. ఏకాగ్రమైన బుద్ధితో చేసే తీవ్రమైన ఆలోచనయే తపస్సు, తద్వారాగాని సత్యాన్ని దర్శించలేకపోయాడు మానవుడు. అలాంటి మానవుల కాలమే త్రేతాయుగం. త్రేతా అంటే మూడని శబ్దార్థము.

సత్య తపస్సులు కూడ కుంటుపడి, దయ దానాలనే రెండు పాదాలతోనే నడుస్తూపోతే అది ద్వాపరయుగం. ద్వా అంటే రెండు. పరం అంటే పారాయణం అందుచేత ద్వాపర యుగమనిపించుకున్నది. రెండనేసరికి ద్వంద్వాలవి. సత్యము, తపస్సు రెండూ లోపించడంతో, నిత్యానిత్యములను ద్వంద్వములో, ఏది సత్యమో నిత్యమో, ఏది భ్రాంతియో అనిత్యమో స్వయముగా దర్శించలేడు. ఆలోచన చేసి తెలుసుకోలేడు. కాన దానము దయా రెండే శరణ్యములు. ఇందులో దానమనేది ద్వాపర యుగానికి ప్రధానమయినది. దానం చేసి విద్యా వివేకాదులు సంపాదించుకోవలయును. కాన త్యాగ బుద్ధి ప్రధానం. ఇది ద్వాపరయుగ లక్షణం.

అంతకన్నా దిగజారిపోయింది కలియుగం. ఇందులో సత్య తపస్సు దానమను మూడు పాదాలు లోపించినవి. కనుక స్వతహా: స్ఫురించదు; ఆలోచించి తెలిసికోలేరు. ఒకరికి శుశ్రూషచేసి తెలుసుకోవాలనే బుద్ధిలేదు. దయపాదం కలియుగారంభములో

బాగానే వచ్చినది. రాను రాను ఆ భావం కూడ సన్నగిలిపోయినది. దయ అంటే వాడు మనలాంటివాడే గదా అని ఎవరికి, ఏ క్షుద్రజీవికి కూడ కష్టం కలిగింపకుండుట. ఇది యుగ ప్రారంభంలో బాగా వున్నా, రాను, రాను తగ్గిపోయి పరస్పర విద్వేషాలకు దారితీసింది. కలి అంటే కలహమని గదా అర్థము. కలహమే ఎక్కడ చూచినా తాండవిస్తూ యున్నది. ప్రస్తుత ప్రపంచములో కనుక సుఖం లేదు. శాంతి లేదు.

ఐనను జీవితమంతా ఒక జ్ఞానయజ్ఞంగా భావించి పరమార్థాన్ని గురించి అన్వేషణ సాగించు ఉత్తమ పురుషులు కొంతమంది లేకపోలేదు. కలియుగమందు మానవులు తరించే ఉపాయమేమిటా యని మథన పడుతుంటారు. ఈ కలియుగమందు అట్టి మానవులనే శౌనకులనవచ్చును. కారణజన్ముడైన మహానుభావుడెవరో వాడు సూతుడు. శ్రద్ధాభక్తులున్న ఏ కొద్దిమంది విజ్ఞానులో వారు శౌనకులని భావగవతము చెప్పుచున్నది. అలా నిర్దేశించడం వల్ల భాగవతము కలియుగానికి సంభవించిన పురాణమని అర్థమగుచున్నది.

రామాయణం త్రేతాయుగానికని, భారతం ద్వాపర యుగానికని, భాగవతం కలియుగానికని మనమూహింపవచ్చును.

కలియుగ మానవ జీవితం ప్రత్యక్షముగ చూచుచున్నాము. దాని వివరణ మరింత అనవసరము. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణము కొఱకు కలి పురుషుడు అవతరించునని పురాణములు సూచించుచున్నవి. ఈ యుగం ముగిసిపోయేది ప్రళయంతోనే. ఆ ప్రళయం ఒక మహా భయంకర సంగ్రామంతో కావచ్చును. కృతయుగం దేవదానవుల సంగ్రామంతో అంతరించింది. త్రేతాయుగం రామరావణ యుద్ధంతో సమాప్తమైంది. ద్వాపరయుగం కౌరవ పాండవుల పోరాటంతో ముగిసింది. ఒకటి దేవతలకు రాక్షసులకు మధ్య, రెండవది మానవులకు రాక్షసులకు మధ్య, మూడవది మానవులకూ మానవులకూ మధ్య.

ఈ దేవదానవులు మనలోనున్న త్రిగుణాలకు ప్రతీకలే. ఈ గుణ సంక్షోభమే ఒక సంగ్రామం. వాటి సామరస్యమే సువ్యవస్థ. అట్టి స్థితి రజో తమోగుణములు

క్షాళనమై సత్వము ప్రవృద్ధమైనపుడు జరుగును. పూర్వకాలం లాగా దీర్ఘకాల సంగ్రామంతో కూడా పని లేదు. ఇప్పుడు ఎక్కడి ప్రాణి అక్కడే హతమగునట్టి మహా మారణాయుధములతో సంసిద్ధమైయున్నారు పాలకులు. హతమైన ఆ క్షణం నుంచి ఇక కృతయుగమే. అనగా శాస్త్రాచార్యోపదేశముల వల్ల పరిశుద్ధాంత: కరణము కలిగి సత్యదర్శనంచేసి అనగా ధర్మమునందు చరించుచూ, సత్యము (భగవంతుని) గురించియే పల్కువారలు అమృత స్వరూపులు గదా! అట్టి వారితో కృతయుగం ప్రారంభమగునని పురాణ వచనము. దీనిని నమ్మి తదను వర్తనులమై తరింతుము గాక.

ఓం తత్ సత్.

# అ వ తా ర ము లు

అవతారమంటే దిగిరావటమని అక్షరార్థము. రావాలంటే అది సర్వవ్యాపకము. సర్వాత్మకమైన నిర్గుణ తత్త్వం కాబట్టి స్వయంగా వచ్చుట అసంభవము. త్రిగుణాత్మికమైన తన మాయాశక్తిని వశీకరించుకొని దానిబలంతో రాగలదు. "సంభవామ్యాత్మ మాయయా'' అని భగవద్గీతా వచనము గదా!

జగత్తనేది ఆయన సృష్టించిందే. ఆయన వివర్తమే, కాని చరాచర భూతప్రపంచము, ఆయన ప్రకాశించే మరొక రూపమే. ధర్మాన్ని రక్షిస్తేగాని జగజ్జీవ స్థితులు రక్షించబడవు. ఒకానొక సూత్రం మీద ఆధారపడియున్నదీ జగత్తంతా. దీనికి ఒడిదుడుకులు గలిగినపుడే ధర్మ విప్లవమందురు. ఉపద్రవము కలుగకుండా ఎప్పటికప్పుడు ధర్మ సంస్థాపన చేయడమే అవతారానికొక ప్రయోజనము.

సృష్టికర్త భగవంతుడైనపుడు వైషమ్యము లేని సుఖశాంతులతో గూడిన ప్రపంచమును సృష్టించ వచ్చును గదా! అప్పుడు అవతరించవలసిన కారణము ఉండదు గదా! యని ప్రశ్న ఉదయించుట సహజము.

మనబోటి సామాన్య మానవుడు అజ్ఞానంతో వేస్తున్నాడు యీ ప్రశ్న. ప్రశ్న ఎప్పుడు అజ్ఞానంతోనే గదా వేసేది?

జ్ఞానముంటే - మాం.ఉ. 2 **"సర్వగ్ంం హ్యేత ద్బ్రయమాత్మా బ్రహ్మ"** అనగా ఇది అంతయు పరబ్రహ్మము; యీ జీవాత్మయే పరబ్రహ్మమనియు, ఛా.ఉ. 3-14-1 **"సర్వం ఖలు ఇదంబ్రహ్మ"** అనగా ఇది బ్రహ్మ, అది బ్రహ్మ, సర్వము బ్రహ్మ అని చెప్పిన దానిని గ్రహించి, అంతయు భగవత్స్వరూపమని గ్రహించి పూర్ణస్థితిలో నుండగలడు. మనతో కలుపుకొని యీ దృశ్యమంతా ఒకే ఒక తత్త్వమని తెలిసికోగలిగినపుడు, దేవతలేమిటి, దానవులేమిటి ఒకరి నొకరు బాధించుకొనటమేమిటి - భగవంతుడు

అవతరించుట ఏమిటి అంతా అబద్ధమే. అప్పుడు ప్రశ్న లేదు సమాధానము లేదు. అది మృష అయితే, ఇది ఒక మిష అనే అనుకోవాలి. తన చైత్య రూపమైన దృక్కును నిరంతరము ఆశ్రయించి ఉన్న ఏ మాయాశక్తి ఉన్నదో, తద్వారా ఆవిర్భవించిందీ సృష్టి అంతా. స్వరూప జ్ఞానం లేనపుడే ద్వైతం సత్యంగా తోచును, అప్పుడు యీ సృష్టి అంతయు ఒక దీర్ఘ స్వప్నములా ఉన్నదని తాత్కాలికంగా ఒప్పుకొని చేసిన వర్ణనలే - యీ అవతారాది వర్ణనలన్నీ. యీ దృష్టితో అవతారాలు - తన్మూలంగా పరమాత్మ చేసే ధర్మసంస్థాపనా సమర్ధనీయమే అవుతుంది. మానవుల గుణకర్మల ననుసరించి కొందఱికి కర్మోపాసనాది ప్రవృత్తి ధర్మమును, కొందఱికి జ్ఞాన వైరాగ్య రూపమైన నివృత్తి ధర్మమును ఉపదేశించి, వాని అభ్యుదయ నిశ్శ్రేయసు ఫలములను గూడా అందివ్వాలి. అదే అసలు పరమాత్మ చేయవలసిన ధర్మ సంస్థాపన. దానితో జీవధర్మం కూడ సమగ్రంగా స్థాపించినట్లగును ఇదే అవతార ప్రయోజనము.

**శ్లో॥ యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।**
**తత్తదేవాగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్॥** **భ.గీ.అ.10.శ్లో.41**

అని భగవానుడే చెప్పియున్నాడు. అంతా భగవద్విభూతియే అందులో బాగా అభివ్యక్తమైనవే అవతారములు. అవి లీలావతారాలు వ్యూహావతారాలు, అర్చావతారాలు, విభవాతారాలు. మత్స్య కూర్మ వరాహ నరశింహ వామన పరశురామ బలరామ కల్క్యవతారాలనేవి లీలావతారాల క్రిందకు వచ్చును. రామ, కృష్ణ బుద్ధావతారాలు విభవావతారముల క్రిందకి వచ్చును. విభవమన్న విభూతి అన్నా ఐశ్వర్యమన్నా ఈశ్వర ప్రభావమని అర్థము.

**శ్లో॥ న తస్య కార్యం కరణంచ విద్యతే**
**న తత్స మశ్చాభ్యధి కశ్చ దృశ్యతే।**
**పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే**
**స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ॥** **శ్వే.ఉ.అ.6.శ్లో.8**

భావము:- తనకై సాధించాల్సిందేమీ అతనికి లేదు. సాధనమైన ఏ అవయవమూ లేదు. అతనితో సమానుడుగానీ అధికుడు గాని ఎవరు లేరు. అతని గొప్ప శక్తియే వివిధమైనదిగా, జ్ఞానమూ బలమూ పనులూ అన్నీ అతనికి స్వాభావికములుగా వేదాలలో వర్ణించబడియున్నది. ఆ స్వభావసిద్ధమైన శక్తికే విభవమని పేరు.

మనుష్య రూపంలో మనుష్యుల మధ్యకు వచ్చి మనుష్యులతో సంబంధము పెట్టుకొని బ్రతికినంత కాలము మనుష్యోద్ధరణ కొఱకే పాటుబడిన అవతారాలే రామ, కృష్ణ, బుద్ధావతారాలు. రాముడు మాయా మానుషుడైతే, కృష్ణుడు లీలా మానుషుడు. మానవత్వాన్నే ఎక్కువగా ప్రదర్శించుచు, భగవత్తత్త్వము మరుగు పడినది రామావతారంలో, మానవ రూపంలో ఉంటూ భగవత్తత్త్వాన్ని చాటుతూ వచ్చింది కృష్ణావతారంలో **"ఆత్మవత్ సర్వభూతానియ: పశ్యతి సపశ్యతి"** అను ధర్మసూత్రమును వేదవిలక్షణంగా బోధించింది బుద్ధావతారంలో. రామకృష్ణావతారాలలో కూడ వేషభాషలలో బేధమున్నది రాముడొకరికి ఉపదేశం చేసినట్లు లేదు. అదీ ధర్మోపదేశమే గాని మోక్షోపదేశం కాదు. రాముడొకే ఒక రూపములో దర్శనమిస్తే, కృష్ణుడొక్కక్కరి కొక్కొక్క రూపంలో ఏక కాలంలో దర్శనము యిచ్చాడు. రామునికి విశ్వరూప ప్రసక్తి లేదు. కృష్ణుడు అర్జునునకు విశ్వరూపం చూపించెను. రాముడు ఏకపత్నీ వియోగమే సహించలేక విషాదమును అనుభవిస్తే, కృష్ణుడు బహుపత్నీ వియోగాన్ని కూడ వినోదంగానే తిలకిస్తాడు. రాముడు తన వైభవాన్ని కప్పిపుచ్చుకొని తనదికాని మానవత్వాన్ని చూపుతూ వచ్చాడు. ఇది మానవోద్ధరణ ధర్మోపదేశంతో జరిగినది. కృష్ణుడు ధర్మోపదేశం కోసం కాదు అవతరించింది. ప్రజలకు పరమ పురుషార్థమైన మోక్షఫలాన్ని అందించడానికే వచ్చి యున్నాడు. కనుకనే రామాయణము ఇతిహాసమైతే, భాగవతము పురాణమైనది. కృష్ణ చరితమనే, భాగవతానికి నామధేయము. కృష్ణతత్త్వమే ఈ పురాణ పారిజాతానికి మూలము.

వేదసారాంశము సంపూర్ణముగా గ్రహింపక కర్మకాండాది కార్యముల వల్లనే ముక్తి కలుగునని లోకము హింసాది కార్యక్రమముతోకూడిన యజ్ఞయాగాది క్రియలలోమగ్నమై యున్నపుడు, మానవుడుగానే జన్మించి ఇహ భోగములను విసర్జించి పూర్ణవైరాగ్యమును అవలంభించి, మానవులకు ధర్మము, సత్యము, అహింస మున్నగు ధర్మములను ఆచరించుట వల్లనే నిర్వాణము పొందగలమని బోధ చేసి, బుద్ధావతారమనిపించుకొన్న మనిషి బుద్ధ భగవానుడు.

**శ్లో॥ అవ్యక్తనా మ్నా పరమేశ శక్తి:**
**అనాద్య విద్యా త్రిగుణాత్మి కాపరా ।**
**కార్యానుమే యా సుధియాచ మాయా**
**యయా జగదిదమఖిలం ప్రసూయతే ॥**

ఇది సృష్టివాదము. అనగా సృష్టిని సత్యమనువారికి బోధించు క్రమము. కాని అద్వైతులకు సృష్టి సత్యము కాదు. మన దృష్టి వల్లనే దృశ్య ప్రపంచపు ఉనికి యున్నదని దృష్టిని ప్రముఖముగా చెప్పువాదము. దానినే దృష్టి సృష్టి వాదమందురు.

అవతారాలన్ని భగవదంశమైతే, కృష్ణావతారం కృష్ణనామంతో అనగా భగవన్నామము తోనే చెప్పబడినది. భగవచ్ఛబ్దం కృష్ణుడికి మాత్రమే వర్తించును. భగవద్గీత, భాగవతం రెండు చోట్ల కృష్ణుడే భగవానుడు. జ్ఞానైశ్వర్య బల వీర్యశక్తి తేజస్సులనే షడ్గుణాలకు భగవమని పేరు. **“భగో స్యాస్తీతి భగవాన్”** అవి కలవాడే భగవానుడు. పరమేశ్వరుని శక్తి జ్ఞానాత్మికము కాబట్టి తేజోరూపిణి. జీవులశక్తి తమోరూపిణి. వరణీయమెప్పటికైన తేజోరూపిణి అయిన పరమాత్మ శక్తియే.

అందుకోసం నిరంతరం దాన్ని భక్తి శ్రద్ధలతో ధ్యానించటం తప్ప మరోమార్గం లేదు. అట్లు చేయుటవల్ల మన బుద్ధులనీతమస్సు నుంచి తప్పించి, ఆ ఏకరూప తేజస్సు వైపుకే తీసుకొని పోవును సందేహము లేదు.

**శ్లో॥ సైంధవస్య ఘనో యద్వజ్జల యోగాజ్జలం భవేత్ ।**
**ఆత్మ యోగా త్తథా బుద్ధి రాత్మవద్ బ్రహ్మవేదిన: ॥** **అ.అ.శ్లో.53**

భావము:- సైంధవ లవణ ఖండము జలసంపర్కమున ద్రవీభావము నందు నట్లు, బ్రహ్మజ్ఞాని బుద్ధికూడ ఆత్మ సంయోగమున ఆత్మాకారము నందును.

ఈ అవతారములు, రామాయణ భారత భాగవతాది సద్గ్రంథముల ప్రయోజన మిదియేనని గ్రహించుటుచితము.

ఓం తత్ సత్.

# హృదయ గ్రంథి భేదనము

**శ్లో॥ భిద్యతే హృదయగ్రంథి: చిద్యంతే సర్వసంశయా:।**
**క్షేయంతేఽ చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥** **ము.ఉ.అ.2.శ్లో.2-8.**

భావము:- హెచ్చు తగ్గులలో కూడా ఆత్మను సాక్షాత్కరించుకోగా అతని అజ్ఞానపు ముడి విడిపోతుంది. అన్ని సంశయాలూ సమసిపోతాయి, అన్ని కర్మలు క్షయించిపోతాయి.

అన్నానికి రూపాంతరమైన శరీరంలో హృదయము వున్నది. ఆ హృదయంలో ఉన్నది ఆత్మ. **"సదా జనానాం హృదయే సన్నివిష్ట:"** అని శ్వేతాశ్వతరోపనిషత్తు (4-17) చెప్పుచున్నది, చాందోగ్యోపనిషత్తు (111-2-4) లో ఈ ప్రాణాలన్ని హృదయంలోనే నెలకొని ఉన్నవి అంటుంది. **"బృహదారణ్యకం"** (111-9-11)లో ఎవని దృష్టికి సాధనం హృదయమో అని ఉన్నది. హృదయానికి **"హృది అయం ఇతి తస్మాత్ హృదయమ్"** ఉత్పత్త్యర్థము ఇక్కడ హృదయం ఆత్మకు స్థానం. అంగుష్ఠ మాత్రమైన రూపాన్నిధరించి, ఈ అనంత సత్తజీవుల హృదయాలలో నివసిస్తుంది అంటుంది. శ్వే.ఉ.111-13. ఇది అంతా చూస్తే హృదయమనే పదానికి ఎంత విస్తారంగా అర్థం చెప్పబడిందో మనకు తెలుస్తుంది. సంకల్పాది మన: క్రియలను నియమిస్తూ హృదయంలో స్థితమైయుండే బుద్ధి ద్వారా మననరూపమైన సమ్యగర్దర్శనం వలన ఎవరికి ఈ ఆత్మ ప్రకాశితమవుతుందో వారు అమరులవుతారు.

అనగా అవబోధ ప్రకాశవంతమై స్వచ్ఛమైనపుడు బుద్ధి, అర్థం చేసుకునే శక్తి లేదా సుశిక్షితమైన మనస్సు ఏకకాలంలో ఇదే ఆత్మజ్యోతిగా ఇదే ఆత్మను తెలిపేకరణంగా పనిచేస్తుంది.

**శ్లో॥ సైంధవస్య ఘనో యద్వజల యోగాజ్జలం భవేత్.**
**ఆత్మయోగా త్తథా బుద్ధి రాత్మవత్ బ్రహ్మవేదిన:** **అ.అ.53**

భావము:- సైంధవ లవణ ఖండము జల సంపర్కమున ద్రవీభావము నందు అట్లు, బ్రహ్మజ్ఞుని బుద్ధి కూడ ఆత్మ సంయోగమున ఆత్మాకారము నందును.

బాహ్యముగా వెతికితే బ్రహ్మం జగత్కారణ మనుకోవాలి. అప్పుడు అది మహత్తు, బృహత్తు, దుష్ప్రాపం అని ఇలా భావిస్తాం. అయితే ప్రాణానికి ప్రాణమై ఆ బ్రహ్మం సకల ప్రాణులకు అతి సన్నిహితంగా కూడా ఉన్నది. నిరర్థకమైన బాహ్యాన్వేషణను వదలి వేసి అంతర్దృష్టితో దీనిని తెలిసికొన్నవాడే ఋషి.

పరావరే అనగా హెచ్చు తగ్గులతోనున్న కార్యంలోను కారణంలోను లేదా లోక వ్యవహారంలో ఉత్కృష్టము, నికృష్టము అను బేధము. గ్రంథి అనగా ముడి. తన స్వరూపము తెలియని అజ్ఞానవశాత్తు బుద్ధికి పట్టి ఉండే కామనలు, సంస్కారాలు. ఈలంపటమే గ్రంథి. శరీర మనస్సులను ఆత్మకు కట్టిపెట్టుట చేతనేమో అజ్ఞానానికి గ్రంథి అని బిరుదు వచ్చింది. కామనలు, సంస్కారాలు అజ్ఞానానికి ఆధారము. అవి ఆత్మానాత్మ వివేకం చేత అజ్ఞానం కూడ విరిసిపోయి ఆత్మముక్తి పొందుతుంది. పిమ్మట ప్రమాతృ ప్రమాణ ప్రమేయ గత సంశయములన్ని సమసిపోతాయి. వీనికి కారణం అజ్ఞానం. అజ్ఞానం తొలగింది గాన సాక్షి స్వరూపంలో నుండును. అంతకు పూర్వం శరీర మనస్సులే, నేనని తాదత్మ్యము పొంది, అజ్ఞాన దశలో నేను నాది అను మమకారంతో చేసిన కర్మ ఫలాలు, అనగా ప్రారబ్ధ కర్మ, సంచిత కర్మ, ఆగామి కర్మలు జీవన్ముక్త స్థితిలో నశించును. దేహదృష్టితో చూచువారలకు సంచితాగాములు నశించునని, ప్రారబ్ధము శరీర ముండునంత వరకు యుండునని అందురు.

**శ్లో॥ సంచితాగామి కర్మాణి దహ్యన్తే జ్ఞానవహ్నినా ।**
**ప్రారబ్ధాను భవాన్మోక్ష: ॥** **వే.డిం.26**

అని వేదాంత డిండిమములో కూడ చెప్పబడియున్నది.

ఇట్లు హృదయంలో ఒదిగియున్న సర్వశ్రేష్ఠము అమరమూ అయిన బ్రహ్మం ఆ తత్త్వమే అని తెలిసికొనినవాడు, అవిద్యాగ్రంథిని తెగవేసి ఆ తత్త్వమే నేనని జ్ఞాననేత్రంతో దర్శించినవాడై ముక్తుడవుతాడు.

**శ్లో॥ యదా సర్వే ప్రభిద్యన్తే హృదయ స్యేహ గ్రన్థయ: ।**
**అథ మర్త్యో ఽ మృతో భవత్యేతావదను శాసనమ్ ॥ క.ఉ.**

భావము:- బుద్ధి గతములగు నేను నాది, నా ధనము, నేను సుఖిని, దు:ఖిని అనునట్టి అవిద్యా ప్రత్యయములు అనగా హృదయ గ్రంథులు, నేను అసంగుడను నిర్వికారుడను, అసంసారిని, సాక్షాత్ బ్రహ్మ స్వరూపుడను అనునట్టి బ్రహ్మాత్మ ప్రత్యయముచే తొలగిపోవునో, అపుడు మరణశీలుడగు మనుజుడు అమృత స్వరూపుడు అగుచున్నాడు. ఇది సంపూర్ణ వేదాంత శాస్త్రము యొక్క ఆజ్ఞ. ఉపదేశమని గ్రహింపుము.

ఈ వ్యాసములో వివరించిన విషయములను స్వానుభవముతో విచారించి, తాను బ్రహ్మమునేనని దృఢ భావముతో ఇప్పుడు ఇక్కడే ముక్త స్థితిని పొందుదురు గాక.

**శ్లో॥ దేహాత్మ ధీవద్బ్రహ్మాత్మ ధీధార్ఢ్యే కృత కృత్యతా ।**
**యదా తదాయం మ్రియతాం ముక్తో ఽ సౌనాత్రో సంశయ: ॥**

భావము:- దేహాత్మ బుద్ధి వలె బ్రహ్మాత్మ బుద్ధి దృఢము అయినపుడు కృతకృత్యుడగును. అప్పుడతడు. మృతి నందినను ముక్తుడే యగును. సందేహము లేదు. అని **"లఘు వాక్య వృత్తి"** యందు గూడ గలదు.

**శ్లో॥ అహమేవ పరబ్రహ్మ వాసుదేవాఖ్యమ వ్యయమ్ ।**
**ఇతి స్యాన్నిశ్చితో ముక్తో బద్ధ ఏ వాన్యథా భవేత్ ॥**

అని బ్రహ్మాను సంధానములో చెప్పబడి ఉన్నది. మాచే రచించబడిన "శంకరాద్వైత వ్యాసమాల'' యందు బ్రహ్మాను సంధానము పూర్తిగా చూడగలరు.

ఓం తత్ సత్.

# అవస్థా ద్వయ త్రయ వాదము

**శ్లో॥ జాగ్రత్స్వప్న సుషుప్త్యాది ప్రపంఞ్చం యత్ప్రకాశతే।**
**తద్బ్రహ్మ-హమితి జ్ఞాత్వా సర్వబన్ధై: ప్రముచ్చతే॥** **కై. ఉ. 17**

తా॥ జాగ్రత్స్వప్న సుషుప్త్యాదులందు ఏ ప్రపంచము గోచరించుచున్నదో అది బ్రహ్మ స్వరూపమే. ఆ బ్రహ్మమే నేనని యెఱింగినచో సమస్త బంధముల నుండి విడివడుచున్నాడు.

**మూ॥ స్వప్నాన్తం జాగరితాన్తం చోభౌయేనా నుపశ్యతి।**
**మహాన్తం విభుమాత్మానం మత్వాధీరోన శోచతి॥** **క.ఉ.2-1-4**

తా॥ ఓ నచికేతుడా! లోకము జాగ్రత్స్వప్న ప్రపంచమును ఏ యాత్మ స్వరూపముచే చూచుచున్నదో అట్టి పూర్ణాత్మను జ్ఞాని తెలిసికొని దు:ఖరహితుడగుచున్నాడు.

జ్ఞాతవ్యాంశమేమనగా:- బ్రహ్మతత్వమును తెలిసికొనవలెననిన ప్రస్థాన త్రయం అనగా ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు, భగవద్గీతను అనుసరించి సద్గురువులచే సంశయ, విపర్యయములు తొలగించుకొని బోధనందుకున్నపుడు మాత్రమే మనకు ఆత్మశాంతి లభించును.

అట్టి ఉపనిషత్తులలో ఒకటైన కైవల్యోపనిషత్తు జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడు అవస్థలందు ఏ ప్రపంచము గోచరించుచున్నదో అది బ్రహ్మ స్వరూపమే అని ఆ బ్రహ్మమే నేను అని యెఱుంగుము అనుచున్నది. అనగా ఈ ప్రపంచమున్నది, దీనిలో నేనున్నాను. అవస్థాత్రయమును నేను ప్రతిదినము అనుభవించుచున్నాను. అని తలంచినపుడు అవస్థలు తోచీ తోచకపోవుట గమనించుచున్నాము. ఈ విచారణా దృష్టి ప్రపంచ దృష్టి నుండి చేసినట్లు అగుపడుచున్నది.

కఠోపనిషత్తు:- దీనియందు బ్రహ్మ దృష్టితో అవస్థలను చూచుచున్నట్లు అగుపడుచున్నది. మొదలు లేక చివర లేక మధ్యమున ఉన్నట్లగుపడినవి పరమార్థతయా లేని వేయని శ్రుతిస్మృతులు చెప్పుచున్నవి. దాని ననుసరించి, ఏకంఏవ అద్వితీయం బ్రహ్మ అను శ్రుతి ననుసరించి మనము నిద్రావస్థ అని చెప్పుకొను స్థితి స్వరూప స్థితి అనియే గ్రహించవలెను. ఆ చైతన్య స్వరూపమునందు సూక్ష్మరూప స్వప్న ప్రపంచము, స్థూలరూప జాగ్రత్ ప్రపంచము గోచరించి అణగుచున్నదని, బ్రహ్మనైన నాయందు తోచు సూక్ష్మస్థూల రూపములు నా అభాసలు అనగా అనిత్యములని గుర్తించవలెను. నేను చైతన్య సత్య నిత్య స్వరూపుడనను దృఢ భావనగలిగి పరిపూర్ణాత్మను జ్ఞాని తెలిసికొని దు:ఖ రహితుడగుచున్నాడు. ఈ విషయమే సూక్షముగా బృహ దారణ్యాకోపనిషత్తు నందు కూడ చెప్పబడినది.

మాండూక్యం అవస్థాత్రయమును పేర్కొన్నది. సుషుప్తి యందు అజ్ఞానము నంగీకరించి, తురీయమును ప్రముఖముగా వివరించినది.

కాన ప్రపంచ దృష్టితో చూచినపుడు దానికి కారణమగు అజ్ఞానము నంగీకరించి అవస్థాత్రయ బోధ చేయుటయే క్రమ మగును. బ్రహ్మతత్త్వ దృష్టితో చూడగలిగినపుడు సూక్ష స్థూలరూపములుగా కన్పించునదంతయు బ్రహ్మమే. నామ రూపాత్మక వైవిధ్య రూప ప్రపంచ దృష్టి లేక అస్తిభాతి ప్రియరూప బ్రహ్మదృష్టితో మాత్రమే ఉండును. పైవివరించిన ఏ దృష్టితో విచారించినను తత్త్వమును గ్రహించి కృతార్థులము కాగలము.

ఓం తత్ సత్.

# నవద్వార ఏకాదశ ద్వార వివరణ

**మూ॥ పురమేకాదశ ద్వార మజస్యా వక్రచేతన:**
**అనుష్ఠాయ నశోచతి విముక్తశ్చ విముచ్యతే ॥ ఏ తద్వైతత్ క.ఉ.3-2-1**

తా॥ ఓ నచికేతుడా! జననాది వికారము లేని పరబ్రహ్మమునకు పదకొండు ద్వారములతో కూడికొని యున్న యీ దేహమే పట్టణముగానున్నది. ఈ పురము నందు నివసించుచున్న వాడు కాబట్టి ఇతనికి పురుషుడని పేరు. ఈ పట్టణస్థమై పురస్వామియైన పరబ్రహ్మమును రాగాది విముక్తుడై ఏషణారహితుడై ధ్యానించువాడు జీవించి ఉండగనే ముక్తుడై (జీవన్ముక్తుడై) జనన మరణరూపమైన సంసారబంధము నుండి విముక్తుడగుచున్నాడు విదేహముక్తుడగుచున్నాడని భావము. నీవడిగిన ఆత్మ తత్త్వమిదియే.

**శ్లో॥ సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్. భ.గీ.అ.5.శ్లో.13**

తా॥ ఇంద్రియముల వశపరచు కొన్నవాడగు దేహి మనస్సుచేత సమస్త కర్మలను పరిత్యజించి తానేమియు చేయనివాడగుచు, చేయింపని వాడునునై తొమ్మిది వాకిళ్ళు గల పట్టణమైన శరీరమందు సుఖముగా నుండును. నవద్వార పురమున సూర్యుడు మున్నగు అధి దేవతలచే రక్షింపబడునట్టి కన్నులు, చెవులు, ముక్కురంధ్రములు, నోరు, మూత్రగుదగుహ్యావయవములు అను నీ తొమ్మిది ద్వారములు గల దేహము నవద్వార పురముగానున్నది. దీనికి ప్రత్యగాత్మయే ప్రభువు. బుద్ధియే ప్రధాని, మనస్సు మొదలగు సమస్త కరణములున్ను పరిచారికలు. ప్రాణము మున్నగు పది వాయువులు గ్రామ పాలకులు. ఇట్లిది యొప్పారుచు బ్రహ్మ విష్ణ్వాది సమస్త దేవతలకు స్థానముగా వున్నది. **"విద్వాన్ దేహే ఆస్తే"** విద్వాంసుడు దేహమున వుండుచున్నాడు.

ఉపనిషత్తునందు పదునొకండు ద్వారములు తెలుపడమైనది. గీత యందు తొమ్మిది ద్వారములను తెలిపియున్నారు. ఈ నవద్వారములు సామాన్యముగా మనుష్యాది సకల ప్రాణులకు గలవు. ఇది ప్రాకృత జీవుల లక్షణము. ఆ ప్రాకృత జీవితము గలుగునపుడు, కుండలీ ప్రబోధము, బ్రహ్మరంధ్రము అను రెండు ద్వారములు తెరువబడును. కుండలినీ, బ్రహ్మరంధ్రములనే అద: కుండలినీ, ఊర్ధ్వ కుండలినీ అందురు. అవి జీవన్ముక్తి గలిగి ఈశ్వరత్వము సిద్ధించినపుడే కలుగును. అంతవఱకు మానవుని హృదయమందు గల దేవుడు తలుపులు మూసియున్న దేవాలయమునందువలె మూయబడియుండును. తలుపు తెరువబడిన తర్వాత దేవుడు కన్పించునట్లు పై రెండు ద్వారములు తెరువబడిన తర్వాత ఆత్మదర్శనము గలుగును. దీనికే హృదయ గ్రంథి బేధనమనియు, హృదయ కమల వికాసమనియు పేర్లు. శ్రద్ధా భక్తులతో సాధనచేసినవారు తప్పకపొందగలరు.

ఓం తత్ సత్.

# ఆత్మార్పణము

ఆత్మ:- జ్ఞానరూప భావన - అర్పణము = అర్పించుట లేక విడుచుట.

వేదాంతుల భాషలో పరమాత్మ - ఆత్మ - అంతరాత్మ అను శబ్దములు వినుచుందుము. పరమాత్మ అనగా క్షరాక్షర పురుషులకు విలక్షణుడని - ఆత్మ అనగా ప్రకృతి విశిష్ఠ చైతన్యమనియు, అదియే సర్వదృశ్య రూప చరాచర ప్రపంచమునకు ఆధారమనియు, కారణమనియు - అంతరాత్మ వ్యష్టి జీవులయందు కన్పించు చేతనయనియు వేదాంత శాస్త్రము చెప్పుచున్నది.

అంతరాత్మ:- జీవుని నిజరూప నిర్ధారణకు, తై॥ ఉ. పంచకోశ విచారణ చేసి, సర్వ ప్రపంచము - జీవుని దేహముతో సహా జ్ఞానేంద్రియములవల్ల తెలియబడి, ఉన్నవనిపించుకొని, వ్యవహార హేతువులు అగుచున్నవి. ఇంద్రియముల విడిచి దృశ్యరూపమునకు ఉనికి లేదు గనుక రూప ప్రపంచమును ఇంద్రియాధారమునందు విలీనము చేసికొనవలసియున్నది, ప్రాణమున్నంత వరకే ఆయా ఇంద్రియములు వాని వాని వ్యవహారములందు ప్రయుక్తములగుచున్నవి. ప్రాణమును విడిచి ఇంద్రియములకు ఉనికి, సత్తా లేదు గనుక ప్రాణాంతర్గములుగ భావించవచ్చును. విచారింపగా నిద్రలో ప్రాణమున్నప్పటికి ఇంద్రియ వ్యవహారము లేకుండుట సర్వానుభవము. జ్ఞానరూపమైన మనస్సు వ్యవహరించని కారణమున ప్రాణసహిత ఇంద్రియ వ్యవహారమంతయు అణగినది కాన ఇంతదనుక చెప్పిన సర్వకార్యములకు మనస్సే ఆధారమని గుర్తించుచున్నాము. ఈ మనస్సు సాభాసాంత:కరణ వృత్తిరూప పరిణామమే యగుచున్నది. అంత:కరణమును చేతనవంత మొనర్చి, నేననిపించి (ప్రమాత) తద్వారా సర్వవ్యవహారములు జరుగుట లోక విదితము. అట్టి చైతన్యమే అంతరాత్మయనీ తెలియవచ్చుచున్నది.

ఆత్మ:- ప్రత్యేక జీవోపాధులను చేతనవంతము చేయు చేతనము ఏకము అని భ.గీ.అ.13.శ్లో.2. **"క్షేత్రజ్ఞం చాపిమాం విద్ధి సర్వ క్షేత్రషు భారత"** చెప్పుచున్నది. ఈ ఏకరూప జ్ఞానమునే అనగా సమష్ఠి రూపమున ఆత్మ అందురు. ఈ స్థితినే అక్షరుడని కూడ అందురు.

పరమాత్మ:- పరమాత్మయే కారణరూపమున అక్షరపురుషునిగను, కార్యరూపమున క్షరపురుషునిగను తెలియవచ్చుచున్నది. జ్ఞానము లేక తెలివి ప్రకటనమైనపుడు క్షర పురుష రూపమున జాగ్రత్‌లో గుర్తించుచున్నాము. సుషుప్తిలో ప్రకటితము గాక తిరిగి జాగ్రత్‌లో ప్రకటితమగుట అనుభవసిద్ధము గనుక, తెలియబడనపుడు అవిదిత రూపములో అనగా అక్షర రూపములో యున్నదని ఊహించగలము. కారణమగు అక్షర రూపము, కార్యమగు క్షర రూపము రెండును ఉనికిలేములు కలవిగా మనము నిశ్చయించగలము. ఈ రెండింటికి అతీతమై ఉత్తమ రూపమున అనగా పురుషోత్తమ రూపమున ఉన్న విషయము వేదాంత శాస్త్రము చెప్పుచున్నది.

పరిచ్ఛిన్న వ్యష్టి భావనను విడిచి అపరిచ్ఛిన్న సమష్టిభావన పొందగలిగిన, సర్వజ్ఞత్వాది లక్షణములు పొందగలరు. ఈ ఆత్మ భావరూప స్థితిని పొందిన, జన్మరాహిత్యము కలుగును. కాని పురుషోత్తముని స్థితిబొందుటకు ఆత్మభావన కూడ విడువవలసియే ఉన్నది. ఇట్టి ఆత్మభావన విడుచుటకే ఆత్మార్పణం అని చెప్పబడుచున్నది. జీవభావన అహంకారయుతము. ఈశ్వరభావన నిరహంకారయుతమగు యెఱుక మరపులే యగును.

**శీ॥ ఆ. ఎఱుక మరుపుల నెఱిఁ గెడి యెఱుకనేను**
**విధి నిషేధములగాంచు విభుడనేను।**
**దర్శ్యములనెల్ల దర్శించు తత్త్వమేను, నేను**
**నేనని వివరించు నేతనేను॥**

నేనని చెప్పునట్టి వస్తువేదియో ఆ వస్తువే పూర్ణ వస్తువని గుర్తించవలెను. దానియందే కార్య (అంతరాత్మ) కారణ (ఆత్మ) రూపముగా తోచి అణగు ఆభాసలు, నిజరూప స్థితినుండుటకు ఆత్మ భావన విడచుట ఆవశ్యకము. దీనినే ఆత్మార్పణమందురు. ఇదియే జీవబ్రహ్మైక్య స్థితి.

ఓం తత్ సత్.

## పంచదశాక్షరీ మంత్రము

**మం:- "స్వప్నే ప్రతీయమానాని రూపాణి యథాతథా"**

తా॥ కలలో తోచెడి రూపములు ఎలాగో అలాగే స్వప్నావస్థ యందు తెలియ బడెడు బాహ్యములు ఆంతరములునునగు సమస్త పదార్థములు శరీరాంతర్భాగము నందు గల సూక్ష్మనాడులలో గలుగుచున్నవి. ఆ సంకుచిత ప్రదేశమునందు గల సూక్ష్మ నాడులలో పర్వతములు, రథములు, ఏనుగులు మొదలగు పదార్థము లేవియు నుండ జాలవు. స్వప్నావస్థయందు దేశ దేశాంతరములకు బోయి అచ్చట నున్న సమస్త పదార్థములను చూచి వచ్చుచున్నాడని చెప్పెదరు, రాత్రి నిద్రించి యున్నపుడు బహుదూరం పోయి వస్తువులను గాంచినట్లు కలగనును. అత్యంత స్వల్పకాలములో అంతదూరము వెళ్ళి వచ్చుట వీలుకాని పని. వాస్తవముగ అంతదూరము పోవుట గాని అచ్చట చూచి వచ్చిన విషయముల యథార్థతగాని మేల్కొంచిన తర్వాత అయథార్థములుగ తెలియవచ్చుచున్నది.

విచారణ దృష్టిలేని మరికొందఱు స్వప్న పదార్థము లన్నియు జాగ్రత్ జ్ఞానజన్య సంస్కారముల వలన గలిగెడి స్మృతిరూపమగు మానవ విపర్యాసము అందురు ఇదియు సరి కాదు. ఏలన స్వప్నమునందు రథతురగాదులను ప్రత్యక్షముగా చూచితినని చెప్పుచున్నాడు గాని స్మరించితినని చెప్పుటలేదు. జాగ్రతులో చూడని కొన్ని విషయములను స్వప్నములో చూచుచున్నాడు గనుక స్మృతి అనుటకు వీలు లేదు. ప్రత్యక్షముగా చూడని విషయముల స్మృతి యుండదు గదా! స్నప్నమునందు త్రిపుటీ సమాజము నూతనముగా సృజింపబడుచున్నది. ఈ విషయమునుగూర్చి శ్రుతియందు యిట్లు చెప్పబడియున్నది.

**శ్లో॥ నతత్ర రథానరథ యోగానపంథానోభవం**

**తృథ రథాన్ రథయోగాన్ పథస్సృజతే" ॥**

భావము:- స్వప్నమునందు రథము లేదు. గుఱ్ఱములు లేవు. అవి పోవు మార్గమునులేదు. అయిన అచ్చట రథమును, గుఱ్ఱములును, అవి పోవు మార్గమున నూతనముగ సృజింప బడుచున్నవని చెప్పబడెను. ఈ శ్రుతియందు స్వప్న కాలమున రథాదుల యొక్క నూనతోత్పత్తిని చెప్పుట చేత స్వప్న ప్రపంచము నూతనముగ సృజింపబడినది అని తెలియ వలయును. కాన అప్పుడు విషయములతో జాగ్రత్ ఇంద్రియముల సంబంధము గాని, జాగ్రదంత:కరణ వృత్తి సంబంధము గాని కలుగుట లేదు. స్వప్న కల్పిత విషయములతో, స్వప్న కల్పితేంద్రియాంత:కరణములే సంబంధ పడుచున్నవి. ఈ త్రిపుటీ రూప సమాజమంతయు అనిర్వచనీయముగ నుత్పన్న మగుచున్నదని చెప్పబడెను.

**మూ॥ యథా స్వప్నే ద్వయాభాసం స్పందతేమాయయా మన: ।**

**తథాజాగ్రద్ద్వయాభాసం స్పన్ధతే మాయయా మన: ॥ మూ.కా.అ.3.శ్లో.29**

భావము:- ఆత్మచే భావింపబడుచున్న మనస్సు మాయా ప్రభావము వలన గ్రాహ్య గ్రాహక రూపమున స్వప్నమునందెట్లు స్పందించుచున్నదో, అటులనే జాగరితము నందు గూడ నీ రెండు రూపముల విజృంభించుచున్నది. స్వప్న పదార్థములు దృశ్యములగుటచే మిథ్యయే యగును. స్వప్న పదార్థములకు ఆదియు అంతము అగుపడుట లేదు. అవి మధ్య మాత్రమున్నట్లు తోచుచున్నవి. కావున అవి సర్వత్ర లేనివేయగుచున్నవి. అట్లే జాగ్రదవస్థ యందు గల దృశ్యపదార్థములన్నియు ఆద్యంతములందు లేనివై మధ్య మాత్రము తోచుచున్నవి. కావున అవియు మిథ్యలే యగును.

**మూ॥ స్వప్న జాగరితస్థానే హ్యేక మాహుర్మనీషిణ: ।**
**బేధానాంహి సమత్వేన ప్రసిద్ధేనైవ హేతునా ॥** **మా.కా.అ.2.శ్లో.5**

భావము:- స్వప్న జాగరిత స్థానములు రెండింటికిని సుప్రసిద్ధమైన సామ్యముండుట చేత రెండు నొకటియేయని విద్వాంసులు చెప్పుచు వున్నారు. కావున జాగ్రదృశ్య పదార్థములకు స్వప్నమునందు గాని, స్వప్నదృశ్య పదార్థములకు జాగ్రత్‌నందుగాని ప్రయోజనము కన్పించుట లేదు. స్వప్న జాగరితములందు గల పదార్థములు చిత్తకాలములనియు ద్వయకాలములనియు రెండు విధములుగా నుండును. ఇందు కేవలము మనోరథమాత్రము లేయై, మనస్సు నందు మాత్రమే చింతింపబడునవి చిత్తకాల పదార్థములనబడును. జాగ్రత్స్వప్నము లందు బాహ్యములై యున్నట్లు తెలియబడుచున్న వస్తువులు మనస్సుచే కల్పితము లైనను నవి వెలుపుల గూడ నున్నట్లు కనుపించుచున్నవి. కావుననివి ద్వయ కాలములు అనబడును. ఇందు చిత్తకాల పదార్థములు వాసనా యుక్తమగు మనోభావ మాత్రములై మనస్సునకు లోపల మాత్రమే అవ్యక్తముగ నుండును. ద్వయకాల పదార్థములు బాహ్యములై ఇంద్రియ సంబంధము గలిగి స్ఫుటముగ తెలియబడుచున్నవి. ఐనను జాగ్రత్స్వప్నముల అందు మనస్సుచే తెలియబడెడి చిత్తకాల పదార్థములును, ద్వయకాల పదార్థములును మనోకల్పితములే యగుటచే నవి రెండును మిథ్యలే యగును.

మొదట సచ్చిదానంద రూపుడగు ఆత్మ అవిద్యా ప్రభావము వలన జీవభావము పొందుచున్నాడు. ఆ జీవుడు క్రియా కారక ఫల బేధములచే నానావిధములగ నుండెడి బాహ్యపదార్థములను, వాని నెఱింగెడి ఇంద్రియ ప్రాణాంత: కరణాదులను కల్పించుకొనుచున్నాడు. దానివలన కార్యకారణ రూపముగ నుండి సమస్త ప్రపంచమును కల్పించుకొని వ్యవహరించుచున్నాడు.

**మూ॥ సంఘూతా: స్వప్న వత్సర్వే ఆత్మ మాయా విసర్జితా: ।**
**ఆధిక్యే సర్వసామ్యేవా నోపపత్తి ర్హి విద్యతే ॥** **మా.కా.అ.3.శ్లో.10**

భావము:- దేహాది సంఘాతములు అన్నియు స్వప్నములోవలెనే ఆత్మకు సంబంధించిన మాయ వలన బయలుదేరినవి. వానియొక్క అన్యోన్యాధిక్యమునకు గాని సమత్వమునకు గాని యుక్తి దొరకదు.

ఈ సర్వానర్థములకు మూలమైన జీవకల్పనయే యదార్థ జ్ఞానమునకు ప్రతిబంధకమగుచున్నది.

ఈ సంసార ప్రవాహమనాది, ఈ అనాది సంసారపు ప్రవాహంలో జీవులకు జాగ్రత్స్వప్నములు కలుగుచున్నవి. ఏ అవస్థయందైనను పదార్థ పదార్థ జ్ఞానములు రెండును ఒకే కాలమందు తోచుచున్నవి. అట్లే ఒకే కాలమందు నశించుచున్నవి. ఇట్లు పద పదార్థములు ఒకే కాలమందు తోచి ఒకే కాలమందు నశించుచుండగా "నేను పుట్టక పూర్వమే యీ ప్రపంచము పుట్టియున్నదనెడి ప్రపంచము యొక్క బహుకాల స్థిరత్వ భ్రాంతి అనిర్వచనీయముగ కలుగుచున్నది".

**మూ॥ స్వప్న మాయే యథా దృష్టే గంధర్వనగరం యథా ।**
**తథా విశ్వమిదం దృష్టం వేదాన్తేషు విచక్షణై: ॥** **మ.కా.అ.2.శ్లో.31**

భావము:- స్వప్న మాయాగంధర్వనగరము లేవిధముగా చూడబడుచున్నవో ఆ విధము గనే వేదాంతములయందు విచక్షణులగు వారిచేత నీ ప్రపంచము చూడబడుచున్నది.

అవిద్యయు అవిద్యాకార్యములును సాక్షిచే ప్రకాశింపబడుచున్నవి. జాగ్రత్స్వప్న పదార్థములు, పదార్థ జ్ఞానములు సమకాలమునందుమాత్రమే తోచుచున్నవి. సమకాలమునందే నశించుచున్నవి కాన కలలో తోచిన రూపములెలాగో జాగ్రత్‌లో తోచినవి అలాగే.

ఓం తత్ సత్.

# సృష్టి

శ్లో॥ **యథోర్ణనాభి: సృజతే గృహ్ణతే చ**
**యథాపృథివ్యామోషదయ: సంభవంతి ।**
**యథాసత: పురుషాత్ కేశలోమాని**
**తథాఽ క్షరాత్ సంభవతీహ విశ్వమ్ ॥** **ము.ఉ.అ.1.శ్లో.1-7**

భావము:- సాలెపురుగు ఎలా తనగూడును తనలోనుండే వెలికితీసి తనలోకే తీసికొంటుందో, భూమి నుండి మూలికలన్నీ ఎలా ఉద్భవిస్తాయో, మానవుడి తలమీద శరీరం మీదా ప్రయత్నం లేకుండానే వెంట్రుకలు ఎలా పెరుగుతాయో అలాగే ఆ అక్షరతత్త్వం నుండి ఈ విశ్వం ఉత్పన్నమౌతుంది.

అక్షరతత్త్వమైన బ్రహ్మం నుండి విశ్వంయొక్కఆవిర్భావం ఎంత సహజమో స్వచ్ఛందమో చూపడానికి ఉపనిషత్తు మూడు ఉపమానములు చెప్పుచున్నది. సాలెపురుగు తన గూడు అల్లే సమయంలో ఎంత అనాయాసంగా సహజంగా ఆ దారాలను తన పొట్టలోనుంచే వెలికితీస్తూ ఉంటుందో అలాగే ఈ బ్రహ్మాండం కూడ అవలీలగా సహజంగా బ్రహ్మం నుండి ఉద్భవిస్తూ అందులోనే లయమవుతూ ఉంటుంది.

సాలెపురుగుకు ఏదో ఉద్దేశం ఉండి ప్రయత్నం చేసినట్లు కన్పించు కారణం, బ్రహ్మమునకు కూడ ఉండునను సందేహము తొలగించుటకు రెండవ ఉపమానము చెప్పబడుచున్నది. భూమి పట్ల, ఏ విధమైన ఉద్దేశమూ ప్రయత్నమూ లేకుండానే సహజంగా అప్రయత్నంగా భూమి నుండి మూలికలు పెరుగుచున్నవి గదా! అలాగే బ్రహ్మంపట్ల కూడా ఏవిధమైన ఉద్దేశము ప్రయత్నములేకుండానే సహజంగా అప్రయత్నంగా విశ్వమంతా బ్రహ్మం నుండి ఆవిర్భవించుచున్నది. అయితే బ్రహ్మం కూడ భూమిలాగా అచేతనము జడము అయిన పదార్థమా? కాదు అని ఉత్తరం,

చైతన్యవంతుడైన మానవుడి శరీరం నుండి ఏ ప్రయత్నము లేకుండా సహజంగా వెంట్రుకలు పెరుగుతాయో అలాగే చైతన్య స్వరూపమైన బ్రహ్మం నుండి జడమైన ఈ విశ్వం అభివ్యక్తమౌతుంది.

మొదటి ఉపమానం జగత్తుయొక్క ఆదికి అంతానికి బ్రహ్మమే ఆధారమని సూచిస్తోంది. రెండవ ఉపమానం సృష్టి తరువాత కూడా జగత్తు పూర్తిగా బ్రహ్మం పైనే ఆధారపడి ఉండుటచేత జగత్తుకు బ్రహ్మమే ఆశ్రయమని దృఢముగా చెప్పుచున్నది. బ్రహ్మంయొక్క నిజస్వరూపము చైతన్యం అనీ బ్రహ్మం యొక్క ఒకానొక శక్తి నుండి ఉద్దేశ రహితమూ అప్రయత్న పూర్వకమూ అయిన ఈ జగత్తు ఆవిర్భవించిందనీ, కేవలము ఆ శక్తి మాత్రమే బ్రహ్మం యొక్క నిజస్వరూపంకాదని మూడవ ఉపమానం చెప్పుచున్నది.

ఈ విశ్వం అనేది బ్రహ్మం యొక్క వాస్తవమైన పరిణామం కాదనీ, దాని అవాజ్ఞానస గోచరమైన శక్తి యొక్క కల్పన మాత్రమే అనీ ఉపనిషత్తు ఈ మూడు ఉపమానముల ద్వారా పరోక్షంగా సూచిస్తూన్నది. ఈ దృష్టి చేత విశ్వానికి బ్రహ్మం నిమిత్త కారణము, ఉపాదాన కారణము కూడ అవుతుంది.

**శ్లో॥ చైతన్య ప్రతిబిమ్బేన వ్యాప్తో బోధేహి జాయతే।**
**బుద్ధే: శబ్దాది నిర్భానస్తేనయో ముఖ్యతే జగత్ ॥** **ఉ.స. 5-4**

బుద్ధి చైతన్యంచే వ్యాప్తమై శబ్దాదులవలె తోచేయెఱుక ఏర్పడుతుంది. దానివల్ల లోకం మరల మరలా మోహగ్రస్తం అవుతుంది.

అనగా శబ్దము మొదలగు విషయాలు తెలిసికొనేటపుడు అంత:కరణ వృత్తులు శబ్దము మున్నగు ఆకారాలు దాలుస్తాయి. అవి చైతన్యంచే వ్యాప్తమై పుటుతాయి. ఈ వృత్తులనే అజ్ఞానులు జ్ఞానం (యెఱుక) అంటారు. అంతేకాని జ్ఞాతృత్వం అవిద్యా కల్పితం. విద్యచే జ్ఞాతృత్వం బాధితమైతే చాలు. కర్తృత్వ భోక్తృత్వాలన్నీ మటుమాయ మవుతాయి. ఆత్మ అనాత్మ వివేకం లేనందున జ్ఞాతృత్వం తోస్తున్నది. అది మిథ్యయే.

ఏది సత్యమో దానికి నివృత్తిలేదు. మిధ్యయైన వస్తువునకే నివృత్తి ఉంటుంది. ఆత్మబాధకం, అనాత్మయైన అంత:కరణం బాధ్యం. కాన బాధకమైన ఆత్మయే యున్నది గాని బాధ్యకమైన అంత:కరణానికి ఆత్మజతలో ఉనికి లేదు గదా! జగత్తు మిధ్య అని చెప్పడంవల్ల సత్యమైన దాని ఆస్పదజ్ఞానంవల్ల జగన్నివృత్తి కలుగుతుంది. జగత్తులోనే బంధం చేరింది. కాన బంధ నివృత్తి సులభసాధ్యం. అలాకాక, జగత్తు సత్యమంటే దానికి నివృత్తి లేనందున ఎవ్వనికి బంధ నివృత్తి కాదు. ముక్తి ఎవ్వరికి సిద్ధింపదు. కాన జగత్తు సత్యమని ఒప్పుకుంటే గురు శాస్త్రాదులకు అస్తిత్వం ఉండదు. అవి వ్యర్థాలవుతాయి. జగత్తు మిధ్యయని ఒప్పుకుంటే జ్ఞానం వల్ల దాని నివృత్తి ఉంది. పరమపురుషార్థం దక్కుతుంది. ముక్తిని ప్రతిపాదించే శ్రుతి సఫలమవుతుంది.

సాక్షియైన తనకు అంత:కరణము దృశ్యము అనగా విషయము. కాన సాక్షియొక్క వెలుతురులో అంత:కరణముతోచవలెను. సాక్షి చైతన్యమును వీడి అంత:కరణము వేరుగాలేదు. సముద్రమునే అల అని వ్యవహరించు చున్నట్లు, ఉన్న ఆత్మనే అవిద్యతో అనాత్మ అని కల్పించు కుంటున్నారు. అది ప్రత్యేకమైన ఉనికి గల వస్తువు గాదు. సాక్షి భాస్యమై ఉన్నది. అనాత్మ అనబడే అంత:కరణం కేవల వాచారంభణం వస్తుత:, ఉన్నది అద్వితీయమైన ఆత్మయే.

ఓం తత్ సత్.

# సద్గురూపదేశమహిమ

సద్గురువుల నిరంతరము శ్రద్ధాభక్తులతో సేవించెడి సచ్ఛిష్యున క్రింద యమనంబులు వశవర్తులై యుండును. స్వయముగ నెవరును ఏవిద్యను నేర్వరాదు. బేధవాదులగు పండితుల వద్దకూడ బ్రహ్మ విద్య నభ్యసింపరాదు.

పూర్వకాలమున వరుణుని వద్దన భృగువును, యాజ్ఞవల్క్యుని వద్దన జనకుడు మొదలగువారును బ్రహ్మవిద్య నభ్యసించిరి. అట్లే శ్రీరాముడు వశిష్ఠుని యొద్దను, శ్రీ కృష్ణుడు సాందీపుని యొద్దను బ్రహ్మవిద్య నభ్యసించిరి. ఈ విధముగ నున్నత పదవి ననుష్ఠించిన మహాత్ములందరును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైన సద్గురువులను సేవించి విద్యనభ్యసించిన వారే అగుదురు. ఇందు జ్ఞాని అనగా శ్రోత్రియుడనియు, తత్త్వదర్శియనగా బ్రహ్మనిష్ఠుడనియు అర్థము.

ఈ విషయమే ఒక కథారూపముగ చెప్పబడినది. పూర్వము బ్రహ్మ విద్యా సంపన్నుడగు నొక మహాత్ముడు దక్షిణదేశము నందుండెను. ఆయన శిష్యసహితముగ దేశాటన చేయుచుండెడివారు. తమ్మాశ్రయించిన భక్తులకు బ్రహ్మోపదేశము చేయుచుండెడివారు. ఒకనాడు విజయనగరం వచ్చి విడిదిచేసియుండిరి. ప్రతి దినము పలువురు భక్తులు స్వామివారిని దర్శించి ఉపదేశమును పొందుచుండిరి.

ఆ పట్టణ వెలుపల ఏనాదివారి గుడిసెలుండెను. అందు సోలిగాడనెడి ఒక ఏనాది వాడుండెను. అతడు జారత్వ చోరత్వాది సమస్త దుర్గుణములకు ఖని. అతడు స్వాములవారి ప్రభావము విని "సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం" అను నార్యోక్తి ప్రకారం వారిని దర్శించవలెనను సత్సంకల్పము కల్గి, పండ్లు పుష్పములు మొదలగునవి తీసికొనివెళ్ళి స్వామికి సమర్పించి సాష్టాంగ దండప్రణామము లాచరించి, నాకు పరమార్థమును ఉపదేశింపుడని వేడుకొనెను.

అతని పూర్వ స్వభావము తెలిసిన పట్టణవాసులు వాడు ఉపదేశానర్హుడని చెప్పినప్పటికిని, తన్నాశ్రయించిన భక్తునకు ఉపదేశము చేయుటకు అంగీకరించెను.

అజ్ఞానముచేత అనేక దుష్కృత్యములు చేసిన మాట నిజమేనని అంగీకరించి, ఇక దేవరవారి ఆజ్ఞానుసారం వర్తించెదనని చెప్పుచు దొంగతనం మాకులవృత్తి దానిని విడిచిపెట్టిన మాకు వేరు జీవనాధారము లేదని, వేరొక బ్రతుకుదెఱువు మార్గము దొఱకునంతవరకు తమరు దాని నంగీకరించుచు పరమార్థము బోధింపుడని మరి మరి ప్రార్థించెను.

బ్రహ్మోపదేశము పొందుటకు కామక్రోధాది దుర్గుణములును హింసాది ఘాతుక కృత్యములు సంపూర్ణముగ విడువవలయును. ఏ పరిస్థితులలోను అబద్ధమాడరాదు. సత్యమునే పల్కవలెను. జీవనమునకు మరొక వృత్తి దొరకు వరకు పూర్వ వృత్తితోనే జీవించు చుండుమని స్వామి చెప్పెను.

ఆ మాటలకు సోలిగాడానందభరితుడై యింటికి వెళ్ళెను. తరువాత స్వాములవారు ఆ పట్టణమును విడిచి మఱియొక ప్రదేశమునకు వెడలిపోయిరి.

సోలిగాడు స్వామి మాటలను వినయ భయభక్తులతో తూచా పాటించుచుండెను. ఇంట్లో ఆహారపదార్థములు లోపించిన కారణంగా ఒకరాత్రి కన్నపు కత్తి. త్రాళ్ళు నిచ్చెన మొదలగు పరికరములతో దొంగతనము చేయుటకు బయలుదేరెను. ఆ పట్టణపు రాజుగారు, పట్టణ ప్రజల కష్టసుఖములను గమనించుటకు, స్వయముగా మారువేషముతో బజారులలో తిరుగాడుచుండెను.

ఆ సమయంలో సోలిగాడు కన్పించగా నీవెవరవని రాజు ప్రశ్నించెను. నేను దొంగనని బదులు చెప్పెను. నీవెవరవని సోలిగాడు వాని నడిగెను. దానికి నేనును దొంగనేనని చెప్పి, మన మిరుపురము కలిసి దొంగతనము చేయుదమని చెప్పెను. అప్పుడు సోలిగాడు అందుల కంగీకరించి, బీదవారి ఇండ్లలో దొంగతనం చేసిన వారు జీవించుటకు లేక బాధపడెదరు. రాజుగారి మేడకు కన్నము వేయుదమని చెప్పగా రెండవ దొంగయు అందులకు అంగీకరించెను.

క్రొత్త దొంగను బయట కాపలాయుంచి, తాను తెచ్చిన పరికరముల సహాయముతో రాజాంతఃపురమున ప్రవేసించెను. హంస తూలికా తల్పమున వజ్ర వైఢూర్య గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్యాదులు పొదిగిన సువర్ణాభరణములను ధరించి పవళించియున్న రాజుగారి భార్యను గాంచెను. ఆమెను చూడగానే ఆ దొంగకు అమితమైన భక్తి ప్రపత్తులు కలిగి, ఆమెకు నమస్కరించి ఆ గది నుండి వేరొక గదికి వెళ్ళెను. అచ్చట ధనపు పెట్టెలు రెండుండెను. అచ్చటనే బీరువాలో నొక బరణి కన్పించెను. అందున్న ఐదు రత్నములను తీసికొని బయటికి వెడలిపోయెను. రెండవ దొంగ ఏమి జరిగినదని యడుగగా, జరిగినదంతయు యదార్థముగ జెప్పి, తెచ్చినవానిలో రెండు రత్నములను వానికిచ్చి మిగిలిన మూడు రత్నములను తీసుకొని వెళ్ళిపోయెను.

తెల్లవారిన పిదప దాసదాసీజనులు రాత్రి అంతఃపురమున జరిగిన దొంగతనమును రాజుగారికి విన్నవించిరి. రాజు దానిని గురించి వివరములను తెలిసికోవలసినదిగ మంత్రిగారిని నియమించెను.

మంత్రి ఆ ప్రదేశమునంతయు పరిశీలించి రత్నములు ఐదు లేకపోవుట, ధనపు పెట్టెలు రెండు యథాప్రకారంగా అచ్చటనే యుండుట గమనించెను. ఈ ధనపు పెట్టెలు రెంటిని తన యింటికి తోలించి, అవి కూడ రాత్రి దొంగలించబడినవని రాజుగారికి తెలిపినచో ఆ ధనము తనకు దక్కునని తలంచెను. అట్టి దుస్సంకల్పము బుద్ధియందు ప్రబలమై ఆ ధనపు పెట్టెలను తయ యింటికి తరలించెను. తిరిగి రాజు దగ్గరకు వచ్చి ఐదు రత్నములు, రెండు ధనపు పెట్టెలు దొంగలించబడినవని రాజుగారికి నివేదించెను.

రాజా విషయమును విని ఎవరు దొంగిలించిరో విచారింపుమని మంత్రిని నియమించెను. అంత మంత్రి ఊరు వెలుపలనున్న ఏనాదివారిని పిలిపించి, దొంగతనము ఎవరు చేసినది చెప్పుడని గద్దించి కొట్టబోవుచుండెను. అప్పుడు సోలిగాడు అయ్యా వారు నిరపరాధులు వారిని కొట్టవద్దు. కన్నం వేసినది నేనే. నేను ఐదు రత్నముల నపహరించి నాతో వచ్చిన మరియొక దొంగకు రెండు రత్నములనిచ్చి మూడు

రత్నములను నేను తీసికొంటిని. అవి నావద్దనున్నవి అని చెప్పెను. అంతట మంత్రి సోలిగానితో ధనపు పెట్టెలు రెండు అపహరించితినని చెప్పుటలేదు. నీవు కాక మరెవరు వచ్చిరని కఠినముగా కొరడాతో దండించబోయెను. ఈ విషయము నంతను తెలియనట్లుగా నటించుచున్న రెండవ దొంగగా నటించిన రాజుగారు కలుగజేసికొని ఇట్లనెను. వానిమీద పోవునని మరెవరైనా దొంగలించి యుండగూడ దాయని, అందరిని రాజదర్బారులోనే కదలక ఉండుడని కోరెను. అంతట రాజభటులను పిలిపించి, అచ్చట నున్నవారి గృహములను పరిశోధింపుడని ఆజ్ఞాపించెను.

వారు వెళ్ళి గృహముల వెదకుచుండగా ఆ ధనపు పెట్టెలు రెండు మంత్రి యింటివద్ద కానవచ్చెను. ఆ విషయమును రాజు గారికి నివేదించిరి.

అప్పుడు రాజు కోపించి ఓరీ దుర్మార్గుడా! నా సొమ్ము ఇన్ని దినముల నుండి తింటూ నా యింటినే దోచితివని తన పట్టణమునుండి కట్టుబట్టలతో వెడల గొట్టించెను. అంతట సోలిగానిని పిలిచి నీవు నిజము చెప్పినావు. కాన వెడలి పోయిన మంత్రి ఆస్తిపాస్తులను స్వాధీనపరచుకొని మంత్రిగానుండుము. నిన్ను సోలంరాజు అని పిలిచెదరు అని రాజు చెప్పెను. దానికి సోలిగాడు నాకు చదువే రాదు నేనుండననెను. అందులకు రాజు అంగీకరింపక సత్యవ్రతువు మంత్రిగా నుండవలెను. అట్లుండుటచే దేశప్రజలు సౌఖ్యవంతులై యుందురని నిశ్చయించి సోలంరాజు అను నామంతో మంత్రిగా నియమించి అతనికి విద్య నేర్పింపసాగెను. సోలంరాజు మంత్రిత్వము పరిపాలన చక్కగా జరుగుచుండగా ప్రజలు సౌఖ్యానందములతో తులతూగుచుండిరి.

ఒకనాడు రాజదర్బారు జరుగుచుండగా, పూర్వము తనకుపదేశించిన గురువుగారా గ్రామము వచ్చినారని మంత్రిగారికి తెలియగా వెంటనే ఎవ్వరికి చెప్పకుండానే వెళ్ళిపోయి గురువుగారిని దర్శించి ఫలపుష్పాదులను సమర్పించి సాష్టాంగ నమస్కారమొనర్చి నేను శరీరము నమ్ముకొంటిని మరలవచ్చి దర్శనము చేసికొందునని వెడలిపోయెను. ఈ విషయమంతయు రాజు గ్రహించి తాము కూడ ఆ మహనీయుని దర్శించవలెనని

బయలుదేరిరి. వారి వెంట పెద్దలందరు బయలుదేరిరి. ఫలపుష్పాదులను స్వామికర్పించి సాష్టాంగదండ ప్రణామము లాచరించి బ్రహ్మోపదేశమును పొంది తరించిరి.

ఒక గ్రామములో ఒక నిజమైన గురుభక్తుడు వున్నచో అందరు తరించుటకు అతడు మార్గ దర్శకుడగును. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువునకు చతుర్విధ శుశ్రూషలొనర్చి వారు ప్రసన్నులైన పిదప సాష్టాంగ నమస్కారమాచరించి వినయపూర్వకంగా పరమార్థ విషయముల ప్రశ్నించి తెలిసికొని ఆత్మజ్ఞానము పొందవలెనని భగవద్గీత యందు కూడ చెప్పబడినది.

**శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శిన: ॥** **భ.గీ.అ.4.శ్లో.34**

అట్లుగాక శాస్త్రాధ్యయనముచే ఆత్మతత్త్వమునెఱింగి ఆత్మానుభవము లేని పండితుల స్థితిని ఉపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది.

**శ్లో॥ అనుభూతిం వినామూఢో వృథాబ్రహ్మణి మోదతే।**
**ప్రతిబింబిత శాఖాగ్ర ఫలాస్వాదన మోదవత్॥** **మై.ఉ.అ.2.శ్లో.23**

భావము:- అనుభవము లేని మూఢుడు **"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా"** అను మాటలను మాత్రము పలుకుచు సంతసించుట, నీటిలో ప్రతిఫలించిన కొమ్మ మీదనున్న పండ్లను రుచి చూచి సంతసించు నట్లు వ్యర్థమే. అనుభవము లేని శుష్కవచనములు సఫలములు కావు.

సద్గురు మహిమ నెరుంగుటకు ఈ కథ యెంతయో ప్రయోజన వంతమగును. కథాసారము గ్రహించి సద్గురు భక్తులందరు ముక్తి నొందుదురు గాక.

ఓం తత్ సత్.

# ఔపనిషత్పక్షి ద్వయ వివరణ

1. ద్వాసువర్ణా సయుజా సఖాయా సమానం
వృక్షం పరిషస్వ జాతే।
తయోరస్య: పిప్పలం స్వాద్వత్త్య
నశ్న న్నన్యో అభిచాక శీతి ॥ శ్వే.ఉ.4-6, ము.ఉ.3-1-1

2. సమానే వృక్షే పురుషక్షనిమగ్నోఽనీ
శయా శోచతి ముహ్యమాన:।
జుష్టం యదా పశ్యత్యన్య మీశమస్య
మహిమానమితి వీత శోక: ॥ శ్వే.ఉ.4-7, ము.ఉ.3-1-2

1. భావము:-అందమైన రెక్కలు గల రెండు పక్షులు విడదీయ రాని స్నేహితులు. అవి ఒకే వృక్షాన్ని ఆశ్రయించి జీవుస్తున్నవి. వీటిలో ఒకటి చెట్టున ఉన్న పండ్లను ఆస్వాదిస్తూ ఆరగిస్తున్నది. మరొకటి వాటిని తినకుండా చూస్తూ ఉన్నది.

2. భావము:-ఒకే వృక్షంమీద కూర్చున్న జీవాత్మ తన నిజమైన దివ్య స్వరూపాన్ని మరచిపోతాడు. మోహంచేత ఆవరించబడతాడు. కర్మమగ్నుడై దు:ఖ పరవశుడు అవుతాడు. సర్వ ప్రభువు, భక్తజనులు ఆరాధించేవాడు అయిన మరొకనిని జూచి సకల మహత్వమూ ఆయనదే అని గుర్తించినపుడు దు:ఖ విముక్తుడు అవుతాడు.

కవిత్వ పూర్ణమైన మొదటి మంత్రంలో రెండు పక్షులుగా చెప్పబడినది జీవాత్మ పరమాత్మలు ఇవి రెండూ విడదీయరాని మిత్రులుగా చెప్పబడ్డాయి. అద్వైతుల వాఖ్యానం ప్రకారం జీవాత్మ కేవలం మనస్సుపై ప్రతిఫలించిన పరమాత్మయే. ఇచ్చట పరమాత్మ ఈశ్వరుడన్న అర్థంలో ప్రయోగం. మాయచే ఆవరించబడిన శుద్ధచైతన్యం. అయితే అజ్ఞానం లేకపోవడంచేత అది స్వతంత్రమూ శాశ్వతమూ సర్వజ్ఞమునూ.

కొందరు, ఒక పక్షి ప్రతి జీవిలోను కర్మకు అనుభవానికీ ముఖ్య కారణమైన మనస్సు అనీ, మరొక పక్షి జీవనంలో క్షణికరూపాలైన సుఖ దు:ఖాలను బొత్తిగా అంటని శుద్ధ చైతన్యమని చెపుతారు.

ద్వైత సిద్ధాంతంలో జీవాత్మకు భగవంతుడికీ ఉన్న ప్రేమ బంధమూ జీవాత్మ భగవంతుని ఆశ్రయించి ఉండడమూ ఇవి రెండూ శాశ్వతాలే.

శరీరమే వృక్షం. ఈ రెండిండికీ నశ్వరత్వం అంటే నశించడం సామాన్య లక్షణం. రెండు పక్షులు ఒకే శరీరంలో ఉన్నట్లు చెప్పడం జీవాత్మకు శరీరమే స్థానంగా గ్రహించాలి. రెండవ పక్షియైన పరమాత్మ (ఈశ్వరుడు) సర్వాతీతుడు అయినా అన్ని జీవులలోను అంతర్యామి గనుక శరీరం ద్వారానే శరీరధారి పరతత్త్వ సాక్షాత్కారం పొందగలడు. వృక్షానికి ఫలాలు, చేసుకున్న కర్మలు. పురాకృతమైనవి. శరీరంతో చేసిన వీని ఆసక్తివలన జీవాత్మ ఈ కర్మఫలాలను అంటిపెట్టుకుని పరంపరగా వచ్చే శరీరాల ద్వారా పాపపుణ్యాలను అనుభవిస్తూ ఉంటుంది. కాని ప్రభువు శరీర వృక్షంపైని (రెండవ పక్షి) ఈ విశ్వలీలకు కేవలం సాక్షి మాత్రుడు అవడంచేత కర్మలు, కర్మఫలాల పట్ల అనాసక్తుడై ఉంటాడు. కర్త భోక్త అవగానే వికారము పరిణామము తప్పవు. కాని ఈ వికార పరిణామములు జడానికి తప్ప చైతన్యానికి సంభవింపవని సర్వులు అంగీకరిస్తారు. జీవాత్మ చైతన్య స్వరూపం అవడంచేత వికారం పొందదు. అంచేత అసలు విషయమేమంటే జీవాత్మగా ఆత్మయొక్క కర్తృత్వ భోక్తృత్వాదులను అన్యోన్యాధ్యాస ద్వారా మనస్సు ఆత్మపైన ఆరోపిస్తుంది. ఈ మనో వికారంచేత ఆత్మ సర్వదా ఆకళింకితమై ఉంటూ కేవలం సాక్షి అవుతుంది.

**2.** ఈ మంత్రంలో మొదటి భాగం మానవుడు తన దివ్య స్వరూపాన్ని మరచి పోవడమే అన్ని దు:ఖాలకు మూలమని చెప్పుచున్నది. దివ్య స్వరూపమంటే పరమాత్మతో తాదాత్మ్యమని గ్రహించిన సరే లేదా పరమాత్మతో విడదీయరాని ప్రేమ సంబంధంగా గ్రహించినా సరే. ఆ దివ్యతతో మరల తన నిజమైన సంబంధాన్ని స్థాపించి మానవుడు ఎలా సర్వదు:ఖాల నుండి విముక్తి పొందుతాడో రెండవ భాగం చెపుతున్నది.

'అనీశయా' అనే పదానికి 'నిస్సహాయతతో' అని వాచ్యార్థం. ఆత్మ నిజరూపాన్ని మరచుటయే. అదే అజ్ఞానం, దు:ఖకారణం. ఆరాధన అనగా ఆధ్యాత్మిక సాధకులందరు ఆయనను శ్రద్ధతో ఆరాధించినచో, ఆయన అనుగ్రహం వలననే సాక్షాత్కరిస్తుందని సూచన.

సకల మహత్వము ఆయనిదే అని గుర్తించినపుడు 'మహత్వం' సకల విశ్వపు సంచలనాన్ని సూచిస్తుంది. ఈ విశ్వంలో అన్నింటి వెనుకా ఉండి చోదిస్తున్న ఆ దివ్యతను బట్టబయలుగా చూడగలిగినవాడు, ఇక తన పనులలో అహంకార చోదితుడుకాడు. అహంకార రాహిత్యం అతనిని ఆసక్తి నుండి విముక్తుని చేస్తుంది. ఆసక్తి లేకపోవడం ఈ ప్రాపంచిక జీవిత దు:ఖము నుండి విడుదల చేస్తుంది.

ప్రముఖమైన శ్వేతాశ్వతరోపనిషత్తు, ముండకోపనిషత్తులలో చెప్పిన ఈ రెండు మంత్రములకు పై జెప్పిన వివరణ స్వానుభవములో చూచుకున్నచో ఆనందం కలుగుట కెట్టి సందియముండదు.

జాగ్రదవస్థయందు సాభాసాంత:కరణ వృత్తిరూపము ధరించును. అదే 'నేను' అను ప్రథమవృత్తి దీనినే ప్రమాత అని అందురు. ఈ ప్రమాత ప్రమాణముల ద్వారా ప్రమేయములను తెలిసికొని వ్యవహరించుచున్నాడు. సుషుప్తిలో ఈ నేనను వృత్తి అణగుచున్నది. అనగా చైతన్యమునందు అంత:కరణ భాసించి నేను అనుట, అట్లు లేక పోవుట అనుభవము. భాసించినపుడు నేను నాది అని దేహ తాదాత్మ్యము చెంది సాక్షి చైతన్యమును మరచుచున్నాడు. తాదాత్మ్యము చెందిన దేహాదులు వికార వంతములు గనుక దు:ఖితుడు అగుచున్నాడు. వికారరహితమైన ప్రకాశరూపమైన నిజరూపమును వివేకముతో తెలిసికొని అనుభవములో సరిచూచుకొని దృఢనిశ్చయము కలిగినపుడు తాను నిత్యానందస్వరూపుడే అగును. దీనినే ఈ మంత్రములలో అంత:కరణమునందు తోచిన 'నేను'ను జీవాత్మ పక్షిగాను, అంత:కరణ కూడ అణగినపుడు ప్రకాశస్వరూపముతోనున్న 'సాక్షి' చైతన్యమును రెండవ పక్షిగాను

వరిణంచడమైనది.  దు:ఖితుడగు నేను అను మొదటి పక్షి తన స్వరూపము తెలియగానే రెండవ పక్షి స్థానము అలంకరించును.

స్వరూప జ్ఞానం కలిగినపుడు ఈ రెండు పక్షులను ప్రకాశింపజేయు పరమాత్మ చైతన్యమున్నదని గ్రహించగలడు.  ఇదియే పురుషోత్తమ స్థానం.  ఈ స్థానము నుండియే మాయను స్వాధీనమునందుంచుకున్న ఈశ్వర పక్షి, మాయకు లోబడిన జీవపక్షి ప్రకాశవంతములగుచున్నవి.  ఈ విధముగా నిజరూపమును గాంచినవాడే జీవన్ముక్తుడు.

ఓం తత్ సత్.

# స్ఫురణ శక్తి

**శ్లో॥ నసంధృశే తిష్ఠతి రూపమస్య న**
**చక్షుషా పశ్యతి కశ్చనైనామ్।**
**హృదా హృదిస్థం మనసా య ఏనమేవం**
**విదుర మృతాస్తే భవంతి॥** **శ్వే.ఉ.అ.4.శ్లో.20**

భావము:- ఆయన రూపం ఇంద్రియాల పరిధిలో నిలువదు. కన్నులతో ఆయన నెవరు చూడలేరు. స్ఫురణ శక్తితో ఇలా ఆయన తమ హృదయంలో స్థితుడై ఉన్నాడని సాక్షాత్కరించుకున్నవారు అమరులవుతారు.

స్ఫురణ శక్తితో:- ఇది స్పష్టంగా ఆత్మ సాక్షాత్కార మార్గాన్ని ప్రస్తావిస్తున్నది. హృదామనసా = హృదయంతో మనస్సుతో (స్ఫురణ శక్తితో) అని చెప్పుచున్నది. కేనోపనిషత్తు 1-5, నుండి 9 వరకు ఉన్న మంత్రములలో ఇంద్రియ మనస్సుల సామర్థ్యముచేత చూడనలవి కాదని చెప్పినట్లే పై మంత్ర ప్రథమ పాదంలోకూడ చెప్పినది.

అతేంద్రియంగా హేత్వతీతంగా తెలిసికొనే మార్గమే స్ఫురణ శక్తి అనబడుతున్నది. ఈ స్ఫురణ శక్తి మానవుడి ఇతర మానసిక శక్తులకంటె సంపూర్ణంగా భిన్నమా? ఉపనిషత్తు అలా చెప్పుతున్నట్లు కన్పించదు. స్ఫురణశక్తితో అని వ్యాఖ్యానించిన దానిని మూలంలో 'హృదా' (హృదయం చేత) 'మనసా' (మనస్సు చేత) అనే రెండు పదాలు సూచిస్తున్నవి. ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులు అనే యీ మానసిక శక్తులన్నింటినీ కలిపి బాగా మెరుగుపెట్టి కేంద్రీకరించడం వలన కలిగే శ్రేష్ఠతరమైన దర్శన శక్తియే స్ఫురణ శక్తి అని ఆ రెండు పదాల కలయిక సూచిస్తున్నది. మరోలాగా చెపితే ఆత్మానుభవం ఏ ఒక్క సామాన్యశక్తి వలనా సాధ్యపడదు. నైతిక జీవనంతో వాటన్నిటినీ పరిశుద్ధం

చేసి ఏకాగ్రమైన నిర్ధారణ కలిగించే మరొక శక్తిగా ఏర్పడును.  ఆ అతేంద్రియ భావం, మన జీవితపు సర్వోన్నతములగు విలువలన్నింటికీ పరాకాష్ట కూడా.

సృష్టికి సహజమైన కారణాలుగా చెప్పబడే వాటి వెనుక కూడా ఉన్న నిజమైన శక్తి భగవంతుడే అని గుర్తించకపోవడమే ఈ తాత్త్వికుల భ్రాంతి.  ఆ భగవంతుని, తన యందే ఆసీనుడైయున్నాడని తెలుసుకుంటే అతడు సంసార వృక్షాని కంటె కాలము రూపముల కంటె భిన్నుడని గ్రహింపుకు వస్తుంది.  భగవంతుని ప్రతిఫలించే శ్రేష్ఠతమమైన అద్దం మానవుని ఆత్మయే.  ఇంద్రియ జ్ఞానం కాని, తదితర జ్ఞానం కాని మొత్తం జ్ఞానమంతా సకల జ్ఞానానికి మూలమైన ఆ భగవంతుని వలననే కలుగుచున్నదని గ్రహించవలెను.  తన సాన్నిధ్యమాత్రం చేతనే ప్రాణశక్తిని కార్యోన్ముఖం చేస్తున్నట్లు మాత్రమే చెప్పబడటం గమనించదగిన విషయం.  ఎంచేతనంటే ఆత్మ స్వయంగా ఏ కార్యము చేయదు.  లోక వ్యాపార రూపంగా పరిణతి చెందేది ప్రాణశక్తి, మనస్సు కూడా.  దాని అభివ్యక్తి యగు ప్రాణ శక్తికి సూత్రాత్మ అని మరొక  పేరు.

ఈ విషయమే దక్షిణామూర్తి స్తోత్రములో మూడవ శ్లోకం దృఢీ కరించుచున్నది. **"శ్లో॥ యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే॥"** యస్య = ఎవని యొక్క, సత్ ఆత్మకం = సద్రూపమైన (ఉండు స్వభావముగల యనుట), స్ఫురణమేవ = ప్రకాశమే, అసత్కల్ప అర్థగం = ఉన్నవానిలో సమానములు కాని అర్థములను బొందినదిగా, భాసతే = ప్రకాశించుచున్నదో.  మనందరియందున్న ఆ స్ఫురణ శక్తితో బ్రహ్మ సాక్షాత్కారము పొంది కృతార్థులమగుదము గాక.

ఓం తత్ సత్.

# గీ తా మ హా వా క్య ము

**శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ:॥ భ.గీ.అ.18.శ్లో.66**

భావము:- సర్వధర్మములను పరిత్యజించి, నా ఒక్కని యందే శరణు బొందుము. అపుడు నేను నిన్ను సర్వపాపముల నుండి మఱియు అశుభముల నుండి విడిపించెదను. కావున శోకింపకుము.

ఈ శ్లోకము గీతాసారముగ గ్రహింపనగును. దీనియందుగల అర్థపూరము, అనంతార్థము అంతరాత్మ యొక్క సంతత వర్ధమాన అనుభవము నందే వ్యక్తము కాగలదు గాని, దాని మానసిక ప్రతిపాదనము నందు గాదు. మున్ముందు గీత ఒక సునిర్మిత యోగమార్గమును మనకు జూపును. తర్వాత తదనుష్ఠానమునందు మన బుద్ధికి బొడము శంకలను బాపుటకు ఒక సువిశాల దార్శనిక సిద్ధాంతమును ప్రతిపాదించును. యోగము వస్తుతం ధర్మానుష్ఠానమే గాన, గీత స్వధర్మాది, ఉత్తరోత్తర విశాలతర ధర్మములను గట్టిగా ఒత్తి చెప్పును. ఆయా ధర్మానుష్ఠానమునకు దోహదము చేయు అనేక నియమములను, విధులను, వక్కాణించును. చివరకు తన ధర్మ నిర్మాణమునే తాను భంగించి **"సర్వధర్మములను కొట్టివేయుము, కొట్టివేసి ఒక్క భగవంతునికి మాత్రమే నిన్ను నీవు నివేదించుకొనుము. నీవు చేయవలసినదంతయు నిదియే. ఇదియే సత్యము బృహత్తర మార్గము. ఇదియే వాస్తవ విమోక్షము"** అని ముగించును.

ఇతర మతములన్నియు తమతమ ధర్మములయొక్క పరిధిలో సాధకుని పట్టియుంచగా, గీత అతనిని ధర్మాతీతమునందలి పరమ స్వేచ్ఛలోనికి వదలివేయును. యీ ధర్మాతీత పరమ స్వేచ్ఛయే భగవంతుని స్వరూపము. ఏలయన, భగవంతుడు

ప్రపంచమును కొన్ని నిగూఢ నియమముల ననుసరించి నడుపుచున్నను, మానవుని జ్ఞానాజ్ఞానములు, పుణ్యాపాపములు, యుక్తాయుక్తముల, ధర్మముల ననుసరించి ఉద్ధరించుచూ వున్నను, అతడు మాత్రము వీనినన్నింటిని అతిక్రమించియుండును. కనుకనే అతని స్వేచ్ఛకే క్షతియునుండదు.

**"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనగా బాహ్య ధర్మములు మానసిక ధర్మములు, చివరకు స్వభావధర్మములు అని గ్రహించవలెను. అట్లు పరిత్యజింపనిదే అతనిని ఆశ్రయించి, సర్వసమర్పణము చేయజాలడు. ఆ తర్వాతనే భగవచ్ఛక్తి నీ యోగము చేపట్టి నీలో పని చేయును. అది జ్ఞానము విధించు ధర్మములకు లోబడి పనిచేయదు. **"సర్వధర్మాన్ పరిత్యజ్య"**కు **"మామేకం శరణం"**కు **"అహం మోక్షయిష్యామి"**కి మధ్యనున్న క్రమగత సంబంధమిదియే. జీవుడు తన యొక్క గుణభావము, స్వభావము మఱియు బ్రహ్మ భావముద్వారా పయనించి భగవద్భావము నొందును. (భ.గీ.అ.13శ్లో.19) అనునదియే గీతా సిద్ధాంతము. భగవత్ జ్ఞానమునకు మనస్సు యొక్క అజ్ఞానమునకు పొత్తుకుదరదు గదా! దాని నిబంధనలకు లోబడి మోక్షము సాధించలేము. కాన నన్నొక్కనినే శరణుబొందుమని భగవంతుని భావము.

**"అహమత్వా మోక్ష యిష్యామి"** ఇక్కడ మనము మానవ లోకమునుండి దివ్యలోకములోని కడుగిడుచున్నాము. ఈ సర్వ విధ పురుషకారము అనగా స్వప్రయత్నము, స్వశిక్షణము అవశ్యము కాదు. నియమములు, ధర్మములు, అనుష్ఠానములు అను పరిమిత తత్త్వములను త్రోసివేయవచ్చును. సమగ్రంగా ఆత్మార్పణ చేసి కొన్నచో, భగవంతునకు ఒక తటస్థ ఉపకరణ మగుదుము. మన హృదయేశ్వరుడు మనకు ఆ శ్వాసమిచ్చును. వాగ్దానము చేయును. ఇది స్వప్రయత్నము నుండి ఈశ్వర ప్రయత్నములోనికి చేయబడు సంక్రమణము. మానసిక ప్రాణిక ప్రతి క్రియలనే స్వప్రయత్నమనియు, స్వకర్మమనియు మనము ఘనముగా పిలుచుకొందుము.

ఒకప్పుడు ప్రేరణ భగవంతునిది, కర్మ మానవునిది. ఇప్పుడు ప్రేరణ కర్మ రెండును భగవంతునివే. ఇది అంత: సన్యాసము యొక్క పరాకాష్ఠ.

భగవంతునికి సత్తా సంభూతులు రెండును గలవు. సత్తయనగా మనకు తెలియును. సంభూతి యన సత్తకు ఏ శక్తిగలదో, ఆ శక్తి ప్రవాహము. అభివ్యక్తి యందు ఆ శక్తి యొక్క రూపధారణ ఈ సృష్టి ప్రవాహము. భగవంతుని సంభూతి పార్శ్వము గాన ప్రకృతి అనేకత్వము సత్యము. ఆ అనేకత్వమునకు ఆధారమైన ఆత్మ-ఏకత్వము సత్యతరము. ఈ రెండింటికిని సమన్వయ స్థానము. ఈ రెండిండికి అతీతము అగు పురుషోత్తమ తత్త్వము సత్యతమము; మహత్తమము అగును.

మాశుచ: = శోకింపకుము. బుద్ధికి అధర్మముగా తోచు ఘోర కర్మ చేయవలసి వచ్చినదే యని అర్జునుని చింతయే దు:ఖమునకు కారణం అపర ప్రకృతికి గల పరిమితత్త్వ బంధనములే పాపములు. చివరకు స్వధర్మములు బంధకరములే గాన సర్వధర్మములు పాపములే. ఈ వాక్యము సందర్భ శుద్ధి లేకుండ చదివిన, అది హాస్యాస్పదము, అపాయకరమునగును. దీని తాత్పర్యము ధర్మములేదని గాదు. **"ధర్మే సర్వం ప్రతిష్ఠితం"** ధర్మమునందే సర్వము నిలిచియున్నది. దేనియందు విశ్వమంతయు ప్రతిష్ఠితమై యున్నదో, అట్టి ధర్మమును గీత శాశ్వత ధర్మమని చెప్పుచున్నది. ఈ క్రింది శ్లోకము గమనింపుము.

**శ్లో॥ బ్రహ్మణోహి ప్రతిష్ఠాఽహ మమృత స్యావ్యయసనా చ।**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖ స్యైకాంతి కస్య చ॥** **అ.14.శ్లో.27**

కాన సర్వధర్మములను పరిత్యజించి ధర్మముకాని యీ ధర్మమును మనము చేరుకొనవలెను. అదియే మన జీవన సంసిద్ధి. సాధకుని ఆత్మ సమర్పణము, భగవంతుని శక్త్యవతరణము, సాధకుని ప్రకృతి పరివర్తనము భగవద్గీతయందు కాననగును. **"సర్వమిద మహంచ బ్రహ్మైవ"** నేను యీ సమస్తము బ్రహ్మమే అని

ప్రత్యగ్దృష్టితో అను సంధానము చేయును.  గీతయందు భావి దివ్యజీవన బీజములను యీ రీతిగా జూడనగును.  కాన గీత మహాగ్రంథమని చెప్పబడినది.

యీ నామరూప దృశ్య ప్రపంచము సత్యమని తలంచి నేను, నాది అని మోహించి దు:ఖితుడైన అర్జునుడు (మానవుడు) దృగ్రూపుడైన భగవంతుడే నిత్యము సత్యమని వివేచించి నిశ్చయించి, మోహమును వీడి ఆనంద రూపమున ఉండును.  ఇదియే గీతాసారము.

ఓం తత్ సత్.

# సంక్షేపాక్షర వివరణం

| | | |
|---|---|---|
| శ్వే. ఉ. | = | శ్వేతాశ్వతరోపనిషత్తు |
| భ. గీ. | = | భగవద్గీత |
| మా. కా. | = | మాండూక్యకారికలు |
| వై.ప్ర. | = | వైతథ్య ప్రకరణము |
| వి.చూ. | = | వివేక చూడామణి |
| మా.ఉ. | = | మాండూక్యోపనిషత్తు |
| ము.ఉ. | = | ముండకోపనిషత్తు |
| చా.ఉ. | = | చాందోగ్యోపనిషత్తు |
| భృ.ఉ. | = | భృహదారణ్యకోపనిషత్తు |
| క.ఉ. | = | కఠోపనిషత్తు |
| **2-2-1** | = | రెండో అధ్యాయము, రెండోవల్లి, ఒకటవ మంత్రం |
| కై.ఉ. | = | కైవల్యోపనిషత్తు |
| కఠ | = | కఠోపనిషత్తు |
| **5-13** | = | ఐదవ అధ్యాయము, పదమూడవ శ్లోకం |
| మం | = | మంత్రము |
| తే. గీ. | = | తేట గీత |
| మై. ఉ. | = | మైత్రేయ్యుపనిషత్తు |
| ఉ. సా. | = | ఉపదేశిసాహ్రశి |
| అ. అ. | = | అద్వైతానుభూతి |